తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

# జనంసాక్షి

Estd : 2002
www.janamsakshi.org
శుక్రవారం 30.05.2025 | సంపుటి :11 సంచిక : 311 | పేజీలు :12 వెల : రూ. 4/-




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఉత్తమ చిత్రం కల్కి.. ఉత్తమ నటుడు అల్లు అర్జున్

గద్దర్ అవార్డులు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం




హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న గద్దర్ ఫిల్మ్ అవార్డులను జ్యూరీ ఛైర్‌పర్సన్ జయసుధ ప్రకటించారు.ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు రాగా వాటిని పరిశీలించిన అనంతరం అవార్డు గ్రహీతల పేర్లను ప్రకటించారు. ఉత్తమ నటుడిగా 'పుష్ప 2' చిత్రానికి గానూ అల్లు అర్జున్ ఎంపికయ్యారు. ఉత్తమ చిత్రాలుగా కల్కితో పాటు మరో రెండు సినిమాలకు మిగతా 2లో..

## వరి సాగులో తెలంగాణ దేశంలోనే నెం.1



- అత్యంత పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు
- ఎప్పటికప్పుడు రైతులకు డబ్బుల చెల్లింపులు
- వానాకాలం సాగు రైతులను సన్నద్ధం చేయాలి
- ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూడాలి
- అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం
- అనర్హులకు అందిచే వారిపై కఠిన చర్యలు
- అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పండని విధంగా అత్యధికంగా దేశ చరిత్రలోనే తెలంగాణ వరి సాగులో నంబర్ వన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీ లో నుంచి చుక్క నీరు రాకున్నా అధికారుల సహకారం ప్రభుత్వం చేపట్టిన పకడ్బందీ చర్యల వల్ల అత్యధికంగా వరి సాగైందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వానాకాలం పంటల సాగు సన్నద్ధతపై కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మిగతా 2లో..

## వీర తిలకం దిద్దితే.. యుద్ధం మధ్యలో చేతులెత్తేశారు



### దేశ ఆత్మగౌరవాన్ని ట్రంప్ వద్ద మోడీ తాకట్టుపెట్టారు
### ప్రధానిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం

- పాక్‌తో యుద్ధం అర్ధంతరంగా ఎందుకు ఆపారు?
- ట్రంప్ ఒత్తిడికి ఎందుకు తలొగ్గారు?
- కాల్పుల విరమణ గురించి అఖిలపక్షానికి ఎందుకు చెప్పలేదు?
- గుండెధైర్యం ఉన్నవారే యుద్ధాన్ని గెలిపిస్తారు
- ఇందిరాగాంధీ పాక్‌పై అలాగే గెలిచారు
- జైహింద్ ర్యాలీలో ముఖ్యమంత్రి సంచలన వ్యాఖ్యలు

మేడ్చల్,మే29(జనంసాక్షి):పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే విషయంలో కేంద్రానికి సహకరించామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యుద్ధం అంటే ధైర్యం, వెన్నెముక, యుద్ధతంత్రం ఉండాలని చెప్పుకొచ్చారు. నాలుగు రోజుల యుద్ధం తర్వాత అర్థాంతరంగా ఎందుకు ఆపేశారని ప్రశ్నించారు. యుద్ధం చేయాలను కున్నప్పుడు అఖిలపక్షాన్ని పిలిచారని.. యుద్ధం ఆపేసినప్పుడు అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తారని తెలిపారు. ఉగ్రవా దులను తుదముట్టించేవరకు సైన్యానికి అండగా ఉంటామని తెలిపారు. ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలో గురువారం జై హింద్ యాత్ర నిర్వహించారు. బాచుపల్లి వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి జైహింద్ మిగతా 2లో..

## బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర

### భారాసను గంపగుత్తగా భాజపాకు అప్పగించాలన్న ప్రయత్నం జరుగుతోంది

- జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదను వ్యతిరేకించా
- ఏ పార్టీలోనూ విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం
- లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపమా?
- కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నేతలెవరూ స్పందించకపోతే ఎలా?
- కడుపులో బిడ్డను పెట్టుకుని ఉద్యమంలో పనిచేశా
- నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర..
- మీడియాతో కవిత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్(జనంసాక్షి): భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీక్ అయిందని ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కట్టడి చేయమంటే పెయిడ్ సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారని ఆరోపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. 'కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నేతలెవరూ స్పందించకపోతే ఎలా? నాకు నీతులు చెబుతూ కోవర్టులు ఉన్నారంటున్నారు. నా మీద పడి ఏడిస్తే ఎలా?ఇంటి ఆడబిడ్డ గు రించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా? లిక్కర్ కేసు సమయంలో రాజీనామా చేస్తానంటే కేసీఆర్ వద్దని వారించారు. ఎంపీగా పోటీ చేస్తే సొంత పార్టీ వాళ్లే కుట్రపూరితంగా ఓడించారు. అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉండాలని కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారు. లీకు వీరులను ఎండగట్టమంటే నాపై మిగతా 2లో..

## నిరుపేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు

- ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు
- రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి..సేకరణ
- ధాన్యం సేకరణలో భద్రాద్రి, ఖమ్మం రికార్డు
- అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం(జనంసాక్షి):అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు.

మిగతా 2లో..

## ఆయుధాలు రాని ఒప్పందాలెందుకు?



### రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలోనే ఏయిర్‌మార్షల్ చీఫ్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగు తాయి కానీ.. డెలివరీలు మాత్రం మొదలుకావని వాయుసేన అధిపతి ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.సీఐఐ వార్షిక సమావేశంలో ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేశారు.''చాలా సార్లు కాంట్రాక్టులపై సంతకాలు జరగుతాయి.. కానీ, సిస్టమ్స్ (ఆయుధాలు) మాత్రం ఎప్పటికీ అందవు. టైమ్‌లైన్ ప్రధాన సమస్య. సకాలంలో పూర్తయిన ఒక్క ప్రాజెక్టు కూడా నాకు గుర్తుకురావడంలేదు. మనం చేయలేని పనికి ఎందుకు వాగ్దానాలు చేయడం? తేజస్ ఎంకే1 చాలా ఆలస్యమైంది. ఇక తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ కూడా అందు బాటులోకి రాలేదు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటి వరకు నమూనా విమానం కూడా రాలేదు. మన దళాలు.. పరిశ్రమ మధ్య మిగతా 2లో..

## త్వరలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు

### మహమ్మద్ యూనస్ ప్రకటన



ఢాకా(జనంసాక్షి): రాజకీయ అనిశ్చితిలో ఉన్న బంగ్లాదేశ్‌లో మరోసారి నిరసనలు కొనసాగుతున్నాయి. ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్లు వెల్లువెత్తున్నాయి.వీటిపై మిగతా 2లో..

## 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

- ధరణి కష్టాలు రిపీట్ కాకుండా భూమాత
- సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



ఖమ్మం(జనంసాక్షి): జూన్2 న భూమి లేని నిరుపేద రైతులు ఎవరైతే అసైన్డ్ భూములను సేద్యం చేస్తున్నారో వారికి పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అధికారులతో జరిగిన సమావేశంలో పొంగులేటి కీలక సూచనలు చేశారు. ధరణిలో ఏర్పడ్డ ఇబ్బందులు మళ్ళీ రిపీట్ కావద్దని, ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు- జరగొద్దని తెలిపారు. చిన్న చిన్న భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సరదాల కోసం ఉద్యోగాలు చేయొద్దని స్పష్టం చేశారు. ఇది పేదల ప్రభుత్వం, అలసత్వం వహిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిగతా 2లో..

## ప్రజలకు వాస్తవాలు చెప్పండి

- లేఖలు, లీకులు కాదు..
- కవితకు ఎంపి చామల సూటి ప్రశ్న

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ గురించి వాస్తవాలు చెప్పాలని అనుకుంటే లేఖలు, లీకులు కాదని.. అందుకు అవసరమైన ఆధారాలు కవిత బయటపెట్టాలని భువనగిరి కాంగ్రెస్ మిగతా 2లో..

## తెలంగాణ కాంగ్రెస్‌కు ఐదు కమిటీలు



### ప్రకటించిన ఏఐసీసీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణ కాంగ్రెస్‌లో ఐదు కమిటీలను కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసింది. 22 మందితో రాజకీయ వ్యవహారాల కమిటీ, 15మందితో సలహా కమిటీ, ఏడుగురితో డీలిమిటేషన్ కమిటీ, 16మందితో సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ కమిటీ, ఆరుగురితో క్రమశిక్షణా చర్యల కమిటీలను నియమిస్తూ గురువారం రాత్రి ఏఐసీసీ ప్రకటన విడుదల చేసింది.

**రాజకీయ వ్యవహారాల కమిటీలో ఉన్నది వీరే..**

రాజకీయ వ్యవహారాల కమిటీలో మీనాక్షి నటరాజన్, బి.మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, చల్లా వంశీచంద్ రెడ్డి, జి.రేణుకా చౌదరి, బలరాం నాయక్, డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, షబ్బీర్ అలీ, అజహరుద్దీన్, ఆది శ్రీనివాస్, శ్రీహరి ముదిరాజ్, బీర్ల ఐలయ్య, పి.సుదర్శన్ రెడ్డి, కె.ప్రేమ్ సాగర్ రావు, జెట్టి కుసుమ్ కుమార్, ఎరవర్తి అనిల్ కుమార్ ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, ప్రత్యేక ఆహ్వానితులుగా క్యాబినెట్ మంత్రులు ఉంటారు.

**అడ్వైజరీ కమిటీ:**మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, వి.హనుమంతరావు, జానారెడ్డి,

మిగతా 2లో..

## గాజాలో మిన్నంటిన ఆకలికేకలు

### ఆకలితో గోదాములపై ప్రజల దాడులు .. తీవ్ర ఆహార సంక్షోభం

గాజాస్ట్రిప్(జనంసాక్షి):ఇజ్రాయెల్– హమాస్‌ల మధ్య పోరు తీవ్రతరమైంది. ఈ పోరులో గాజాలో అనేకమంది సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.మరోవైపు ఆ ప్రాంతంలో ఆకలి సంక్షోభం నెలకొంది. అన్నపానీయాలతో పాటు ఇతర అత్యవసర సామగ్రి సరిగా అందక ప్రజలు అల్లాడుతున్నారు. ఈక్రమంలో ఆకలి తీర్చుకునేందుకు మిగతా 2లో..





## బెంగాల్‌లో నిర్మమత ప్రభుత్వం నడుస్తోంది

### వరుస సంక్షోభాలతో రాష్ట్రం సతమతం
### బెంగాల్ ర్యాలీలో మమతపై విరుకుపడ్డ మోడీ

కోల్‌కతా(జనంసాక్షి): ప్రస్తుతం బెంగాల్ రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్, మాల్దాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. గురువారం పశ్చిమ బెంగాల్‌లోని మిగతా 2లో..

## మా సైనిక స్థావరాలపై భారత్ మెరుపుదాడులు

### అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణులతో విరుచుకుపడింది
### మాకు ప్రతిస్పందించే సమయం కూడా ఇవ్వలేదు
### పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్




ఇస్లామాబాద్(జనంసాక్షి): ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్, పీవోకేలో దాడులు చేసిన భారత సైన్యం.. అనేక ఉగ్ర, సైనిక స్థావరాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ దాడులు జరిగిన విషయాన్ని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. పాక్ సైన్యం మేల్కొనేలోపే కీలక సైనిక స్థావరాలే లక్ష్యంగా బ్రహ్మోస్ క్షిపణులతో భారత్ మెరుపు దాడులు చేసిందన్నారు. వాస్తవానికి మే 10వ తేదీ తెల్లవారుజామున భారత్‌పై దాడులు చేసేందుకు తమ సైన్యం సిద్ధమైందని, అంతలోపే భారత క్షిపణులు తమ స్థావరాలపై విరుచుకుపడ్డాయన్నారు. ''భారత్ దాడులను దీటుగా తిప్పికొట్టాలని మే 9వ తేదీ రాత్రి మేం మిగతా 2లో..

## ట్రంప్ టారిఫ్‌లకు ఎదురుదెబ్బ

### సుంకాల అమలు నిలుపుదలకు న్యాయస్థానం ఆదేశం

వార్త 2లో



## బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర

ప్రతాపం చూపుతున్నారు. కాంగ్రెస్, భాజపాపై మాట్లాడాలి కానీ.. నాపై దాడి చేస్తే ఎలా? భారాసను గంపగుత్తగా భాజపాకు అప్పగించాలన్న ప్రయత్నం జరుగుతోంది. జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదన వస్తే నేను వ్యతిరేకించాను. భాజపాలో భారాస విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. నాపై దుష్ప్రచారం చేస్తున్నా పార్టీ స్పందించలేదు. నన్ను పార్టీ నుంచి బయట బయటకు పంపుతారా?.. అంత సీన్ లేదు. కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినట్లు జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధం. భారాసలో కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు.. ఆయన నాయకత్వంలోనే పనిచేస్తాను. వెన్నుపోటు పొడవడం నా లక్షణం కాదు.. నేరుగానే పోరాడతాను. కొత్త పార్టీ అవసరం లేదు.. ఉన్న పార్టీని బాగా చూసుకుంటే చాలు. లేఖలో నేను చేసిన సూచనల్లో ఒక్కటైనా తప్పుందా? కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లు అయ్యారా? కడుపులో విషం పెట్టుకుని బయటకు నవ్వుతూ ఉండలేను. నా తండ్రికి వందల లేఖలు రాశాను.. తప్పేంటి?సాధారణంగా కేసీఆర్ లేఖను చదివాక చింపుతారు. ఈసారి అలా చింపలేదు. కుట్ర ఎవరు చేశారో నాకు తెలియదు.. బయటపెట్టాలని అంటున్నాను. లీకు వీరుడా.. లీకు వీరులా? అనేది తెలియాలి.దేశం వెలుపల ఐదే సెల్‌లు పెట్టి నాపై ప్రతాపం చూపిస్తే ఎలా?దొంగల్ని పట్టుకోకుంటే చేతగాక నాపై ప్రతాపం చూపితే ఎలా? పార్టీ నాది అని ప్రతి ఒక్కరూ పోరాడితేనే ఫలితం ఉంటుంది. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే.. కేవలం 'ఎక్స్'లో పోస్టు పెట్టి వదిలేస్తే ఎలా? నేను ఏనాడూ పదవుల కోసం పోరాడలేదు. కడుపులో బిడ్డను పెట్టుకుని తెలంగాణ ఉద్యమంలో సైనికురాలిగా పనిచేశాను. నన్ను విమర్శిస్తున్న నేతలు కేసీఆర్ నీడన ఉన్నారు తప్ప.. చేసిన కార్యక్రమాలు ఏమున్నాయి? వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఇవ్వాల్సిన ప్రోటోకాల్.. గౌరవం ఉంటుంది. తెలంగాణ జాగృతి ఉద్యమ సంస్థ.. అది ఇవాళ పుట్టింది కాదు. పార్టీ చేయని కార్యక్రమాలను జాగృతి తరఫున చేస్తున్నాం. సాంస్కృతిక, సమకాలీన అంశాలపై బలంగా పోరాడాం.నా తండ్రిని, నా కుటుంబాన్ని వదిలి నేనెందుకు వెళ్తాను?నా కుటుంబానికి నన్ను దూరం చేసే ప్రయత్నం జరుగుతోంది. దూరం చేస్తే ఎవరికి లాభం జరుగుతుందో ఆలోచించుకోవాలి. నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర చేస్తున్నారు. నేను ఎవరి నాయకత్వం కింద పనిచేయను.. కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు. దామోదర్‌రావు, గంగ్ర మోహన్‌రావు ఎవరు పంపారో నాకు తెలియదు. వాళ్లిద్దరూ కేసీఆర్ దగ్గరి నేతలు కదా! వేరే నేత అంశంలో స్పందించిన పార్టీ.. నా విషయంలో ఎందుకు స్పందించడం లేదు? భారాస బలహీనమైతే కాంగ్రెస్, భాజపాలకు లాభం చేకూరుతుంది. కేసీఆర్ ఎలాంటి తప్పు చేయలేదు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.. అందులో ఎలాంటి అనుమానం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి కానీ.. 'ఎక్స్'లో పోస్టులకు పరిమితమైతే ఎలా?" అని కవిత ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ప్రజలకు వాస్తవాలు చెప్పండి

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో జరిగిన అవినీతిపై కవిత దర్యాప్తు కోరాలని అన్నారు. గురువారం ఢిల్లీలో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దెయ్యాలు ఎవరో కవిత బయటపెట్టాలని.. దర్యాప్తు కోరాలని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తున్నాయని తమ నేతలు మొదటి నుంచి చెబుతునే ఉన్నారని గుర్తుచేశారు. ఈరోజు కవిత వ్యాఖ్యలు దాన్ని నిజం చేశాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌కి కవిత అవసరం లేదని.. తమకు సమర్థమైన నాయకత్వం ఉందని.. తమ పార్టీలోకి కొత్త వాళ్లు అవసరం లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఆయుధాలు రాని ఒప్పందాలెందుకు?

విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది. పారదర్శకత చాలా అవసరం. మనం ఒక్కసారి దేనికైనా కట్టుబడితే.. దానిని అందించి తీరాల్సిందే. మేకిన్ ఇండియా కోసం వాయుసేన శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది.మనం ఈ రోజు సంసిద్ధంగా ఉంటేనే.. భవిష్యత్తుకు సన్నద్ధం కాగలము. రానున్న పదేళ్లలో.. మన పరిశ్రమలు ఉత్పత్తిని గణనీయంగా పెంచగలవు. కానీ, ప్రస్తుతానికి మనం త్వరగా చర్యలు తీసుకోవడం అవసరం. దళాలను శక్తిమంతం చేసుకొంటేనే యుద్ధాలు గెలుస్తాం" అని పేర్కొన్నారు. యుద్ధ రంగంలో వేగంగా మారిపోతున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ సూచించారు. "మన నౌకాదళాధిపతి చెప్పినట్లు యుద్ధ రంగం వేగంగా మారిపోతోంది.2016 నుంచి ఇప్పటి వరకు తొలి 40 విమానాల డెలివరీ కూడా పూర్తికాలేదు" అని నాడు ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది.

## గాజాలో మిన్నంటిన ఆకలికేకలు

అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటుచేసిన గిడ్డంగుల పైనే ఏకంగా దాడులకు పాల్పడుతున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. గాజా ప్రజలకు అందించే మానవతా సాయం తరలింపునకు టెల్‌అవీవ్ పరిమితంగానే అనుమతించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే డీర్ అల్ బలాహ్‌లోని ఆహార పదార్థాల గిడ్డంగిపై ప్రజలు దాడి చేశారని గిడ్డంగి అధికారులు తెలిపారు. గోధుమపిండి, ఇతర ఆహార పదార్థాలు కలిగిఉన్న పెట్టెలను లూటీ చేసినట్లు వెల్లడించారు. గాజాలో మానవతా అవసరాలు అదుపుతప్పాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలకు అందే సాయాన్ని తక్షణమే పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ గందరగోళం నేపథ్యంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి నెట్టింట వైరల్ అవుతున్న వీడియోలో గన్ పేలుడు శబ్దాలు కూడా వినిపిస్తున్నాయి.ఐక్యరాజ్యసమితితో పాటు అంతర్జాతీయ సంస్థలకు చెందిన 121 ట్రక్కుల మానవతా సాయం బుధవారం గాజాలోకి ప్రవేశించాయని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. అయితే, ఇది అక్కడి ప్రజల అవసరానికి అందుబాటులో లేదని ఐరాస అధికారులు పేర్కొంటున్నారు. ఈ సాయం మరింత పెరగాలని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఐరాస మానవతా కార్యాలయం అధికారి జొనాథన్ విటల్ మాట్లాడుతూ.. గాజాకు అందించే సాయాన్ని హమాస్ మళ్లిస్తోందనే ఆరోపణలను ఖండించారు. ఇజ్రాయెల్‌లోని కెరెమ్ షాలోమ్ సరిహద్దులు దాటే సమయంలో ఒక క్రిమినల్ గ్యాంగ్ ఈ సాయాన్ని లూటీ చేస్తోందని ఆరోపించారు. ఈసందర్భంగా గాజాకు అందే మానవతా సాయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 2023 అక్టోబర్ నుంచి ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య జరుగుతోన్న పోరులో 54 వేల మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. మానవతా సాయాన్ని పరిమితంగా అందించేందుకు ఇజ్రాయెల్ అనుమతిచ్చింది. అయితే, ఇది అక్కడి ప్రజలకు ఏమాత్రం సరిపోదనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా.. గాజాలో మానవతా సాయాన్ని ఇప్పటివరకు ఐరాస సంస్థలు, ఇతర స్వచ్ఛందసంస్థలు పర్యవేక్షించేవి. అయితే ఆ సాయం హమాస్‌కు చేరుతోందని, దాన్ని తప్పించేందుకు గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్‌ను ఇజ్రాయెల్ ఏర్పాటుచేసింది.

## తెలంగాణ కాంగ్రెస్‌కు ఐదు కమిటీలు

కేకే,మధుయాష్కీ గౌడ్, చిన్నారెడ్డి,గీతారెడ్డి, అంజ న్‌కుమార్ యాదవ్, జ య ప్రకాశ్ రెడ్డి,జాఫర్ జావేద్, జీవన్ రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, రాములు నాయక్
**డీలిమిటేషన్ కమిటీ:**చల్లా వంశీచంద్ రెడ్డి (ఛైర్మన్), గద్వాల విజయలక్ష్మి, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, డా. శ్రవణ్ కుమార్ రెడ్డి, పవన్ మల్లాది, డి.వెంకటరమణ
**సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ కమిటీ:**పి. వినయ్ కుమార్ (ఛైర్మన్), అద్దంకి దయాకర్, కె.శంకరయ్య, ఎన్.బాలు నాయక్, ఎ.నర్సిరెడ్డి, ఆత్రం సుగుణ, రాచమళ్ల సిద్ధేశ్వర్, సంతోష్ కొలకొండ, డా.పులి అనిల్ కుమార్, జూలూరి ధనలక్ష్మి, మజీద్ ఖాన్, జి.రాములు, అర్జున్ రావు, శౌరి, కొల్లం వల్లభ్ రెడ్డి, వి.శ్రీకాంత్ రెడ్డి
**క్రమశిక్షణా చర్యల కమిటీ:**మల్లు రవి (ఛైర్మన్), ఎ.శ్యామ్ మోహన్ (వైస్ ఛైర్మన్), ఎం.నిరంజన్ రెడ్డి, బి.కమలాకర్‌రావు, జాఫర్ జావేద్, డా.జీవీ రామకృష్ణ

## వీర తిలకం దిద్దితే.. యుద్ధం మధ్యలో చేతులెత్తేశారు

యాత్ర కొనసాగింది.జై హింద్ యాత్ర అనంతరం నిజాంపేట కౌలాస్ గోపాల్‌రెడ్డి కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ.. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధంతరంగా ఆపేశారా అని నిలదీశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం ఆపాలని ప్రకటించారని గుర్తుచేశారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధాంతరంగా ఆపేశారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. పీవోకేను స్వాధీనం చేసుకోవాలని మోదీతో తాము చెప్పామని అన్నారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌ను ఓడించామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. భారత్ వైపు ఎవరు కన్నెత్తి చూసినా కనుగుడ్లు పీకేస్తామని.. చైనాకు ఇందిరాగాంధీ వార్నింగ్ ఇచ్చారు. గతంలో యుద్ధం ఆపాలని ఇందిరాగాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారు. ఇందిరాగాంధీ అమెరికా బెదిరింపులకు లొంగలేదు. నాటి ఇందిర యుద్ధతంత్రాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఇందిరాగాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి. 1967 చైనా, 1971లో పాకిస్థాన్‌ని ఓడించిందని కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలి. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు. భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు- పెడతారా. యుద్ధం అంటే ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. భారతదేశ భద్రత విషయంలో అందరం ఏకమవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాలకు అండగా నిలిచామని ఉద్ఘాటించారు. దేశంపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని ధ్వజమెత్తారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడిస్తే.. 14 రోజుల్లోనే మల్కాజ్‌గిరిలో ఎంపీగా గెలిపించారని ఉద్ఘాటించారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికయ్యానని.. ఇప్పుడు తెలంగాణ సీఎంగా ప్రజల ముందుకువచ్చానని గుర్తుచేసుకున్నారు. మేం నిర్వహించిన ర్యాలీ ఎన్నికల, ఓట్ల కోసం కాదు..సైనికుల ఆత్మ స్థైర్యం, ఆత్మగౌరవం నిలబెట్టడానికి. కాలం చెల్లిన రూపాయి ప్రధాని మోదీ. దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం. బలూచిస్థాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయమన్నాం. ఇది చేతకాదు కానీ.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. యుద్ధంలో ఎన్ని రఫెల్ విమానాలు నేలకూలాయో లెక్క చెప్పండి. పాక్‌ను ఓడించాలంటే ఇందిరాగాంధీ మార్గంలో..నడవాలని ప్రధాని మోదీకి సూచించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఉత్తమ చిత్రం కల్కి.. ఉత్తమ నటుడు అల్లు అర్జున్

అవార్డులు లభించాయి.
2024 బెస్ట్ ఫిల్మ్స్ ఇవే..
మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898ఏడీ, రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్, మూడో ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్, ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు, హిస్టరీ – హెరిటేజ్ చిత్రం: రజాకార్, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: ఆయ్
ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్ళు)
ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి),ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2), ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు),ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం),ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్,(అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్) ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్– లేదే లేదే ప్రేమసలే),ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్),ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (నిజమే నే చెబుతున్నా – ఊరి పేరు భైరవకోన),ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (సూసేకి అగ్గిరవ్వ – పుష్ప 2), ఉత్తమ హాస్యనటుడు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తువదలరా 2)
ఉత్తమ బాలనటుడు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్),ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి),ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్),ఉత్తమ సినిమాటోగ్రఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి),ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్),ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి), ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (ఆయుధ పూజ – దేవర),ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: అద్నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ),ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్),ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి 2898 ఏడీ)
స్పెషల్ జ్యూరీ అవార్డులు..
నటుడు: దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్),నటి: అనన్య నాగళ్ల (పొట్టేల్),దర్శకులు: సుజీత్, సందీప్ (క),నిర్మాతలు: ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి (రాజు యాదవ్),స్పెషల్ జ్యూరీ స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2),తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: 'మన సినిమా ఫస్ట్ రీల్' (రెంటాల జయదేవ్),14 ఏళ్ల తర్వాత ఈ అవార్డులను ప్రకటించారు. మొత్తం 11 కేటగిరీల్లో వీటిని వెల్లడించారు. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ 31 వరకు ఏడాదికి ఒక ఉత్తమ చిత్రానికి, 2014 నుంచి 2023 వరకు సెన్సార్ అయిన చిత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. 2024కు సంబంధించి అన్ని కేటగిరీల్లోనూ అవార్డులు ఇచ్చారు. తెలుగు చిత్రాలతోపాటు ఉర్దూ చిత్రాలకూ అవార్డుల్లో ప్రాధాన్యతనిచ్చారు. ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు సహా మొత్తం 21 మందికి వ్యక్తిగత అవార్డులు ఇచ్చారు. జూన్ 14న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

## 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

రెవెన్యూలో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సూచించారు. ఫారెస్ట్ అధికారులు సంయమనం పాటించాలని తెలిపారు. గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు, ఒక్క కొత్త చెట్టు- కూడా నరక నివ్వొద్దని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇదే అదును చూసుకొని అటవీ అధికారులు చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని.. ఇక నుంచి పోడు సాగుగూర్చి బానర్ ఐటమ్ కథనాలు రావొద్దన్నారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వం చాలా క్లియర్‌గా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారం ఉన్నా రాష్ట్రాలలో కూడా ఇంటికి 5 లక్షలు ఇవ్వడం లేదని.. పేదవాడికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, పైరవీలు చేయొద్దని తెలిపారు. ఒకటికి పది సార్లు చెప్తున్న అనర్హులకు కాకుండా ఒకటికి పది సార్లు చెప్తున్న అనర్హులకు కాకుండా ఇల్లు ఇస్తే సస్పెండ్ కాదు, అంతకన్నా పెద్ద శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఒక్క రూపాయి లంచం తీసుకున్న సహించేది లేది... ఇందిరమ్మ ఇళ్ల ముసుగు లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. నియోజక వర్గానికి 3500 ఇల్లు కాకుండా ఐటిడిఎ పరిధిలో ఇంకా పెంచుదామని తెలిపారు.

## బెంగాల్‌లో నిర్మమత ప్రభుత్వం నడుస్తోంది

అలీపుర్‌దువార్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇండియా... విక్షిత్ భారత్‌గా మారాలంటే.. పశ్చిమ బెంగాల్‌ను కూడా విక్షిత్ పశ్చిమ బెంగాల్‌గా మార్చడం ముఖ్యమని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు కొత్త శక్తిని నింపాల్సిన అవసరం ఉందని.. జ్ఞానం.. విజ్ఞాన కేంద్రంగా 'మేక్ ఇన్ ఇండియా' కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమత (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నిర్వహించిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. ఈ క్రమంలోనే పోలీసులపైనా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో లాఠీఛార్జ్‌కి దారితీసింది. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసానికి దారితీసింది. ఈ ఘర్షణలపై కలకత్తా హైకోర్టు నియమించిన నిజనిర్ధారణ కమిటీ- ఇచ్చిన నివేదికతో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ చట్ట వ్యతిరేక నిరసనల ఫలితంగా చెలరేగిన మతపరమైన ఘర్షణలకు స్థానిక ఎమ్మెల్యే, నాయకులు కారణమని నివేదిక ప్రస్తావించింది. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఎత్తిచూపింది. ఈ వ్యవహారం భాజపా చేతిలో అస్త్రంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో తాజా ర్యాలీలో మమత ప్రభుత్వాన్ని మోదీ ఎండగట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యక్తులు కొన్ని ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే, పోలీసులు దానిని అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా..? బుజ్జగింపు రాజకీయాల పేరిట గూండాలకు స్వేచ్ఛనిచ్చారు. ఇక్కడ ప్రతి సమస్యకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఏదీ పరిష్కారం కాదని మోదీ దుయ్యబట్టారు. ఈ ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఆ ఆపరేషన్ ఇంకా పూర్తికాలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నాను. ఏప్రిల్ 22 జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైందన్నారు

## త్వరలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు

ఆ దేశ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ తాజాగా మాట్లాడారు. తమ దేశంలో ఎన్నికలు ఈ ఏడాది డిసెంబర్- 2026 జూన్ మధ్య జరగొచ్చని చెప్పారు. కొన్ని సంస్కరణలు చేపడుతున్నామని, అవి పూర్తయిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన ఓ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు.గత ఏడాది రిజర్వేషన్లపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.. .

## మూడు రోజుల్లోగా ఇండియాకు రావాల్సిందే..

**మాజీ ఐపిఎస్ ప్రభాకర్ రావుకు సుప్రీం ఆదేశం**
**ఫోన్ ట్యాప్ కేసులో కీలక పరిణామం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులోఐపీఎస్ అధికారి, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంలో కాస్త ఊరట లభించింది. ఈ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్‌రావు.. ముందస్తు బెయిల్ కోసం సుప్రీంలో పిటిషన్ వేయగా.. గురువారం విచారణ జరిగింది. ప్రభాకర్ రావుకు తాత్కాలిక ముందస్తు బెయిల్‌ను సుప్రీం కోర్టు మంజూరు చేసింది. అలాగే ఇండియా వచ్చేందుకు పాస్‌పోర్ట్‌ను కూడా సుప్రీం ధర్మాసనం మంజూరు చేసింది. మూడు రోజుల్లో ఇండియా రావాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావుకు న్యాయస్థానం ఆదేశించింది. మూడు రోజుల్లో ఇండియా వచ్చి దర్యాప్తునకు సహకరిస్తా అని వెంటనే అండర్ టేకింగ్ ఇవ్వాలని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం ఆదేశించింది. ఇప్పటికిప్పుడు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది.

## ట్రంప్ టారిఫ్‌లకు ఎదురుదెబ్బ

**వాషింగ్టన్(జనంసాక్షి):** 'లిబరేషన్ డే' పేరుతో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలపై భారీస్థాయిలో సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యాయస్థానం ఎదురుదెబ్బ తగిలింది.ట్రంప్ టారిఫ్‌లు అమలుకాకుండా యూఎస్ ట్రేడ్ కోర్టు నిలుపుదల చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం కింద అధ్యక్షుడికి ప్రపంచదేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ విచారణ సందర్భంగా 'భారత్-పాక్ ఉద్రిక్తతల అంశాన్ని ట్రంప్ సర్కారు ప్రస్తావించగా.. కోర్టు దాన్ని తోసిపుచ్చింది. అధ్యక్షుడికి ఉన్న టారిఫ్ అధికారాలను సమర్థించాలని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. చట్టపరంగా ఎదురైన ఈ సవాల్.. చైనాతో వాణిజ్య సంధిని మార్చేస్తుందని, భారత్-పాక్ మధ్య ఘర్షణలను పెంచుతుందని అధికారులు వాదించారు. "టారిఫ్ అధి కారం వల్లనే ఇటీవల భారత్-పాక్ మధ్య కాల్పుల విర మణ ఒప్పందాన్ని ట్రంప్ సాధించగలిగారు" అని కోర్టుకు తెలిపారు. సుంకాలకు సంబంధించి ప్రస్తుతం అనేక దేశాలతో చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ సర్కారు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. ఈ ట్రేడ్ డీల్స్‌ను ఖరారు చేసుకునేందుకు జులై 7 వరకు గడువు ఉందని, అప్పటివరకు దీన్ని చాలా సున్నితమైన అంశంగా పరిగణించాలని కోర్టును కోరింది. అయితే ట్రంప్ అడ్మిస్ట్రేషన్ చేసిన అన్ని వాదనలను కోర్టు తిరస్కరించింది.

## వరి సాగులో తెలంగాణ దేశంలోనే నెం.1



మంత్రులు పొన్నం దుదిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కా న్సింగ్, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, చిన్నమైలు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజె క్టులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, భూభారతి, వరి ధాన్యం కొనుగోళ్లపై దాదాపు నాలుగు గంటల పాటు మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ లో ఎస్సారెస్పీ నీటి విడుదల ప్రణాళికలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపి లను భాగస్వామ్యం చేస్తామని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం సిల్ట్ కారణంగా తగ్గిందని, రాష్ట్ర ప్రభుత్వం పాలసీ ప్రకారం ఎస్సారెస్పీ రిజర్వాయర్ పూడికతీత, డీ సిల్టేషన్ ఆధునిక పద్దతుల్లో పూర్తి చేసి పూర్వపు సామర్థ్యం తీసుకొని వస్తామని అన్నారు. అదేవిధంగా కడెం ప్రాజెక్టు తో పాటు ఇతర ప్రాజెక్టుల్లో సిల్ట్ తొలగించేందుకు అత్యాధునిక పద్ధతులను వినియోగిస్తామని పేర్కొన్నారు. యాసంగి సీజన్ లో తెలంగాణ రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని, స్వతంత్ర భారతదేశంలో ఎక్కడ ఇంత పెద్ద ఎత్తున ధాన్యం సాగు జరగలేదన్నారు. దేశంలో వరి పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని అన్నారు. ప్రాజెక్టులలో ఉన్న నీళ్లు సమర్థవంతంగా వినియోగించడం వల్ల పెద్ద ఎత్తున పంటలు పండాయన్నారు.సాగునీటిని పొదుపు క్రమంగా వాడటం వల్లే పెద్ద ఎత్తున పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు మేడిగడ్డ ప్రాజెక్టు అంశంలో జ్యుడీషియల్ కమిషన్ కు నాయకులు సహకరించాలని మంత్రి కోరారు. జ్యూడిషియల్ కమిషన్ నివేదిక ప్రకారం తప్పనిసరిగా చర్యలు ఉంటాయని అన్నారు. మీడియా మిత్రులకు ఎస్సారెస్పీ దగ్గర అందుబాటులో ఉన్న భూములు పంపిణీకి ఉన్న సమస్యలు పరిష్కరించి త్వరలోనే ఇంటి పట్టాలు కేటాయిస్తామని అన్నారు. కరీంనగర్ మీడియా మిత్రులు ఇండ్ల పట్టాల పంపిణీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ తో చర్చించి త్వరలోనే పట్టాలు అందించే కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాలన దక్షత కారణంగా దేశంలోనే అత్యధికంగా వరి పంట మన తెలంగాణ రాష్ట్రంలో సాగు జరిగిందని, అదే స్థాయిలో భారీ ఎత్తున కొనుగోలు కూడా చేశామని అన్నారు. ఎన్.డి.ఎస్.ఏ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా పాటిస్తామని అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి నిరంతరం జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గత పాలకుల హయాంలో రైస్ మిల్లుల వద్ద తూకం పేరుతో రైతులు అనేక ఇబ్బందులు గురయ్యారని , ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎక్కడ ఇబ్బంది రాలేదని అన్నారు. మలక్ పేట, సూరమ్మ, మోతే నారాయణ పూర్, గౌరవెల్లి, దేవాదుల వంటి ప్రాజెక్టు పనులు వేగవంతం పూర్తి చేయాలని కోరారు. పదేళ్ల కాలంలో వందల ఇండ్ల నిర్మాణాలను సైతం పూర్తి చేయలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 3500 ఇండ్లను ప్రతి నియోజకవర్గానికి కేటాయిస్తున్నదని తెలిపారు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్ కుమార్ ఝ, సత్య ప్రసాద్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ జే.అరుణ వివిధ శాఖల ఉన్నతాధికారులు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు

రికార్డు స్థాయిలో వస్తే.. అంతే స్థాయిలో సేకరిస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో ఎలాంటి లోపాలు జరగవద్దు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. పేదల ఇంటి నిర్మాణానికి గత భారాస ప్రభుత్వం కూడా రూ.5 లక్షలు ప్రకటించింది. కానీ పదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. పూర్తిస్థాయిలో భూభారతి అమలుకు సిద్ధం అవుతున్నాం. ధరణిని రద్దు చేస్తామని ఎన్నికల అజెండాలోనే పెట్టాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అధికారులతో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాలకు సంబంధించిన ఇంఛార్జ్ మంత్రులు సమావేశాలు ఏర్పాటు- చేసుకుంటున్నారు.. 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందజలో ఉంది.. వారం రోజుల్లో నగదు కూడా వారి అకౌంట్లలో జమ,ఏశాం.. గతంలో 2, 3 నెలలు అయిన నగదు వేసేవారు కాదు అని ఆరోపించారు. దీనికి అధికారులకు అభినందనలు.. అలాగే, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి.. దేశంలో ఎక్కడ లేని విధంగా 5 లక్షల రూపాయలతో ఇళ్లు శాంక్షన్ చేశాం.. నియోజకవర్గానికి 3500 ఇల్లు కేటాయించడం గొప్ప విషయం.. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి హౌసింగ్ మంత్రి కసరత్తు చేస్తున్నారు.. 4 లక్షల 56 వేల ఇళ్లకు నిర్మాణాలు చేపడుతున్నాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే, సీజన్ మొదలైంది కాబట్టి విత్తనాల పంపిణీ మంచిగా జరగాలి.. నకిలీ విత్తనాలు అమ్మేవారికి జిల్లాలో పుట్టగతులు ఉండవు అని ఉప ముఖ్యమంత్రి భట్టి వార్నింగ్ ఇచ్చారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. ఇక, ధరణి పోర్టల్ ను పదేళ్లు చూశాం.. ధరణిలో బంధించిన వాటిని బయటకు తీసుకుని వచ్చేది, ప్రజలకు సరళమైన, న్యాయమైన హక్కులన్నింటినీ కాల రాసిన చట్టం ధరణి అని ఆరోపించారు. ధరణినీ తొలగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం, దానికి తగ్గట్టు-గానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కసరత్తు చేశారు.. అందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం పేదలకు అనుకూలంగా ఇది పని చేస్తుందని డిప్యూటీ- సీఎం విక్రమార్క పేర్కొన్నారు. ఇక, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన పెద్ద ఎత్తున నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్లు జాగ్రత్తగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి అన్నారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి.. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి లిస్ట్ మొత్తం ఇంఛార్జ్ మంత్రికి అప్పగించాలి అని సూచించారు. అధికారులు ఎక్కడ కూడా ఉదాసీనత వ్యక్త పర్చొద్దు.. గతంలో ఉన్న ప్రభుత్వం అన్ని విభాగాలను గాలికి వదిలి వేసింది.. బడ్జెట్ పరంగా ఏ ఇబ్బంది లేదన్నారు.

## మా సైనిక స్థావారాలపై భారత్ మెరుపుదాడులు

నిర్ణయించుకున్నాం. 10వ తేదీ తెల్లవారుజామున ప్రార్థనలు ముగిసిన వెంటనే.. 4.30 గంటలకు దాడులు చేసేందుకు మా సైన్యం సిద్ధమైంది. కానీ, మా ప్రణాళిక అమలుకు కొన్ని గంటల ముందే బ్రహ్మోస్ క్షిపణులతో భారత్ విరుచుకుపడింది. రావల్పిండి ఎయిర్‌పోర్టు సహా అనేక కీలకప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేసింది" అని ప్రధాని షరీఫ్ పేర్కొన్నారు. అజర్‌బైజాన్ పర్యటనలో భాగంగా ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. దాడుల ప్రణాళిక గురించి ఆర్మీ చీఫ్ మునీర్ తనకు ముందస్తుగానే తెలియజేశారని అన్నారు.భారత దూకుడుతత్వం ఘర్షణను మరింత పెంచిందని ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. భారత్ దాడి చేసినప్పుడు దేశాన్ని రక్షించుకోవడం తప్పితే తమకు మరో మార్గం లేదన్నారు. కాల్పుల విరమణకు ఆర్మీ చీఫ్ మునీర్ సలహా ఇచ్చారని, ఈ ఘర్షణ మరింత ముదరకూడదనే ఉద్దేశంతో తాను కూడా అందుకు అంగీకరించానని చెప్పారు. ఇదిలాఉంటే, పాక్ సైన్యం హెడ్‌క్వార్టర్ ఉన్న రావల్పిండిలోని నూర్‌ఖాన్, చక్వాల్‌లోని మురీద్, జాంగ్ జిల్లా షోర్కోట్‌లో ఉన్న రఫీకి వైమానిక స్థావరాలతోపాటు ఇతర ప్రావిన్సుల్లో భారత్ దాడులు చేసింది. దీంతో దిగివచ్చిన దాయాది దేశం.. కాల్పుల విరమణను ప్రతిపాదించింది.

# నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు కఠిన చర్యలు

- దేశ వ్యాప్తంగా ధాన్యం సేకరణలో మొదటి స్థానంలో తెలంగాణ
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ..



**వరంగల్ ప్రతినిధి మే 29 (జనం సాక్షి) :** నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు ఎస్పీలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలసి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి వరంగల్ జిల్లా లో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాలం ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి సంబంధించిన అంశాలపై సంబంధిత జిల్లాల కలెక్టర్లు, అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను ఉక్కుపాదంతో అరికట్టాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా విక్రయించకుండా నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మినట్లయితే పీడీ యాక్ట్ ను నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు. రాష్ట్రంలో అంచనాలకు మించి 160 శాతం ధాన్యం అధికంగా వచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా ధాన్యం సేకరణలో (ఖరీఫ్, రబీ రెండు సీజన్లో) తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానం లో ఉందన్నారు. ధాన్యం అంశానికి సంబంధించిన తలెత్తుతున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ముందస్తుగానే వర్షాలు పడుతుండడంతో ధాన్యం తడిసిందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విషయంలో కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 85% ధాన్యము కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రజా ప్రతినిధులు, అధికారులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలన్నారు. నిర్ణీత గడువుని నిర్ణయించి దాని ప్రకారం ఇల్లు నిర్మాణం పూర్తి కావాలన్నారు. జూన్ 6వ తేదీ నాటికి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్లు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను సంబంధిత ఎమ్మెల్యేలకు కలెక్టర్లు అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారులకు ఏజ్ లిమిట్ లేదని పేర్కొన్నారు. అత్యంత నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సంవత్సరంలో ఇల్లు నిర్మించుకోలేని లబ్ధిదారులు ఎవరైన ఉన్నట్లయితే వచ్చే ఏడాది వారు కట్టుకునే విధంగా కలెక్టర్లు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి సోమవారం సాయంత్రం నాటికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాకు సంబంధించి తాను సంతకం చేసిన ఫైళ్లను వెంటనే ఆయా జిల్లాల కలెక్టర్లు మంజూరు పత్రాలను సంబంధిత ఎమ్మెల్యే లను అందజేయాలన్నారు. పేదోడి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు వెళుతుందన్నారు. గత పదేళ్లుగా ఇండ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు కలెక్టర్లు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను ప్రభుత్వం అందిస్తుందని, రవాణా ఖర్చులు మాత్రం లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాల కలెక్టర్లు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి లబ్ధిదారుల పేర్లతో కూడిన బఫర్ జాబితాను రూపొందించాలన్నారు. ఇచ్చిన ఆదేశాలను నిర్లక్ష్యం చేయొద్దని అధికారులకు ఆదేశించారు.

రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎరువులు నియంత్రణకు ఏర్పాటుచేసిన కమిటీలో అధికారులతో పాటు రైతులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. బ్లాక్ మార్కెట్ కు విత్తనాలు ఎరువులు తరలకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ క్రియాశీలకంగా పనిచేస్తూ నిరంతరం నిఘా ఉంచాలన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెలకువలపై అవగాహన కల్పించాలన్నారు. అటవీ, రెవెన్యూ, ఎండోమెంట్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రబీ సీజన్ లో జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, 187 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు ఒక లక్ష 53 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్లో ఎక్కువ శాతం వరి, పత్తి సాగు చేయనున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు ఇబ్బందులు లేకుండా సరిపోను ఉన్నాయన్నారు. విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను సందర్శించి వాటి నిల్వలను పరిశీలించినట్లు తెలిపారు. 11 వేల ఇందిరమ్మ ఇండ్లు వరంగల్ జిల్లాకు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. 6853 ఇండ్లు మంజూరు చేసినట్లు, వాటికి ప్రొసీడింగ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస జనగామ, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు రిజ్వాన్ భాషా షేక్, టీఎస్ దివాకర, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, ఎస్పీలు, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## థాంక్స్ సీఎం సార్!

- ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్ ఏర్పాటు పట్ల హర్షం



**హైదరాబాద్, మే 29 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్‌లో బాసర రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా శాసన సభ్యులు యన్నం శ్రీనివాస్ రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి,వాకిటి శ్రీహరి, జనంపల్లి అనిరుధ్ రెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి, తూడి మేఘా రెడ్డి, వీర్లపల్లి శంకర్ జుబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## 66,030 మెట్రిక్ టన్నుల యాసంగి ధాన్యం కొనుగోలు

- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇప్పటి వరకు రైతుల నుంచి 66,030 మెట్రిక్ టన్నుల యాసంగి ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10,833 మంది రైతుల నుండి ఇప్పటి వరకు 66,030 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, కొనుగోలు విలువ రూ.153.19 కోట్లు కాగా, ఇప్పటి వరకు 79.30 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. గత సంవత్సరం ఇదే సీజన్ లో 39,675 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, గత సంవత్సరం సీజన్ కంటే ఈ సంవత్సరం సీజన్ లో 26355 మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సీజన్ లో ధాన్యం కొనుగోలు గణనీయంగా పెరిగినట్లు ఆయన స్పష్టం చేశారు.

## ఒకే కుటుంబంలో కోవిడ్ నిర్ధారణ



**రాజన్న సిరిసిల్ల, మే29 (జనంసాక్షి) :** సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలో కోవిడ్ కేసుల కలకలం పలువురిని ఆందోళన గురిచేస్తున్నది. గ్రామానికి చెందిన ఒక కుటుంబంలో కొన్ని రోజులుగా జ్వరం, నాలుక రుచి, ముక్కు వాసన కోల్పోవడంతో సిరిసిల్ల జిల్లా ప్రధాన వైద్యశాలలో కోవిడ్ పరీక్షల కోసం వెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించడం లేదని ఆసుపత్రి బాధ్యులు చెప్పడంతో సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కోవిడ్ పరీక్షలు చేయించుకున్నారు. పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో కుటు-ంబీకులు అప్రమత్తమయ్యారు. ఈ సంఘటనపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ ఆఫీజాను వివరణ కోరగా రాపిడ్ టెస్టుల్లో పాజిటివ్‌గా వచ్చిందని కోవిడ్ నిర్ధారణ కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించామని ప్రస్తుతం ఆ కుటు-ంబాన్ని క్వారం-టైన్‌లో ఉంచామని తెలిపారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు.

## ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో అలసత్వం తగదు



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల జాబితా రూపకల్పనలో అలసత్వం తగదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నిబంధనల మేరకు జాబితా సిద్దం చేయాలన్నారు. నిర్దేశిత సమయానికి లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ల తీరుపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అనుమతుల మంజూరులో నిర్లక్ష్యం తగదన్నారు. జూన్ 6లోపు లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాతో ప్రొసీడింగ్స్ కాపీలను అందించాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటి నియంత్రణకు పోలీస్, వ్యవసాయ శాఖ సమన్వయంతో పని చేయాలన్నారు.



## సురవరం ప్రతాపరెడ్డి జయంతి అధికారికంగా నిర్వహించేందుకు కృషి

- సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన సురవరం ప్రతాపరెడ్డి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

**హైదరాబాద్, మే 29 (జనంసాక్షి) :** సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన సామాజికవేత్త, కవి, రచయిత, ప్రముఖ సంపాదకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు బాషా కోవిదులు, గ్రంథాలయాల అభివృద్ధికి తపించిన సురవరం ప్రతాపరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం రవీంద్ర భారతిలో నిర్వహించిన సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి శతాబ్దం క్రితమే తెలంగాణ గళం గట్టిగా వినిపించారని, అన్ని సామాజిక వర్గాలలో చైతన్యాన్ని రగిల్చిన గొప్ప వ్యక్తి అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. అంతటి మహనీయుని పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టిన ఘనత ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానని చిన్నారెడ్డి తెలిపారు. సురవరం గొప్ప పరిశోధకులు అని, సొంతంగా 11 వేల పుస్తకాలు సేకరించి భావి తరాల కోసం రెడ్డి హాస్టల్ లైబ్రరీలో భద్ర పర్చారని చిన్నారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానంద రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, ప్రముఖ సాహితీ విమర్శకులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి ఏనుగు నర్సింహా రెడ్డి, సురవరం కృష? వర్ధన్ రెడ్డి, నిర్వాహకులు బడే సాబ్, మనోహర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సరోజినీ దేవి, కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను చిన్నారెడ్డి ఆవిష్కరించారు.

## సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

- సీఎంకు లేఖ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి, ప్రత్యేక హెూదా కల్పించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లష్కర్ జిల్లా సాధన సమితి నేతలు గురువారం లేఖ రాశారు. అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్, కమిటీ సభ్యులు ఈ లేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రిజిస్టర్ పోస్టులో పంపారు. 1959 వరకు ప్రత్యేక కార్పొరేషన్‌గా కొనసాగిన సికింద్రాబాద్‌ను 1960లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం జరిగిందన్నారు. అప్పటి నుంచి సికింద్రాబాద్ ప్రాంతంలో వసూలైన నిధులు మరొక ప్రాంతానికి తరలి పోవడం ప్రారంభమైంది అని చెప్పారు. అనంతరం హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్‌ఎంసీగా విస్తరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించిన కూడా కేవలం అభివృద్ధి చెందుతున్న గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాలకు తరలి వెళుతున్న విషయం సికింద్రాబాద్ ప్రజలను తీవ్ర మనస్థాపానికి గురి చేస్తుందన్నారు. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే రాను రాను సికింద్రాబాద్ మరొక పాత నగరంగా మిగిలి పోతుందనే ఆందోళన ఈ ప్రాంత ప్రజల్లో నెలకొందన్నారు. రోడ్ల విస్తరణ, నూతన ఫ్లైఓవర్‌ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచకపోవడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వం మమ్మలి నిర్లక్ష్యం చేస్తుందనే ఆందోళన సికింద్రాబాద్ ప్రజల్లో ఉంది. 2006లో సికింద్రాబాద్‌కు 200 ఏండ్లు నిండిన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రకటించిన రూ. 200 కోట్ల నిధుల విడుదల కూడా రాజశేఖరరెడ్డి మరణంతో మరుగున పడింది అని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి ఎన్ని నిధులు కేటాయిస్తున్న అవి సికింద్రాబాద్ ప్రజలకు అందడం లేదన్నారు. ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయడం, శివారు మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో కలపడం లాంటి చర్యలు సికింద్రాబాద్ ప్రజలను మరింత ఆందోళనకు గురి చేయడం జరిగిందన్నారు. కావున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సికింద్రాబాద్ ప్రజల కోరిక మేరకు సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, ప్రత్యేక హెూదా కల్పించి ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించి సికింద్రాబాద్ ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు లేఖలో కోరారు.

## సింగరేణి వైద్య విభాగానికి ఏటా 400 కోట్ల ఖర్చు

- సీఎండీ ఎన్.బలరామ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం ఏటా రూ. 400 కోట్లు వెచ్చిస్తోందని, ముఖ్యంగా అన్ని చోట్ల ఆసుపత్రులను ఆధునికీకరిస్తోందని సింగరేణి సీఎండి ఎన్.బలరాం తెలిపారు. ఇందుకు భిన్నంగా రోగులను హైదరాబాద్‌కు రెఫర్ చేయడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే వివిధ జిల్లాల ఏరియా ఆసుపత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్ లను సమకూర్చేందుకు యాజమాన్యం సంసిద్ధంగా ఉందన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా వెంటనే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, తద్వారా గత మూడేళ్లలో 30 కోట్ల రూపాయలు ఉన్న రిఫరల్ బిల్లులు ఇప్పుడు రూ100 కోట్లకు చేరాయని అన్నారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతి చిన్న కేసును హైదరాబాద్‌కు రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. డాక్టర్లు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో పూర్తి క్రమశిక్షణ పాటించాలని ఆయన కోరారు. సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడం కోసం ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చటానికి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పానని, అయినప్పటికీ కొన్ని ఏరియా ఆసుపత్రుల నుండి ప్రతిపాదనలు పంపించేందుకు ఎందుకు శ్రద్ధ వహించడం లేదని సింగరేణి వైద్య శాఖ పై సీఎండీ ఎన్.బలరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల ప్రధాన వైద్యాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్రేగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాలలో ఉన్న ఏరియా ఆసుపత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావల్సిన కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందులు పంపించాలని, తన తదుపరి తనిఖీలలో ఏ ఒక్క మందులు లేవనో, పరికరం లేదనే మాట గానీ రాకూడదని హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక పేర్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు ఏ ఏ పరికరాలు కావాలన్నది నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. సింగరేణి సంస్థ నుండి హైదరాబాద్ లోనూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి లో పనిచేస్తున్న వైద్యులంతా పూర్తి అంకిత భావంతో పనిచేయాలని, కార్మికుల నమ్మకాన్ని గెలచుకోవాలని సూచించారు. గతంలో వైద్య సేవలకు నిధుల మంజూరులో అనేక ఆటంకాలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎటువంటి కోతలు, తగ్గింపులు లేకుండా నిధులు మంజూరు చేయటానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని, ఈ సానుకూల దృక్పథాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందని ఛైర్మన్ పేర్కొన్నారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

- తొలి బడి అమ్మ ఒడి .. మలి బడి అంగన్‌వాడీ
- సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క



**భద్రాద్రి కొత్తగూడెం, మే29 (జనంసాక్షి) :** తొలి బడి అమ్మ ఒడి అయితే... .. మలి బడి అంగన్‌వాడీ బడి అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు,సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా మంత్రి పాత కొత్తగూడెం నుంచి పెనుబల్లి రోడ్డు వద్ద 6.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి పనులకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ అమృతం పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలన్నింటిని ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, పిల్లలందరికీ నర్సరీ పాటలతో పాటు- ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి తల్లిదండ్రుల కష్టాలు వృదా చేయకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటు-గా తయారు చేస్తున్నామన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు ఆడుకోవడానికి 57 రకాల ఆట వస్తువులను అందుబాటు-లో ఉంచామన్నారు. త్వరలోనే గర్భిణులు కింద కూర్చోకుండా అన్ని కేంద్రాల్లో బల్లలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పథకం కింద మంజూరైన రూ.74.64 లక్షల చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎసే వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించి వేస్ట్ నుంచి బెస్ట్ రూపొందించిన కళాకృతులను చూసి అభినందించారు. ఆడపిల్లలకు శక్తినిద్దాం... ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఇందిరమ్మ అమృతం పథకాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అనిత రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐటీ-డీఏ పీవో రాహుల్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కౌమార బాలికల్లో రక్తహీనత నివారించేందుకు ఇందిరమ్మ అమృతం పేరుతో ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా మూడు జిల్లాలో 50,269 మంది బాలికలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, సీపీవో సంజీవరావు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కిడ్నీ రాకెట్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ కేసులో మరో ఇద్దరిని గురువారం అరెస్టు చేశారు. సరూర్‌నగర్ అలకనంద హాస్పిటల్ కిడ్నీ రాకెట్ కేసులో సీఐడీ ముమ్మరంగా దర్యాప్తు జరుపుతోంది. కిడ్నీ రాకెట్ కేసులో పరారీలో మరో ఏడుగురు నిందితులు ఉన్నారు. గతంలో 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేస్ సీఐడీకి బదిలీ అయిన తర్వాత ఇద్దరినీ తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన శంకరన్, రమ్య అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి దగ్గరి నుంచి పాస్‌పోర్ట్‌తో పాటు- రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలో అదుపులోకి తీసుకొని ట్రాన్సిట్ వారెంట్ మీద హైదరాబాద్‌కు తరలించారు. తమిళనాడులో పేదవారిని టార్గెట్ చేసి కిడ్నీ డొనేట్ చేయించినట్లు- అధికారులు గుర్తించారు. ఒక్కో ఆపరేషన్‌కు రూ. 10 లక్షలమేర నిందితులు వసూలు చేశారు. కిడ్నీ డొనేట్ చేసిన వారికి నిందితులు రూ.4 లక్షలు చెల్లించినట్లు- అధికారుల విచారణలో తేలింది. కాగా, అలకనంద ఆస్పత్రిలో జరిగే కిడ్నీ ఆపరేషన్లపై అధికారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేకుండా కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్నట్లు- చెప్పారు. ఈ విషయంపై సంబంధిత ఆస్పత్రి యాజమాన్యాన్ని సీఐడీ అధికారులు విచారించే అవకాశాలు ఉన్నాయి. దర్యాప్తు ముమ్మరంగా జరుపుతున్న కొద్దీ ఈ రాకెట్‌కు దేశవ్యాప్తంగా ఉన్న లింకులు బయటపడుతున్నాయి. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఈ ముఠా కార్యకలాపాలు కొనసాగించినట్లు- అధికారులు గుర్తించారు. సీఐడీ అధికారులు ఇప్పటికే సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు.

మీరు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేస్తారనే విషయం తెలిసినప్పటికి కూడా ప్రజలు మాట్లాడుతున్నారు, ఉద్యమిస్తున్నారు, వారి ఆచరణ ద్వారానే ప్రజలకు ఒక మంచి జీవితం ఏర్పడుతుందని నమ్ముతున్నారు కూడా. ఇప్పుడున్న ఏ పార్లమెంటరీ రాజకీయ పార్టీలు కూడా ప్రజల హక్కులను కాపాడలేని స్థితి ఉందని మెజార్టీ ప్రజానీకం విశ్వసిస్తున్నది. ప్రజలు మాట్లాడటానికి ఆందోళన చేయడానికి అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడానికి సిద్ధంగా కూడా ఉన్నారు. కానీ ప్రభుత్వం మలు చేస్తున్న నిర్బంధానికి భయపడి బహిరంగంగా రాలేకపోతున్నారు. ఆ నిర్బంధాన్ని కూడా ఎదుర్కొని నినదించే స్థాయి ప్రజలకు ఒక చైతన్యం అందిస్తుంది కాబోలు. ఎందుకంటే ప్రజల చైతన్యమే భవిష్యత్ తరాలకు వెలుగునిస్తుంది.

*అధికారంలోకి వచ్చాక మాత్రం ఎన్ని అణచివేత రూపాలున్నాయో వాటిని అమలు పరుస్తూనే నర సంహారం చేసే ఎన్‌కౌంటర్లను కూడా పెంచిపోషిస్తాయి. అక్కడే ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య తీవ్రమైన వైరుధ్యం కొనసాగుతుంది. ఇటువంటి వైరుధ్యాన్ని పరిష్కరించుకోవడంలో భాగంగానే 2004లో మేధావుల సమక్షంలో ఒక చర్చల ప్రక్రియ కొనసాగింది. కానీ వైఎస్ఆర్ ప్రభుత్వం భూమి దగ్గరికి వచ్చిన సమస్యను పరిష్కరించడానికి ధైర్యం చాలక పెట్టుబడిదారులతో భూస్వాములతో సామ్రాజ్యవాదులతో వైరాన్ని పెంచుకో లేక ఉద్యమాల అణచివేతకు మరొక సారి శ్రీకారం చుట్టి ఆనాడు నల్లమలను శవాల గుట్టగా మార్చేసింది. ఆనాటి నుండి ఈనాటి వరకు కూడా అడవులు, గుట్టలు శవాల గుట్టలుగా నింపబడుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో జీవించే హక్కు ఆర్టికల్ 21 చాలా ప్రధానమని అందరం భావిస్తాం. దశాబ్దాలుగా ఆ జీవించే హక్కు పూర్తిగా ప్రమాదంలో పడిందని అందరూ గోల పెడతారు. కానీ ప్రభుత్వాలు మాత్రం ఆ హక్కును కాపాడడంలో పూర్తిగా విఫలమైపో యాయి. అందులో భాగంగానే ఆపరేషన్ కగార్ హత్యాకాండ ఇప్పటి వరకు 50 ఎన్‌కౌంటర్లలో 550 వరకు హత్య గావించబడ్డారు. కానీ ఇప్పడున్న ప్రత్యేకత ఏ ఎన్‌కౌంటర్ మీద కూడా న్యాయ విచారణ కాని హక్కుల సంఘా ల నిజ నిర్ధారణ కాని కొనసాగడం లేదు. ఆ వైపుగా ఏ హక్కుల సంఘం ప్రయత్నించినా వారిపై కూడా బలమైన ఉక్కుపాదాన్ని రాజ్యం అమలు చేస్తున్నది. దానితో ప్రజాస్వామ్యం జీవించే హక్కు ప్రమాదం లో పడిందని దేశ ప్రజలే కాక అంతర్జాతీయంగా ఉన్న సంస్థలు కూడా ఆందోళనను వెలిబుచ్చాయి.*



# శవాలకు అంత్యక్రియలు నిర్వహించే హక్కు ప్రభుత్వాలకు లేదు

21 మే 2025 కన్నా 27 మే 2025 ఇంకా ఇంకా ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వాలే పాతర వేసిన రోజు. దేశంలో 50 ఏళ్ళుగా సాయుధ పోరాటాలు పీపుల్స్ వార్ మావోయిస్ట ఉద్యమాలు కొనసాగుతూ ఉన్నాయి. వాటిపై రాజ్యనిర్బంధం ఎన్‌కౌంటర్ పేరుతో కొనసాగుతూనే ఉంది. ఎన్‌కౌంటర్లంటే ప్రభుత్వ హత్యలే అనే విషయం సమస్త ప్రజలకు అర్థమవుతుంది. కానీ న్యాయస్థానాలు ప్రభుత్వం ఎటువంటి చర్యలు ఎన్‌కౌంటర్ హత్యల విషయం లో నేటికీ తీసుకోలేకపోతున్నది. పరోక్షంగా అవే ఎన్‌కౌంటర్ హత్యలను ప్రోత్సహిస్తున్నవి కూడా. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రాక ముందే ఎన్‌టిఆర్ నక్సలైట్లే దేశభక్తులు అన్నాడు. అధికారంలోకి వచ్చాక అతను కొనసాగించిన ఎన్‌కౌంటర్ హత్యాకాండ అంతా ఇంతా కాదు. చివరికి ఆయన మంత్రివర్గంలో ఉన్న హోంమంత్రి కూడా నక్సలైట్ల హత్యా కాండకు బలికావాల్సిందే. దాని తరువాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కూడా ఆయన బాటలో కొనసాగుతూ అలిపిరిలో జరిగిన దాడిలో తృటిలో తప్పించుకోవడం జరిగింది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ అధికారంలోకి వచ్చి మావోయిస్టు ఎజెండానే తన ఎజెండాగా పదే పదే ప్రకటిస్తూ అదే ఎన్‌కౌంటర్ హత్యాకాండను కొనసాగిస్తూ 2015లో శృతి సాగర్ ఎన్‌కౌంటర్‌తో ఆయన నిజ స్వరూపాన్ని తెలుగు ప్రజలు అర్థం చేసుకోవడం జరిగింది. అంతిమంగా ఏ ప్రభుత్వమైనా ప్రజాస్వామికంగా పాలన చేస్తామని చెబుతాయి గాని ఆచరణకు వచ్చే సరికి అణచివేతను హత్యాకాండనే ఎన్‌కౌంటర్ రూపంలో నమ్ముకొని పాలన చేస్తూ వస్తున్నారు. నేడు 2024 నుంచి బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్ కు ఒక ప్రత్యేకత ఉంది. గతంలో అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ ప్రభుత్వం జరుపుకోని ఎంఒయులను బిజెపి ప్రభుత్వం చేసుకున్నది. ఖనిజ సంపద దండకారణ్యం మెండుగా ఉందని అర్థమైన కార్పొరేట్లు దండకారణ్యంపై దృష్టి పెట్టడం సహజం. కానీ ఆ ఖనిజ సంపద దేశ ప్రజలకు చెందాలనే విషయాన్ని మరిచి ప్రవర్తిస్తున్న పాలకుల దేశ ద్రోహ బుద్దులను ప్రజలు అర్థం చేసుకోలేకపో వడం మన నుంచి జరుగుతున్న పొరపాటు. ప్రభుత్వాలన్ని కూడా అణచివే తకు అభివృద్ధి కారణమని చెబుతాయి. విస్తాపనకు అభివృద్ధి కారణమని చెబుతాయి. కాని ప్రజాస్వామ్యంలో ప్రజల అభివృద్ధి కోసం ప్రజల ఆకాంక్షల మేరకు పని చేయాలనే కనీసమైన ప్రజాస్వామిక ధర్మాన్ని పాటించడంలో విఫలమవుతూ వస్తున్నాయి. ఈ ఉద్యమం ఇప్పటికే 20 వేల మంది ఉద్యమకారుల త్యాగాలను మూటగట్టుకున్నది. అందులో భాగంగా ఎంతో మంది కన్న తల్లుల పుత్రశోకంతో దేశం తల్లడిల్లి పోయింది. నిన్నటికి నిన్న నంబాల కేశవరావు కుటుంబం ఒకవైపు ఉన్నప్పటికి మరొక వైపు వరంగల్ చింతగట్టు రాకేష్ కుటుంబం వాళ్ళ అమ్మ స్వరూప ఇప్పటికీ అన్నం తినక ఎంతగా చిక్కిపోయిందో మనందరం చూస్తే అర్థమవుతుంది. కనీసం శవాన్ని ఇవ్వకపోయినా బుడిద ఎముకల కోసం కూడా తల్లి హృదయం ఆరాట పడుతుంది. ఇలా ప్రతి ఒక్క కుటుంబం తల్లడిల్లుతూనే ఉన్నది. ఎందుకు ఇటువంటి సాయుధ ఆపరేషన్లను 2005 నుంచి ఒక పిలుపు ఇచ్చి కొనసాగిస్తూ వేలల్లో హత్యాకాండలు కొనసాగిస్తూ వస్తున్నవి. చెప్పడమేమో ప్రజా స్వామ్యం రాజ్యాంగం అని మాట్లాడతాయి. ఆచరణకు వచ్చే సరికి కార్పొరేట్ల ఎజెండానే తన ఎజెండాగా మార్చుకుంటాయి. దీనితో పాలకులకు ప్రజలకు మధ్య మిత్ర వైరుధ్య స్థానంలో శత్రువైరుధ్యం ప్రారంభం నుంచే బయల్దేరతాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజ్యాంగం గురించి మావోయిస్టుల గురించి మంచిగా మాట్లాడతాయి. అధికారంలో ఉన్నవాళ్ళే రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని ఉద్యమాలను అణచివేస్తున్నారని దుర్మార్గమైన ఊపా చట్టాన్ని వాడుతున్నారని బహిరంగంగా మాట్లాడతాయి. కానీ భారత ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. ఎవ్వరినై నా చంపొచ్చు, ఎటువంటి హత్యాకాండనైనా కొనసాగించవ చ్చు. కార్పొరేట్ల ప్రయోజనాలే బిజెపి ప్రయోజనాలుగా కొనసాగించొచ్చు అనే విధానంలో పాలన సాగుతున్నది. ఇదే అన్ని ఉద్యమాలకు మూలంగా కేంద్రంగా అవుతున్నాయి. దేశంలో ముస్లింలు రెండవ తరగతి పౌరులుగా నిత్యం బతుకు భయంతో జీవిస్తున్నారు. క్రిస్టియన్లు ఎన్నో చర్చిల మీద దుర్మార్గమైన దాడులు జరుగుతున్నాయి, పాస్టర్లు కూడా హత్యగావించబడు తున్నారు, వేటిమీద కూడా సరైన న్యాయ విచారణ జరగడం లేదు. అన్ని వర్గాల ప్రజల అసంతృప్తితో, అసహనంతో రగిలిపోతున్నారు. ఆ అసంతృప్తిని అణచివేయ దం కోసం సాయుధ బలగాల కేంద్రీకరణ దేశంలో విపరీతంగా పెరుగుతున్న ది. అందులో భాగంగా దండకారణ్యంలో కూడా లక్షలాది బలగాలు వందలాది క్యాంపులతో ఆదివాసీలను పహారా కాస్తున్నారు. అడుగు వేస్తే చాలు తూటా పేలుతున్న విధంగా 6 నెలల మంగ్లీ సోడిని కాల్చి చంపేసింది. ఆ విధంగా ప్రారంభమైన ఆపరేషన్ కగార్ హత్యాకాండ కూడా 21 మే 2025న జరిగిన నారాయణపూర్ హత్యాకాండతో పరాకాష్టకు చేరింది.

ఆపరేషన్ కగార్ ఆదివాసీల హత్యాకాండ : 1 జనవరి 2024 బీజాపూర్‌జిల్లా గంగులూరు ప్రాంతంలో ముత్వెండి గ్రామంలో 6 నెలల మంగ్లీ సోడి ఎన్‌కౌంటర్ హత్య. 5 జనవరి 2024 అబూజ్‌మడ్ గట్టకల్ ఎన్‌కౌంటర్ 5 గురి హత్య, 16 జనవరి 2024 – పూజారి కాంకేర్ ఎన్‌కౌంటర్ 12 మంది హత్య, 21 జనవరి 2024 – గంగులూరు ప్రాంతంలో ఎన్‌కౌంటర్ ముగ్గురి హత్య, 2 ఫిబ్రవరి 2024 – నెల్‌నార్ ఏరియా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు హత్య, 4 ఫిబ్రవరి 2024 – గంగులూరు ప్రాంతంలో ఎన్‌కౌంటర్ ఒకరి హత్య, 7 ఫిబ్రవరి 2024 – గోందోడు గ్రామంలో ఎన్‌కౌంటర్ ఒకరి హత్య, 24 ఫిబ్రవరి 2024 – బూర్గులంకలో ఎన్‌కౌంటర్ ఒకరి హత్య, 3 మార్చి 2024 – కాంకేరి జిల్లాలో ఎన్‌కౌంటర్ ఒకరి హత్య, 19 మార్చి 2024 – గడ్చిరోలి జిల్లా ఐరి తాలుకా కోళ్ళమాకలో ఎన్‌కౌంటర్ నలుగురి హత్య, 22 మార్చి 2024 గంగులూరు ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు హత్య, 27 మార్చి 2024 – చీపురుబట్టి బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చీపురుబటి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురి హత్య, 1 ఏప్రిల్ 2024 – బీజాపూర్‌జిల్లా గంగులూరులో ఎన్‌కౌంటర్ 10 మంది హత్య, 2 ఏప్రిల్ 2024 – బీజాపూర్‌జిల్లా గంగులూరులో కోర్చేల్ ఎన్‌కౌంటర్ 13 మంది హత్య, 5 ఏప్రిల్ 2024 – భద్రాచలం, దంతెవాడ బీజాపూర్ జిల్లాల్లో సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒకరి హత్య, 6 ఏప్రిల్ 2024 – బీజాపూర్‌జిల్లా మూసూరు కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు హత్య, 16 ఏప్రిల్ 2024 – కాంకేర్‌జిల్లా చోటాబేడియా కల్పర్ అపటోలా ఎన్‌కౌంటర్‌లో 29 మంది హత్య, 15 మంది మహిళలు, 14 మంది పురుషులు, 30 ఏప్రిల్ 2024 – టేకమెట్ట కాకూర్ ఎన్‌కౌంటర్‌లో 10 మంది హత్య, 10 మే 2024 – బీజాపూర్‌జిల్లా గంగులూరులో ఎన్‌కౌంటర్‌లో 12 మంది హత్య, 13 మే 2024 – గడ్చిరోలి, సత్రంగట్ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురి హత్య, 17 జులై 2024 – వొండోడు సిందుబట్టి ఎన్‌కౌంటర్‌లో 12 మంది హత్య, 25 జులై 2024 – భద్రాది కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామరతోగ అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో ఒకరి హత్య, 3 సెప్టెంబర్ 2024 – బీజాపూర్ జిల్లా దంతెవాడ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 9 మంది హత్య, 5 సెప్టెంబర్ 2024 – భద్రాది కొత్తగూడెం జిల్లా రఘునాధపాలెంలో ఎన్‌కౌంట ర్‌లో 7 మంది హత్య, 23 సెప్టెంబర్ 2024 – నారాయణపూర్‌జిల్లా కాన్పూర్ అడవిలో ఎన్‌కౌంటర్‌లో 3 మంది హత్య, అక్టోబర్ తుల్‌తులె ఎన్‌కౌంటర్ 36 మంది హత్య, 21 అక్టోబర్ 2024 – నారాయణపూర్ గడ్చిరోలి జిల్లా సరిహద్దులో కొద్దూరు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 5 మంది హత్య, 15-11-2024 – నారాయణపూర్‌ఎన్‌కౌంటర్ 5 గురి హత్య, 21 నవంబర్ 2024 – జిన్నెల గూడెం కలిమెల బ్లాక్ మోటు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌కౌంటర్‌లో ఒకరు హత్య, 22 నవంబర్ 2024 – కుంట బ్లాక్ బ్రిడ్జి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌కౌంటర్‌లో 10 మంది హత్య, 1 డిసెంబర్ 2024 – చల్పాక ఎన్‌కౌంటర్‌లో 7గురి హత్య, 11 డిసెంబర్ 2024 – ముర్రుంగ ఎన్‌కౌంటర్‌లో ఒకరి హత్య, 11 డిసెంబర్ 2024 – లకవేద ఎన్‌కౌంటర్ 7 గురి హత్య, దినేస్ వెలాడియం ఎన్‌కౌంటర్ 11 డిసెంబర్ 2024 గుంగులూరు ఎన్‌కౌంటర్ ఒకరి హత్య, 12 డిసెంబర్ 2024 – చిక్‌పాల్ ఎన్‌కౌంటర్ 12 మంది హత్య, 13 డిసెంబర్ 2024 – బెల్లం నేంద్ర అడవుల్లో ఎన్‌కౌంటర్ ముగ్గురి హత్య, 9 జనవరి 2025 – పాలగూడెం ఎన్‌కౌంటర్‌లో ముగ్గురి హత్య, 12 జనవరి 2025 – బందెపార కొండపాడ ఎన్‌కౌంటర్‌లో 5గురి హత్య, 16 జనవరి 2025 బీజాపూర్ (ఉసుర్ పామేడ్) ఎన్‌కౌంటర్ 18 మంది హత్య, 21 జనవరి 2025 – కూలారీఘాట్ (గరియాబంద్) ఎన్‌కౌంటర్ 16 మంది హత్య, 1 ఫిబ్రవరి 2025 – కోర్చేల్ ఎన్‌కౌంటర్ 8 మంది హత్య, 2 ఫిబ్రవరి 2025 – నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరి హత్య, 9 ఫిబ్రవరి 2025 – నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్ 13 మంది హత్య, 13 మార్చి 2025 – బీజాపూర్ జిల్లాలు ఇద్దరు ఎన్‌కౌంటర్, 20 మార్చి 2025 – బీజాపూర్ లో 26 మంది, కాంకేర్ జిల్లాలో 4గురు హత్య, 23 మార్చి 2025 బీజాపూర్ దంతేవాడ ఎన్‌కౌంటర్ – ముగ్గురి హత్య, ఇకెల్పి బెల్నార్ ఎన్‌కౌంటర్‌లో ఒకరి హత్య. 21 మే 2025 నారాయణపూర్ ఎన్‌కౌంటర్లట 28 మంది హత్య.

గతంలో జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లలో శవాలను కుటుంబీకులకు అందజేసారు. కానీ ఈ ఎన్‌కౌంటర్ మాత్రం 2 రకాలుగా చూపిస్తున్నారు. (1) ఆదివాసీలను ఉద్యమకారులను వేరు పరచే విధంగా, ఆదివాసీల శవాలను వాళ్ళ కుటుంబాలకు అందజేయడం ఉద్యమకారుల శవాలను వాళ్ళే దహనం చేయడమనే విధానాన్ని అమలు చేస్తున్నారు. (2) ఆదివాసీలు ఉన్న యువతను అందరిని కూడా భయపెట్టి లొంగుబాట్ల రూపంలో అందరినీ తన ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. (3) ఎవరైతే ఉద్యమకారులతో నిజాయితీగా ఉంటారో వారందరిని బంధీలుగా చేసుకొని ఎన్‌కౌంటర్‌లో రిజర్వ్ క్యాడర్‌గా ఉపయోగిస్తున్నారు. ఇవన్నీ కూడా రేపు రేపు ఆదివాసీల ప్రాంతాలను ఆదివాసీలే స్వచ్ఛందంగా ఖాళీ చేసి కార్పొరేట్లకు తమ అడవిని ధారాదత్తం చేసి వెళ్ళిపోవాల్సిన పరిస్థితిలోకి నెట్టే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ప్రయత్నం 2005 లో కూడా కొనసాగింది. కానీ అప్పుడున్న ప్రభుత్వ సాయుధ బలగాల కన్నా ఉద్యమ బలగాలు ఎక్కువ ఉన్నందున ఆ ప్రయత్నం సఫలం కాలేదు. 2005 సల్వాజుడుంకు ముందు ఉద్యమకారులు 5 వేల మందే ఉంటే, సల్వాజుడుం తరువాత 1,10,000 చేరుకోవడమంటేనే నిర్బంధం ఉద్యమాన్ని విస్తరింపజేసింది. నేడు ఆపరేషన్ కగార్ కూడా ఆ విధానంలోనే కొనసాగుతూ అడవినే కాదు ప్రతి గ్రామం నుంచి కూడా ఉద్యమాన్ని సానుభూతితో సానుకూలంగా అర్థం చేసుకునే ప్రజానికం పెరుగుతున్నదన్న ఒక వాస్తమైన పరిస్థితిని ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి. హక్కులను సాధించి పెడుతుంది. ఇప్పుడు మనం బతుకుతున్నామంటేనే గతంలో ఎంతో మంది పోరాట త్యాగమనే ఫలితమనే సత్యాన్ని అర్థం చేసుకుంటారు కూడా. గనుక ప్రభుత్వాలు అర్థం చేసుకోవాల్సింది, ఆచరించా ల్సింది రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య విలువల్ని సహజ న్యాయ సూత్రాల్ని మానవత్వంతో కూడిన ధర్మాన్ని. ప్రభుత్వాలు వీటిపై దృష్టి పెట్టకపోతే కొనసాగిస్తున్న ఎంతటి బలమైన అణచివేతైనా సరే ప్రజల చైతన్యం ముందు ఎందుకూ పనికిరాదు. ప్రభుత్వాలు కుల మత ప్రాంత ద్వేశాలతో ప్రజలు ఐక్యం కాకుండా సమస్యల సుడిగుండంలో తమకు తామే ఆత్మహత్యల వైపో అరాచకాల వైపో దిగజారి పోయే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. కాని మెజార్టీ ప్రజానీకం త్యాగంతో కూడిన ప్రజా పోరాట రూపాలను అర్థం చేసుకుంటున్నారు. వాళ్ళు అర్థం చేసుకోవడానికి మీరు కొనసాగిస్తున్న అణచివేత రూపాలు ఆ మనుషులను కూడా కదిలిస్తున్నాయి. కనుక మీరు ఎంతటి ఆరాచక అన్యాయమైన ధోరణిని కొనసాగించినా అవి ఎంతో కాలం నిలబడవు. ప్రజలు తమ శవాలను తాము తెచ్చుకోవడానికి చేసిన బలమైన ప్రయత్నాన్ని ప్రజలందరూ చూశారు. మీరే మృతదేహాలకు సంబంధించిన వారు రాలేదని కుళ్ళబెట్టి కలెక్టర్ ఆర్డర్‌తో కాల్చివేసి ఏదో విజయం సాధించినట్లుగా పీలవుతున్నారని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఇది ఎప్పటికైనా తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితిని ప్రజలు కల్పిస్తారు. ప్రభుత్వాలుగా సిద్దంగా ఉండండి. ప్రతిపక్షంలో ఉన్నా గాని ప్రజలు సమాధానంకై ప్రశ్నిస్తారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా హత్యాకాండను నలిపివేస్తూ ఒక శాంతి చర్చల ప్రక్రియలోకి రాగలిగితే కనీసంగానైనా ఆదివాసీల ఉద్యమకారుల జీవించే హక్కును కాపాడుకునే అవకాశం ఉంటుంది. అందుకోసం దేశ వ్యాప్తంగా బుద్ధిజీవులు ప్రయత్నం చేస్తున్నారు. ఆ వైపుగా ప్రభుత్వాల ఆచరణ ఉండాలని హక్కుల సంఘాలుగా మేము డిమాండ్ చేస్తున్నాము.



**ఎన్. నారాయణ రావు**
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

# నారాయణపూర్ ఊచకోత

### 'మావోయిస్టు రహిత భారత్' కోసం బీజేపీ దుష్ట సైనిక విన్యాసం

మే 21న నారాయణపూర్ ఊచకోతలో సీపీఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును చట్టవిరుద్ధంగా హత్య చేసిన తర్వాత, మోడీ ప్రభుత్వం విజయ ఉత్సాహంలో ఉన్నట్లు కనిపిస్తోంది. హోంమంత్రి అమిత్ షా దీనిని 'నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఒక మైలురాయి ' అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దీనిని 'అద్భుతమైన విజయం'గా ప్రకటించగా, బీజేపీ కర్ణాటక యూనిట్ అమిత్ షా కాలీఫ్లవర్ పట్టుకుని ఉన్నట్లు చూపించే చిత్రాన్ని ఉపయోగించింది.

1989లో భాగల్పూర్‌లో ముస్లింల మారణహోమాన్ని ఈ ప్రతీకవాదం గుర్తుచేసింది, అక్కడ ఒక గ్రామంలో వంద మందికి పైగా ముస్లిం బాధితులను సమాధి చేసిన నేలపై కాలీఫ్లవర్లు పెంచినట్లు హంతకులు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తన అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక సైనిక విజయాన్ని ప్రకటించుకున్న తరుణంలో, భారతదేశంలో అత్యంత దారుణమైన ముస్లిం వ్యతిరేక మారణ హోమాల్లో ఒకదాన్ని బీజేపీ గుర్తుంచుకుని మరీ ఈ ఘోర కార్యానికి పూనుకుంది.

నారాయణపూర్ మారణహోమంలో మావోయిస్టుల మరణాలను సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ తరపున విడుదల చేసిన పత్రికా ప్రకటన ధృవీకరిస్తోంది. దీని ప్రకారం ఈ మారణహోమంలో 28 మంది కార్యకర్తలు మరణించారు, వీరిలో అనేక మంది మహిళలు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు. బసవరాజుకు 60 మందికి పైగా యోధులతో కూడిన తక్షణ భద్రతా వ్యవస్థ ఉందని, కానీ జనవరి నుండి వేగవంతమైన కదలికల కోసం ఆ సంఖ్యను తగ్గించారని ఆ ప్రకటనలో పేర్కొంది. రక్షణ వలయంలోని కొందరు లొంగిపోవడం ద్రోహులుగా మారడంతో రాజ్యం తమ మిలిటరీ ఆపరేషన్‌ను విజయవంతంగా ప్లాన్ చేసి అమలు చేయడానికి వీలు కలిగింది. మారణ హోమం జరిగిన సమయంలో, బసవరాజుకు 34 మంది యోధులు కాపలాగా ఉన్నారు, వారిలో ఏడుగురు భద్రతా దళాల వలయాన్ని ఛేదించి విజయవంతంగా తప్పించు కోగలిగారు.

బసవరాజు తల్లి, నాగేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు, ఇతర నాయకులు, వారి బంధువుల మృతదేహాలను వారి అంత్యక్రియల కోసం ఇంటికి తీసుకురావడానికి వారి కస్టడీని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అనుకూలమైన ఉత్తర్వు ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాలను అప్పగిస్తామని కోర్టుకు హామీ ఇచ్చింది. కానీ కుటుంబ సభ్యులు మృతదేహాల కోసం వేచి ఉండగా, రాష్ట్రం వాటిని ' క్లెయిమ్ చేయని మృతదేహాలు' అంటూ దహనం చేసింది.

కొన్ని రోజుల క్రితం, హక్కుల కార్యకర్త సోని సోరి కర్రెగుట్ట కొండలలో చంపబడిన వారి సభ్యుల మృతదేహాలను తీసుకురావడానికి బీజాపూర్ ఆసుపత్రికి కొన్ని ఆదివాసీ కుటుంబాలతో పాటు వెళ్ళిన అనుభవాన్ని వివరించారు. కుళ్ళిపోయిన మృతదేహాలపై వేలాది పురుగులు పాకుతూ ఉండడంతో వాటిని గుర్తించలేకపోయారు. బస్తర్‌లోని మావోయిస్టులను, ఆదివాసీల వారి ప్రాణాలు తీసిన తర్వాత కూడా రాజ్య హింస కొనసాగుతోంది. భారతదేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చడానికి మోడీ ప్రభుత్వం 2026 మార్చి 31 వరకు గడువు విధించింది. భద్రతా దళాలకు లైసెన్స్ లు, చంపడానికి ప్రోత్సాహకాలు ఇవ్వబడుతున్నాయి, ప్రతి హత్యకు హామీగా భారీ బహుమతులు లభిస్తాయి. ప్రభుత్వంతో కలిసి పనిచేసే మావోయిస్టులకు లొంగిపోయే విధానం ఉంది, కానీ ఈ విధానం వారిని 'జన జీవనం స్రవంతి' అని పిలవబడే పాత స్థితిలో పునరావాసం కల్పించడానికి ఉద్దేశించబడలేదు, వారిని కిరాయి సైనికులుగా మార్చడం, వారి మాజీ సహచరులకు, తరచుగా అదే సమాజం, ప్రాంతం, కుటుంబాలకు చెందిన తోటి ఆదివాసీలకు వ్యతిరేకంగా బలవంతంగా వారిని పోటీ పెట్టడం మాత్రమే.

సీఆర్పీఎఫ్ దాని ఎలైట్ కోబ్రా కమాండోలు, ఛత్తీస్‌గఢ్ పోలీసుల వంటి వివిధ సాయుధ దళాల నుండి 60,000 కంటే ఎక్కువ మంది భద్రతా సిబ్బందితోనే కాకుండా లొంగిపోయిన మావోయిస్టులు, బస్తర్ ఫైటర్లు, స్పెషల్ టాస్క్ ఫోర్స్‌తో కూడిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ లతో విశాల సైనిక శిబిరాలు. భారతదేశంలో అత్యంత సాంద్రత కలిగిన సైనికీకరణ ప్రాంతాలలో బస్తర్ ఒకటిగా మారి పోయింది, ఇక్కడ ప్రజలు వైమానిక బాంబు దాడులకు ఇజ్రాయెల్ డ్రోన్‌ల వాడకానికి బలవుతున్నారు.



300 కి పైగా భద్రతా శిబిరాలు ఈ ప్రాంతాన్ని సైనిక కంటోన్మెంట్‌గా మార్చాయి, ఇక్కడ ప్రతి ఎనిమిది మంది పౌరులకు ఒక భద్రతా సిబ్బంది ఉన్నారు. బస్తర్‌లోని ఆదివాసీలకు, జీవితంలోని ప్రతి అంశాన్ని భద్రతా దళాలు కప్పివేసి నిర్వహిస్తాయి. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌లో వాగ్దానం చేసిన స్వయం ప్రతిపత్తి, అటవీ హక్కుల చట్టం లేదా షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీ విస్తరణ చట్టం కింద అందించబడిన హక్కులన్నీ పోలీసు రాజ్యం, సైనికీకరించిన పరిపాలన యొక్క వింత వాతావరణంలో కనుమరుగయ్యాయి. బస్తర్ యొక్క సైనికీకరణకు యుపిఎ కాలం నాటి ఆపరేషన్ గ్రీన్‌హంట్, సల్వా జుడుం వంటి మావోయిస్టు వ్యతిరేక ప్రచారాల నుండి సుదీర్ఘ చరిత్ర ఉంది, వీటిని 2011 లో రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించి సుప్రీంకోర్టు రద్దు చేయాలని ఆదేశించింది. కానీ మోడీ శకం తీవ్ర హింసతో కొత్త దాడితో ప్రారంభమైంది. నేడు సైనికీకరణ అనేది భారీ కార్పొరేట్ దోపిడీని సులభతరం చేయడానికి ఒక 'శాశ్వత పరిష్కారం'.

మావోయిజంపై యుద్ధం ముసుగులో, సైనికీకరణ కార్పొరేట్ దోపిడీల సంబంధానికి వ్యతిరేకంగా బస్తర్‌లో జరుగుతున్న ప్రతి ఆదివాసీ నిరసనను మోడీ ప్రభుత్వం మరుగుపరచడానికి ప్రయత్నిస్తోందని మనం గమనించాలి. గాంధేయవాది హిమాన్షు కుమార్‌ను ఛత్తీస్‌గఢ్ నుండి బహిష్కరించారు, రచయిత్రి –కార్యకర్త బేలా భాటియాను వేధిస్తున్నారు, అణచివేస్తున్నారు. బస్తర్ లో దీర్ఘకాల ప్రజాదరణ పొందిన ప్రజా గొంతుక మాజీ సీపీఐ ఎమ్మెల్యే మనీష్ కుంజమ్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మూలవాసి బచావో మంచ్ అని పిలువబడే స్థానిక ప్రజల సైనికీకరణ వ్యతిరేక వేదికను నిషేధించారు. విచక్షణారహితంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం – చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం వంటి క్రూరమైన చట్టాల కింద ప్రజలను మూకుమ్మడిగా అరెస్టు చేస్తున్నారు. ఒక భావజాలాన్ని సమర్థించడం నేరం కాదనీ, ప్రతి ఎన్‌కౌంటర్‌పై తప్పనిసరి దర్యాప్తు కోసం మార్గదర్శకాలు ఉన్నాయని సుప్రీంకోర్టు పదే పదే చెప్పింది. నేడు సైద్ధాంతిక వేట ఎన్‌కౌంటర్ హత్యలు, తటస్థీకరణగా ఎక్కువగా వర్ణించబడుతున్నాయి, ఇవి రాజ్యం నిరంకుశ పాలసీకి మూల స్తంభాలుగా మారాయి.

ఆపరేషన్ కగార్ పరిణామాలు బస్తర్ లేదా మావోయిస్టులకు మాత్రమే పరిమితం కావు. అవి న్యాయం కోసం జరిగే ప్రతి ఉద్యమానికి, ఫాసిస్ట్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగే అన్ని అసమ్మతులకూ శరాఘాతంగా మారుతాయి.

త్వరలోనే, బస్తర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ అరాచక మోడల్ కొత్త లక్ష్య సమూహాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా అమలవుతుంది. బీజేపీ కర్ణాటక దుష్ట చిత్రాలలో అమిత్ షా చేతుల్లో ఉన్న కాలీఫ్లవర్ అందరికీ ఒక హెచ్చరికగా పనిచేయాలి. మావోయిస్టులు ఏకపక్ష కాల్పుల విరమణ ప్రకటించిన సమయంలో, శాంతి సంభాషణల ద్వారా రాజకీయ పరిష్కారం కోసం విస్తృత సమావేశం జరగాలి. భారత గణతంత్ర రాజ్యపు రాజ్యాంగ పునాది మనుగడ సాగించడానికి నారాయణపూర్ హత్యాకాండ, ఆపరేషన్ కగార్ కింద జరిగిన ఇటీవలి మారణహోమాలపై న్యాయ పర్యవేక్షణలో దర్యాప్తు జరిగి తీరాలి. మావోయిస్టులు ప్రస్తుత పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలి. ఈ ఎదురుదెబ్బ తర్వాత తిరిగి సంఘటితం కావడానికి ప్రయత్నించాల్సివుంది.

బస్తర్ తదితర ప్రాంతాల సాధారణ ప్రజానీకం గౌరవ ప్రదమైన న్యాయానికి అర్హులు. ఈ అమానుష సైనికదాడికి బలైన అమాయక జన బాహుళ్యానికి న్యాయం జరిగేలా చూడడం ప్రజాస్వామ్య వాదులందరి బాధ్యత.

**- కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్య**
జాతీయ ప్రధాన కార్యదర్శి,
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్

# తెలుగు పద్య వైభవం

ఈ నెలలో తెలంగాణ విద్యాశాఖ ఐదు రోజులపాటు ప్రభుత్వ ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసింది. వచ్చే నెలలో మొదలుకానున్న విద్యా సంవత్సరం నుంచి చేపట్టవలసిన మౌలికమైన మార్పులతోపాటు అందుకు అనుగుణంగా వారిని సంసిద్ధుల్ని చేయడం కోసం వీటిని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలలోని తెలుగు పండితులకు తెలుగు పద్యవైభవం పై అతిథి ప్రసంగాలను ఏర్పాటు చేశారు. మారిన సామాజిక పరిస్థితులలో విద్యారంగంలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో తెలుగు మనగడకే ఉనికి ముంచుకొస్తున్న తరుణంలో కారు చీకటిలో కాంతి కిరణంలా భాషోపాధ్యాయులకు పద్య వైభవంపై తరగతులు నిర్వహించడం అభినందనీయం.

నన్నయకు పూర్వమే తెలుగు శాసనాలలోనూ హాలుని గాథ సప్తశతిలోనూ పద్యాలు పదాలు ఉన్న అవి గ్రంథ రచనా భాషగా రూపొందలేదు. తెలుగువారికి భాష ,చరిత్ర, సాహిత్య పరంగా వేలాది సంవత్సరాల చరిత్ర ఉంది. ఆస్థానాలు, సంస్థానాలు, పద్యానికి రాచబాట పరిచాయి. "గుడికూలును నుయి పూడును,
వడినీళ్ళకు చెరువు తెగును వనమును ఖిలమౌ,
చెడనిది పద్యంబొకటియే,
కుడి ఎడమల కీర్తి కన్నా గువ్వల చెన్నా" అనే చాటువు తెలుగు పద్యం ఉనికిని ఔన్నత్యాన్ని చాటుతున్నది.

వెయ్యేళ్లకు పైబడిన చరిత్ర గల పద్యం ఎన్నో విలువలను బోధించింది. సంస్కృతిని అందించింది. అది కావ్యంగా, పురాణంగా, ప్రబంధంగా, శతకంగా, నాటకంగా, ఉద్యమంగా, అవధానంగా పలు పాయలలో ప్రవహిస్తూ ప్రజలను పాఠకులను ప్రభావితం చేసింది. అందుకే పద్యంలో ప్రతిభ, ప్రగతి, ప్రశంస, ప్రశ్న అనేవి దాగున్నాయి. నాటి సంప్రదాయం నుంచి నేటి ఆధునికత దాకా పద్యం వాహికగా కొనసాగుతున్నది. మహాభారతంలో నన్నయ ప్రసన్న కథాకలితార్థయుక్తికి, అక్షర రమ్యతకు ,నానా రుచిరార్థ సూక్తి నిధిత్వానికి, తిక్కన నాటకీయ శిల్పానికి ఎర్రన సూక్తి వైచిత్రికి పాల్కురికి సోమన జాను తెలుగుకు నాచన సోమన నవీన గుణాలకు శ్రీనాధుని చాటువులకు పోతన భక్తికి రాయల లోకజ్ఞాతకు పెద్దన అల్లిక జిగిబిగి నంది తిమ్మన ముద్దు పలుకు దూర్జటి దిక్కారానికి రామకృష్ణుని పద గుంప నానికి భట్టు మూర్తి సంగీతానికి సూరనశ్లేషకు చేమకూర చమత్కృతికి వేమన వేదాంతానికి బద్దెన నీతికి తిరుపతి వెంకట కవుల నాటకాలకు విశ్వనాథ వారి జీవుని వేదనకు జాషువా ప్రతిఘటనకు పుట్టపర్తి వారి జనప్రియత్వానికి మధునా పంతుల వారి ఆంధ్ర పురాణానికి దాశరథి సమరశీలానికి తుమ్మల దేశభక్తికి కరుణశ్రీ కారుణ్యానికి ఉత్పల వారి వక్రోక్తి గడియారం వారి గంభీరతకు నండూరి వారి ఆలోచనకు సుప్రసన్న గారి తాత్వికతకు నాగ భైరవ నవ్యత్వానికి బేత వోలు వారి భావు కతకు అనుమాన్ల ఆధ్యాత్మికతకు, శేషేంద్ర శేముషికి పద్యం వాహిక అయింది. నాటి పాల్కురికి సోమనాథుడు ఏ ముహూర్తాన వృషాధిప శతకం రాశాడో కానీ అది మొదలు నేటిదాకా తెలుగు నాట ఏదో ఒకచోట ప్రతి పూట ఒక కొత్త శతకం ఆవిష్కరింపబడుతూనే ఉంది. శ్రీశ్రీ సిరిసిరిమువ్వ, దేవి ప్రియ గరీబ్ గీతాలు కందాలలో అందంగా అందించారు. తాజాగా ఏనుగు నరసింహారెడ్డి గారు "ఏడు కోలల బాయి" పేరుతో ఎన్నికల శతకం రాశారు. ముఖ్యంగా 1995-2005 వరకు అవధాన విద్యకు స్వర్ణ యుగం అని చెప్పవచ్చు. తిరుపతిలో మేడసాని మోహన్, హైదరాబాదులో మాడుగుల నాగఫణి శర్మ, కాకినాడలో గరికిపాటి నరసింహారావులు సహస్రావధానాలు చేశారు. అష్టావధానాలకు, శతావధానాలకు లెక్కేలేదు. వద్దిపర్తి పద్మాకర్, కడిమెళ్ల వరప్రసాద్, కోట లక్ష్మీనరసింహం, నరాల రామారెడ్డి, రాళ్ళబండి కవితా ప్రసాద్, ఇందారపు కిషన్ రావు, ఆశావాది ప్రకాశరావు, ధూళిపాల మహదేవమణి, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు అపర్ణ, లలితాదిత్య, ఉప్పల దడియం భరత్ శర్మ, మొదలైన వారు అవధాన విద్య ద్వారా పద్యానికి పట్టాభిషేకం చేశారు. ముఖ్యంగా గత దశాబ్ద కాలంగా మరుమాముల సోదరులు పద్య విద్యకు అందులోనూ అవధాన విద్యా కళా ప్రదర్శన అంతరించిపోకుండా అవధాన విద్యా వికాస పరిషత్తు తరపున ఏటా శిక్షణా శిబిరాలను జయప్రదంగా నిర్వహిస్తున్నారు. ఇటీవలనే తూముకుంటలో ఆ కార్యక్రమం జరిగింది. తద్వారా ఎంతో మంది అవధానులు వెలుగులోకి వస్తున్నారు. ఇది ఒక శుభ పరిణామం.



ఈ నేపథ్యంలో తెలుగు పద్యం దైవభక్తిని ,దేశభక్తిని ప్రబోధించింది. జాతీయ సమైక్యత భావాన్ని చాటింది. సంఘసంస్కరణ దృక్పథాన్ని అందించింది. ఆత్మవిశ్వాసాన్ని ఆత్మాభిమానాన్ని రగిలించింది. రాజరికాని నిరసించింది. సౌకుమార్యాన్ని, సమరశీలాన్ని కలిగించింది. అంటరానితనాన్ని ప్రతిఘటించింది. పౌరుషాన్ని చాటింది. శ్రమశీలాన్ని గౌరవించింది. కష్టజీవిని ఆదరించింది. చరిత్రను తెలిపింది. సంస్కృతిని నేర్పింది. నాగరికతను కల్పించింది. కర్తవ్యాన్ని పురికొల్పింది. వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించింది. మానవీయ విలువల్ని ప్రబోధించింది. తరాల మధ్య అంతరాలు లేకుండా వారధి నిర్మించింది. ఈ నేపథ్యంలో గతాన్ని గుర్తించి వర్తమానాన్ని ప్రేమించి భవిష్యత్తును దర్శించేలా తరతరాలకు తెలుగు పద్య వైభవాన్ని దాని సౌరభాలను ఆస్వాదించి భావి భారత పౌరులకు అందిద్దాం. అందుకే ఆ పరిమళాలను ఆస్వాదిద్దాం. ఆనందిద్దాం.

**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
9989148305

## కొనుగోలు ప్రక్రియ రైతులకు పారదర్శకంగా ఉండాలి

• జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు



**గద్వాల నడిగడ్డ, మే 29 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులకు పారదర్శకంగా, సమయానుకూల చెల్లింపులతో జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. గురువారం కేటి దొడ్డి మండలంలోని కొండాపురం గ్రామం లోని ఐకెపి వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వహించబడుతున్న ప్రక్రియలను సమగ్రంగా పరిశీలించారు. అధికారులు,సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ ధాన్యం నాణ్యత,కొనుగోలు ధరలు,త్రాసు పనితీరు, గోడౌన్ సదుపాయాలు, రైతులకు జారీ చేసే కొనుగోలు రసీదులు, రైతుల నుంచి ధాన్యం తీసుకునే విధానం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, వ్యవస్థబద్ధంగా ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా పకడ్బందీ పద్ధతిలో కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలన్నారు. అవసరమైతే తక్షణ చర్యలు తీసుకుని లోపాలను సరిచేయాలని సూచించారు.

# ఇందిరమ్మ కలలను నిజం చేస్తున్నాం

• రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లను పేదలకు అందించి, భారత దేశ మాజీ ప్రధాన మంత్రి ఇందిరమ్మ కలలను నిజం చేస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులందరూ త్వరగా ఇండ్లను నిర్మించుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల మహిళా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల అవగాహన సదస్సును నిర్వహించి, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ పేద వాళ్లకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్వంత ఇంటి స్థలం ఉంటే 5 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల నిర్మాణాలను త్వరగా నిర్మించుకోవాలని తెలిపారు. రాష్ట్రం లోని మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించిందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూ. లకే వంట గ్యాస్ సిలెండర్, సన్న బియ్యం, రుణ మాఫీ పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నదని తెలిపారు. 8 లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ ప్రతీ నెల 6500 కోట్ల వడ్డీ చెల్లిస్తూ,



ప్రభుత్వం పేద వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి అద్దె చెల్లిస్తున్నారని, పెట్రోల్ బంక్ లను, సోలార్ పవర్ యూనిట్లను మంజూరు చేయడం జరుగుతున్నదని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి 8 వేల కోట్లతో పథకాన్ని ప్రారంభించడం జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రంలో పిల్లలు పక్కదారి పట్టకుండా భద్రంగా చూసుకోవాలని, గంజాయి వంటి మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా చూడాలని మహిళలకు తెలిపారు. అనంతరం బాన్సువాడ శాసన సభ్యులు , ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించామని, ప్రతీ నియోజక వర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేయడం జరుగుతున్నదని తెలిపారు. మంజూరు అయిన లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. బీర్కూర్ మండలంలో 370, నసురుల్లాబాద్ మండలంలో 374 మందికి ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దేవునికి గుడి కట్టిస్తే ఎంత ప్రాముఖ్యత ఉందో నిలువ నీడ లేని నిరుపేదలకు ఇంటిని నిర్మిస్తే అంతే ప్రాధాన్యత ఉంటుందన్నారు. తదనంతరం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని, లబ్ధిదారులు వెంటనే ఇండ్లను నిర్మించుకొని దశల వారీగా 5 లక్షలు పొందాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు నిర్మించుకుంటే 6 లక్షలు అందజేస్తామని అన్నారు. నిరుపేద మహిళలకు ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి కావలసిన స్టీల్, సిమెంట్ ముడిసరుకుల కోసం మండల ధరల నియంత్రణ కమిటీలను వేయడం జరిగిందని, ఇసుక ఉచితంగా పొందవచ్చని కాని రవాణా, లేబర్ ఖర్చులు లబ్ధిదారుడు చెల్లించాలని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మంజూరు పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఫెయిల్ అయిన విత్తనాలను రీ శాంపిల్ చేయాలి

• నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి లవన్న

**మల్దకల్, మే 29 (జనంసాక్షి) :** జిల్లాలో సీడ్ పత్తి రైతులను సీడ్ కంపెనీలు ఆర్గనైజర్లు అనేక రకాలుగా దోపిడీ చేస్తున్నారని, ఈ విషయంపై నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి నివేదిక అందజేయడానికి జిల్లాలో ఉన్న రైతులు ఈ నెల 31న పెద్ద ఎత్తున గద్వాలకు తరలిరావాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో గురువారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి లవన్న,మండల అధ్యక్షుడు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసీడ్ పత్తి సాగు చేస్తున్న రైతులను కంపెనీలు ఆర్గనైజర్లు రోజుకో కొత్త నాటకానికి తెర లేపుతూ, అన్యాయంగా నట్టేట ముంచుతున్నారని,వారి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు.ప్యాకెట్ పై రేట్లు పెంచాల్సిన కంపెనీలు ఆర్గనైజర్లు రేట్లు పెంచకుండా రైతులను అన్యాయం చేస్తున్నారని,పాస్ అయిన విత్తనాలను ఫెయిల్ అయినట్లు నిర్ధారణ చేసి అనేక రకాలుగా రైతులను అప్పులపాలు చేసి కొత్త నాటకానికి తెరలేపుతున్నారని తెలిపారు.నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి కంపెనీలు ఆర్గనైజర్లు



చేస్తున్న మోసాలపై, సీడ్ పత్తి రైతుల సమస్యల పరిష్కారానికై నివేదిక అందజేయడానికి రైతులు తప్పకుండా గద్వాలకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి లవన్న, మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు నజీముల్లా, ప్రేమ్ రాజ్, మండల కార్యదర్శి ఉప్పరి కృష్ణ, తిమ్మప్ప, దాసరిపల్లి రాముడు, నాయకులు మీసాల కిష్టన్న, అంజి, బంగి పరిష, సుదర్శన్, నాగర్ దొడ్డి కృష్ణ, ముద్దుల నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్ జిల్లా బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** మాదకద్రవ్య రహిత జిల్లాగా మెదక్ జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపైనే దృష్టి సారించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలని, గంజాయి, మత్తు పదార్థాలు దరిచేరకుండా కళాశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యాధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు గురించి తెలియజేసేలా పోలీస్ యంత్రాంగం తరపున కృషి



చేస్తున్నామన్నారు. నిరంతర తనిఖీలు నిర్వహించి గంజాయి మత్తు పదార్థాల రవాణాను అరికడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ రెవిన్యూ ,పోలీస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఐటిఐ కాలేజ్‌ను సందర్శించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**మర్పల్లి, మే 29 (జనంసాక్షి) :** గురువారం మర్పల్లి మండల కేంద్రంలోని ఐటిఐ కాలేజీని సందర్శించిన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి. అక్కడ ఉన్న ఉన్న కళాశాల సిబ్బందికి స్కిల్ ఇండియా గురించి వారికి వివరించారు. కళాశాలల్లో ఉన్న గదులను పరిశీలించారు. మండలానికి వచ్చిన ఆయనకు బీజేపీ నాయకులు కార్యకర్తలు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రమేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి, మలేష్, బలరాంగౌడ్, అనపూర్ణ, మహేశ్వరీ, శ్రీమంత్ కుమార్, మహేష్, సంగమేష్, నగేష్, శేఖర్, శు రేష్, మధు, శ్రీధర్, జైపాల్, తులజ్జన్న, లక్ష్మన్,మైపాల్ రెడ్డి, లకిరామ్, గోపాల్, భద్రన్న,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీపీలను ప్రారంభానికి సిద్ధం చేయండి

• అధికారులను ఆదేశించిన ఎండీ అశోక్ రెడ్డి
• డీతో కలిసి ఎస్టీపీల సందర్శన

**హైదరాబాద్, మే 29 (జనంసాక్షి) :** ఎస్టీపీల పనుల్లో వేగంపెంచి తుదిదశలో ఉన్న వాటిని ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఈడీ మాయాంక్ మిట్టల్‌తో కలిసి అంబర్‌పేట్, అత్తాపూర్ ఎస్టీపీలను సందర్శించారు. తొలుత అంబర్‌పేట్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. చిన్న చిన్న సివిల్ వర్క్‌లు,



గార్డెనింగ్, పెయింటింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణంలాంటి పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అలాగే సుందరీకరణ పనులను చేపట్టి ఎస్టీపీ ప్రాంగణంలో చెత్తాచెదారం తొలగించి నేలని చదును చేయాలని సూచించారు. అనంతరం అత్తాపూర్ ఎస్టీపీని సైతం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం సుజాత, ఎస్టీపీ ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

• జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, మే 29 (జనం సాక్షి) :** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, ఉద్యోగ ధర్మాన్ని నిజాయితీగా నిర్వర్తించినప్పుడే శేష జీవితంలో అది ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందుతున్న ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మణ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని సరోజలకు జిల్లా యంత్రాంగం తరపున పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలలో భాగంగా మన సర్వీసులో నిబద్ధతతో పనిచేసి, ఉన్నతాధికారుల మన్ననలు పొందడం పదవీ విరమణ సమయంలో ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని అన్నారు. 35 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా వివిధ హోదాలలో ఉత్తమ సేవలు అందించడం జరిగిందని, వీరిని ఆదర్శంగా తీసుకొని వచ్చే జనరేషన్ అధికారులకు మీ సూచనలు సలహాలు ఎంతో అవసరం అని అన్నారు. పదవి విరమణ పొందినప్పటికిని సిపిఓ సేవలను రాబోవు రోజులలో



నిర్వహించే సెన్సెస్ పనులకు ఉపయోగించుకుంటామని అన్నారు. తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని, అదేవిధంగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆసక్తి ఉన్న సామాజిక కార్యక్రమాలలో ముందుకు సాగాలని కలెక్టర్ తెలిపారు.పదవి విరమణ సందర్భంగా వీరిని జిల్లా కలెక్టర్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు తక్షణ చర్యలు

• జిల్లా సరఫరాల మేనేజర్ విమల



**గద్వాల నడిగడ్డ, మే 29 (జనం సాక్షి) :** వరి ధాన్యం తడిసి రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సరఫరాల మేనేజర్ విమల తెలిపారు. గురువారం గద్వాల మండలము లత్తిపురం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రుతుపవనాలు ముందుగానే వచ్చినందున వర్షాలు కురియడం జరుగుతుందని, దీనివల్ల ధాన్యాన్ని ఆరబెట్టడం ఇబ్బంది అవుతుందన్నారు.అయినప్పటికీని రైతులకు నష్టం వాటిల్లకుండా వరి ధాన్యాన్ని సేకరించి రైస్ మిల్లర్లకు చేర వేయడం జరుగుతుందని తెలియజేశారు. వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు అదనంగా వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు చేరవేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే ట్యాబ్ ల ద్వారా ఆన్ లైన్ లో వివరాలను నమోదు చేసి సంబంధిత రైతులకు 48 గంటలలో వారి డబ్బులు వారి ఖాతాకు నేరుగా జమ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉన్న గోనె సంచులు, తార్పాలిన్లను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి పెద్దపీట

• నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

**కౌల్చారం, మే 29 (జనం సాక్షి) :** సీఎంఆర్ఎఫ్ పథకం... పేదల పాలిట వరం, నియోజకవర్గంలో పెద్దల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లాలోని కౌల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన బి. వినోదకు లక్ష రూపాయల ఎల్ఓసిని ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేయించి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా శాయశక్తులా ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, పోతాంశే ట్పల్లి గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు యాదాగౌడ్, సిద్దిరాములు, యాదయ్య, గౌరిశంకర్, పైతర మాజీ సర్పంచ్ ఎల్లేశం సంతోష్, బాలరాజ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

• చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కాలే యాదయ్య

**మొయినాబాద్, మే 29 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయడం జరుగుతుందని చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని మేడిపల్లి, పెద్దమంగళారం ,చందనగర్ అందాపూర్, గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏం ఎల్ ఏ కాలే యాదయ్య పాల్గొని భూమి పూజ నిర్వహించారు. అందాపూర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇందిరమ్మ పథకం పేదల పథకం అని పేర్కొన్నారు. ప్రభుత్వం పేదల పక్షంలో నిలవడి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం పేదలకు వరంలాంటిదన్నారు. ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పిల్లర్లు మొదట లక్షరూపాయలు, ఆతరువాత లక్ష, ఆతరువాత రెండు లక్షలు చివరగా లక్ష రూపాయలు మొత్తం ఐదు లక్షలు



అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ పేరుతో ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరగడం లేదని ఇతర పార్టీల నాయకులు విమర్శించకుండా పేదలు ఇండ్లు నిర్మించుకునేలా కృషి చేయాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే ఓర్వలేక ఆయా పార్టీలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అభివృద్ధి కోసం ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంతో సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దర్శన్, కార్పరేట్ సొసైటీ చైర్మన్ చేంద్ర రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తొక్కట్ట జంగయ్య, వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్లు జి.నరసింహ రెడ్డి, కొల్ల సిద్దయ్య నాయకులు మన్నె ప్రభాకర్ రెడ్డి, యువ నాయకుడు గొల్లపల్లి సాయిపల్ రెడ్డి,తూర్పు జితేందర్ రెడ్డి, కారొబర్ గోపాల్ చారి,సామ జగన్ రెడ్డి, మాడి దయాకర్ రెడ్డి, సకలిగూడెం రాజు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కృష్ణ, రక్త మైసమ్మ దేవాలయ పూజారి అంజన్ శాస్త్రి, కిసాన్ సంగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్,రజక సంఘం ప్రెసిడెంట్ సాకలి శ్రీశైలం,ఏం డి ఓ సంధ్య , స్పెషల్ ఆఫీసర్ డా దేవి రెడ్డి, గ్రామ కార్యదర్శి కవిత, అంగన్వాడీ టీచర్లు స్వర్ణ లత, సరస్వతి వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
30 మే 2025

# న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం







- కనీస సౌకర్యాలు లేక గర్భిణీలు, బాలింతలు సతమతం
- పాలకులు, అధికారుల తీరుపై రోగుల ఆగ్రహం

**సాక్షాత్తు ఆరోగ్య మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం సోకింది. కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో ఆసుపత్రికి వస్తున్న గర్భిణీలు, బాలింతలు, రోగులు ఆగ్రహంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే సుఖ ప్రసవాలకు పెట్టింది పేరైన ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం సోకడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఉన్నతాధికారులిచ్చిన టార్గెట్ ను అధిగమించి సుఖ ప్రసవాలు జరిగే కేంద్రమది. జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా పలుమార్లు ప్రశంసలు అందుకున్న ఆసుపత్రది. ఒకానొక సందర్భంలో 24 గంటల వ్యవదిలో 4 / 5 మేర, పలుమార్లు సుఖ ప్రసవాలు నిర్వహించిన ఆసుపత్రది. మెరుగైన సేవలు అందించిన ఆసుపత్రి నేడు కనీస సౌకర్యాలు లేక గర్భిణీలు, బాలింతలు, రోగులు సతమతమవుతున్నారు. కొరవడిన జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ, పట్టించుకోని పాలకులతో న్యాల్ కల్ లోని.."ప్రాథమిక ఆరోగ్య కేంద్రం" అనారోగ్యం సోకిన చందంగా మారింది. అధ్వానంగా మారిన న్యాల్ కల్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై "జనం సాక్షి" ప్రత్యేక కథనం..**

**న్యాల్‌కల్, మే 29 (జనం సాక్షి)**

### కరువైన కనీస సౌకర్యాలు

సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస సౌకర్యాల ఏర్పాటుకు నోచుకోక గత కొన్ని రోజులుగా గర్భిణీలు, బాలింతలు, రోగులు సతమతమవుతున్నారు. పది పడకల సామర్థ్యం గల ఆసుపత్రిలో తరచుగా విద్యుత్ సరఫరా, త్రాగునీటి సరఫరా నిలిచిపోవడం, ఏమాత్రం ఉపయోగం లేని





మరుగు దొడ్లు, లోపించిన పారిశుధ్యం, దుర్వాసనతో రోగుల గదులు, రేయింబవళ్లు కారు చీకట్లోనే రోగులు కొనసాగడం, బహిర్భూమి కోసం బాలింతలు, గర్భిణీలు ఆసుపత్రిని వదిలి పంట పొలాలు, నిర్జీవ ప్రదేశాలకు వెళ్లడం షరా మామూలుగా మారింది. తరచుగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొనడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వోల్టేజీ విద్యుత్ సమస్యతో తరచుగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. త్రాగునీరు, ఇతర సౌకర్యాల కోసం ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా ఎద్దడి నెలకొంది. నీటి సరఫరా నిలిచిపోవడంతో శౌచాలయాలు దుర్వాసనతో కంపు కొడుతున్నాయి.

### రెండు రోజులుగా ఆసుపత్రిలో అంధకారం

బాలింతలు, గర్భిణీలు ఉండే గదిలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నీటి సరఫరా సైతం లేకుండా పోయింది. మరుగుదొడ్ల నిరుపయోగంగా మారడంతో దుర్వాసన నెలకొంది. రాత్రి వేళల్లో దోమలు, దుర్వాసనతో నిద్రలేని రాత్రులు గడిపాము. పనిచేయని మరుగుదొడ్లతో తప్పని పరిస్థితుల్లో.. వర్షంలో సైతం ఆస్పత్రిని వదిలి ఇతర ప్రదేశాలకు వెళ్లాల్సి వచ్చింది. రోజు కురుస్తున్న వర్షం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

### దశాబ్దాల కాలంగా 108 వాహనాన్ని నోచుకోని ఆసుపత్రి



దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన 10 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నేటికి సైతం 108 వాహనం ఆసుపత్రికి అందని ద్రాక్షగా మారింది. అత్యవసర సమయాల్లో రాయికోడ్ ఆసుపత్రికి చెందిన108 వాహన సేవలను వాడు కోవలసిన పరిస్థితి నెలకొంది. కాలం చెల్లిన వాహనం, సమయానికి రాని వాహనంతో ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. న్యాల్ కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇటీవల మంజూరైన 108 వాహనాన్ని సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి స్థానిక ఆరోగ్య కేంద్రానికి ప్రత్యేకంగా 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**వడ్ల సునీత బాలింతరాలు, మిర్జాపూర్ (ఎన్)**

### ఆస్పత్రి నిర్వహణకు అరకొర నిధులు

ఆసుపత్రిలో కనీస సౌకర్యాల ఏర్పాటుకు నిధుల కొరత మరింతగా వేధిస్తోంది. నిర్వహణకు అవసరమైన నిధులకు గాను అరకొరగా నిధులు విడుదల అవడంతో కనీస సౌకర్యాలు ఏర్పాటుకు ఇబ్బందిగా మారింది. జిల్లా ఉన్నతాధికారులకు పలు మార్లు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను దృష్టికి తీసుకు వెళ్ళాం. ఆస్పత్రిలో సౌకర్యాల ఏర్పాటు కోసం జహీరాబాద్ లోని ఓ పరిశ్రమకు చెందిన యాజమాన్యంతో చర్చించాం. ఆసుపత్రి అభివృద్ధికి పరిశ్రమ యాజమాన్యం సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వారితో చర్చించి ఆసుపత్రిలో రోగులకు అవసరమైన సౌకర్యాలను సమకూరుస్తాం.

**వైద్యాధికారి డాక్టర్ జైన్ అమృత్‌రాజ్**

# మహిళపై అత్యాచార ప్రయత్నం

- వ్యక్తితో పాటు, సహకరించిన వ్యక్తి అరెస్ట్




**నంగునూరు, మే 29 (జనం సాక్షి) :** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని ఒక గ్రామంలో తల్లిగారింటి ఇంటి వద్ద ఉన్న వివాహిత మహిళపై అత్యాచార ప్రయత్నం చేసిన వ్యక్తితో పాటు, అతనికి సహకరించిన అతని స్నేహితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు రాజగోపాలపేట ఎస్సై ఎండీ ఆసిఫ్, ప్రొబేషనరీ ఎస్సై సౌజన్య తెలిపారు. పాలమాకుల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సంపంగి మహేష్ అనే వ్యక్తి మండల పరిధిలోని ఒక గ్రామంలో తనకు పరిచయం ఉన్న మహిళపై బుధవారం రాత్రి అత్యాచార ప్రయత్నం చేశాడు. ఇందుకోసం పాలమాకుల గ్రామానికి చెందిన తన స్నేహితుడు పల్లెపు సంపత్ తో ద్విచక్ర వాహనంపై మహిళ తల్లిగారి ఊరికి వెళ్లారు. సంతోష్ ను బయట కాపలా ఉంచి సంపంగి మహేష్ మహిళ ఉన్న ఆమె తల్లిగారి ఇంట్లో కి రాత్రి చొరబడి మహిళపై అత్యాచారం చేయబోయాడు. మహిళ అరవడంతో ఆమె తల్లి తండ్రులు, చుట్టుపక్కల వారు నిద్ర లేచారు. దీంతో మహేశ్, సంపత్‌లు ద్విచక్రవాహనం మీద పారిపోయారు. గురువారం పాలమాకుల బస్ స్టాండ్ వద్ద టీఎస్ 36 ఏ 0206 నెంబరు గల ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించినట్లు వివరించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

- రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి

**సంగారెడ్డి, మే 29 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు మునిపల్లి మండలంలో మంజూరైన వారు నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మునిపల్లి మండలంలోని లోని కలాన్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మునిపల్లి మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం చేపడితే బిల్లులు నిర్మాణాల స్థాయినిబట్టి విడతలవారీగా విడుదల అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, మునిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లోడి సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రామ్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దిగంబరం, మహిపాల్, ఏవో అనిత, ఏఈఓ రహ్మాన్, నాయకులు పాల్గొన్నారు.



# నష్టాల్లో మామిడి రైతులు

- అసలే గిట్టుబాటు ధర లేక అవస్థలు
- ఈదురుగాలులకు నేల రాలుతున్న కాయలు
- ఆందోళనలో రైతన్న

**సంగారెడ్డి ప్రతినిధి, మే 29 (జనం సాక్షి) :** మామిడి రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారు. అసలే గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న సమయంలో కొద్ది రోజులుగా వీస్తున్న ఈదురు గాలులు అకాల వర్షాలతో మరిన్ని నష్టాలకు గురి చేస్తున్నాయి. గాలులకు చెట్ల నుంచి పెద్ద ఎత్తున కాయలు నేల రాలిపోతుండడంతో రైతులు పూర్తిగా నష్టాల్లో కూరుకుపోతున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పెద్ద చెల్మెడ, మన్సాన్పల్లి, చిన్న చెల్మెడతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో గల మామిడి రైతులు ఈ ఏడాది పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పూత దశ నుంచి కాయ వచ్చే వరకు ఎకరాకి రూ.4 వేల నుంచి రూ.7 వేలు వరకు పెట్టు బడి అవుతుందని. కాయ కాచిన తరువాత వాటిని కోసి మార్కెట్‌కి తరలించే సరికి మరింత ఖర్చు



అవుతుందని రైతులు చెబుతున్నారు. మామిడి రైతుకు లాభసాటిగా ఉండాలంటే ఎకరా తోటకు సుమారు ఐదు టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉంది. అంతేకాదు టన్నుకు రూ. 10 వేలు నుంచి రూ.15 వేలు వరకు గిట్టుబాటు ధర వస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందని చెబుతున్నారు. అయితే ఈ ఏడాది గిట్టుబాటు ధర రావడం లేదు సరికదా కనీసం పెట్టిన పెట్టు బడులు కూడా చేతికి రావడం లేదు. కొద్ది రోజులుగా వీస్తున్న ఈదురు గాలులు, వర్షాలకు కాయలు పెద్ద మొత్తంలో నేలరాలిపోతుండడంతో రైతులు మరింత నష్టపోతున్నారు.

### తీవ్రంగా నష్టపోయాం..



ఇటీవల వీచిన ఈదురు గాలులకు పెద్ద మొత్తంలో కాయలు నేల రాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం లక్షల్లో పెట్టుబడి పెట్టిన కనీసం వేలల్లో కూడా లాభం వచ్చేలా కనిపించడం లేదు. మార్చి నెలలో ఈదురు గాలులు, వడగళ్ల వర్షానికి మామిడికాయలు నేలరాలి సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లింది. వ్యవసాయశాఖ అధికారులు మామిడి తోటను సందర్శించి ఆర్టికల్చర్ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎంత నష్టం వాటిల్లింది సమాచారం లేదు ఇప్పటివరకు ఎలాంటి నష్టపరిహారం అందలేదు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన మామిడి రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**బాబుమియా, రైతు**

## భూ భారతిలో సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకం

- లైసెన్స్ సర్వేయర్ల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమం పరిశీలించిన కలెక్టర్
- మొదటి విడతలో (111) మందికి శిక్షణ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
- 50 రోజుల పాటు సర్వేయర్‌ల శిక్షణ కార్యక్రమం



**మెదక్ జిల్లా బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** పౌరుల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి భూమి హక్కుల రికార్డు చట్టం – 2025ను అమల్లోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఐటిఐ దగ్గర ఉన్న ఆర్ట్స్ కళాశాలలో లైసెన్సు సర్వేయర్‌ల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్సు సర్వేయర్ శిక్షణలో భాగంగా, వీరందరికీ అనుభవజ్ఞులైన వారిచే సర్వే శిక్షణను 50 రోజుల పాటు అందిస్తారని, ఈ లైసెన్స్ సర్వేయర్లకు భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు, తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు.భూముల లావాదేవీలు జరిగినప్పుడు సర్వే చేసి, హద్దులను నక్షాలో పొందుపరిచిన తర్వాత రిజిస్ట్రేషన్లు చేసే విదంగా రానున్న రోజులో చర్యలు తీసుకోబడుతాయని, దీంతో తగాదాలకు చోటు ఉండదని వివరించారు. సర్వేయర్ లు శ్రద్ధగా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి పరీక్ష పెట్టి, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రం ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భూములు, సర్వే ఏడీ. శ్రీనివాస్ ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు




**మక్తల్, మే 29 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయని మక్తల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏ. రవికుమార్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏ రవికుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం ఇతర సంక్షేమ పథకాలకు పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకే అందుతాయని అన్నారు. లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూటికి నూరు శాతం పేద ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో విజయం సాధించే దిశగా కార్యకర్తలు, శ్రేణులు సంసిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోవధశాలలను మూసివేయాలి



**అమీన్‌పూర్, మే 29 (జనం సాక్షి) :** రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవదశాలను తక్షణమే మూసివేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యకారిణి ఆర్ వి ఎస్ రవి డిమాండ్ చేశారు. గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పటాన్చెరు, రామచంద్రపురం, అమీన్పూర్ తాహసిల్దార్లకు, అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నరేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న బక్రీద్ సందర్భంగా హైదరాబాదుకు అక్రమంగా లక్షల గోమాతలను తరలిస్తున్నారన్నారు. అక్రమంగా గోవులను తరలించి గోవధ చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో గుర్తింపు పొందిన గోశాలలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గోవధ నిషేధ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఆయనతోపాటు ప్రఖండ కార్యకారిని రామచంద్రుడు, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్ రెడ్డి, అమీన్పూర్ బిజెపి నాయకుడు కొండ లక్ష్మణ్ గుప్తా, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల పేర్లు లేక ప్రయాణికులు తికమక

- ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం



**మల్దకల్, మే 29 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ గద్వాల ఆర్ అండ్ బి రోడ్డు వెంబడి కిలోమీటర్ రాళ్లకు గ్రామాల పేర్లు కనపడకపోవడంతో ప్రయాణికులు వాహన చోదకులు తికమక పడుతున్నారు.వాహన చోదకులు, ప్రయాణికులు ఏ గ్రామం ఎన్ని కిలోమీటర్లు ఉన్నది తెలియక చాలామంది ఇబ్బంది పడుతున్నారు.ప్రతిరోజు ఆర్ అండ్ బి రోడ్డు పక్కన ఉన్న రాళ్లకు ఎన్ని కిలోమీటర్లు ఉన్నదని చూద్దామంటే అక్షరాలు కనిపించకపోవడంతో కొన్ని సంవత్సరాల నుండి వాటిపై రాయించిన దాఖలాలు లేవు. ఆర్ అండ్ బి శాఖ ఉన్నట్టా... లేనట్టా అని పలువురు విచార వ్యక్తం చేస్తున్నారు.ఐజా నుండి గద్వాలకు వెళ్లే వైపు ఉన్న ప్రమాదాలు సూచించే బోర్డులు కూడా సక్రమంగా లేకపోవడంతో వాటిని సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మూలమలుపు దగ్గర ఉన్న సూచించే బోర్డులు కూడా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతిరోజు అధికార యంత్రాంగం రోడ్డు వెంబడి వెళుతూ ఉన్నప్పటికీ వాటి గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే గద్వాల- ఐజ ఆర్ అండ్ బి రోడ్డు పక్కన ఉన్న రాళ్లకు కిలోమీటర్లను సూచిస్తూ గ్రామాల పేర్లు కూడా రాయించాలని పలువురు కోరుతున్నారు.

# అభివృద్ధి చేయడం మా బాధ్యత..

- ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తా..
- పేదలందరికీ పథకాలు అందిస్తాం..
- 18 నెలల్లో రాష్ట్రంలో మెరుగైన పాలన..
- రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి..
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అభివృద్ధి చేయడం మా బాధ్యత అని, ప్రజల సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని, అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో రాష్ట్రంలో మెరుగైన పాలన అందించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని తెలియజేశారు. దొడ్డు బియ్యం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, పేదలకు సన్న బియ్యం అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సన్న బియ్యం పథకం దేశంలోనే ఆదర్శనీయ పథకం అని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి పారదర్శక పాలన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆలోచన విధానంలో మార్పు వచ్చినప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కాలనీలో వివిధ సమస్యలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కాలనీలోని సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**పట్టణంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర..**

భూపాలపల్లి పట్టణంలోని 8, 27 వార్డులైన జవహర్ నగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ ఆధ్వర్యంలో జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు కాలనీ వాసులు, నాయకులు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం బాపూ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేసి, అక్కడున్న నాయకులు, ప్రజలతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యాత్రనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. కాలనీలో యాత్ర మధ్యలో పలువురు కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అక్కడున్న మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం జవహర్ నగర్ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ కార్పోరేషన్ నిధులు రూ.2 లక్షల వ్యయంతో స్థానికంగా వేసిన మంచి నీటి బోరు మోటారును స్విచ్ఛాన్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు మంచి నీటి ఇబ్బంది లేకుండా చూడటమే తన లక్ష్యమని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్దే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిర్రు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ముంజాల రవీందర్, దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాట యోధుడు మునీర్

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్





**మంచిర్యాల, మే 29 (జనంసాక్షి) :** సింగరేణి కార్మికుల, ప్రజల కోసమే జీవితాంతం పరితపించిన ప్రత్యేక రాష్ట్ర పోరాట యోధుడు మునీర్ అని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ పేర్కొన్నారు. గురువారము జిల్లా కేంద్రం లో ఐ బీ చౌరస్తా లో సింగరేణి రిటైర్డ్ కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన మునీర్ సంస్కరణ సభ, 300 మందికి అన్నదాన కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాయకులు, కార్మికులు మునీర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ... నల్ల నేల ముద్దుబిడ్డ గని కార్మికుల హక్కులు సంక్షేమం కోసం అధికారులతో తలపడి నిలబడిన గొప్ప ధైర్యశాలి మునీర్ అని అన్నారు. సింగరేణి సకల జనుల సమ్మె విజయవంతం కావడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సింగరేణి కార్మికులు నాయకులు మునీర్ ఆదర్శంగా తీసుకొని సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నిజాయితీతో జర్నలిస్టు ల సమస్యల పరిష్కారానికి కార్మికుల, పేదల పక్షాన నిలబడ్డరని కొనియాడారు. పేదల అండగా నిలబడడమే మునీరు నిజమైన నివాళిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీ టీ ఓ సంతోష్ కుమార్,సింగరేణి రిటైర్డ్ కార్మికులు గూడూరు యాదిరెడ్డి, వెంకట్రాజం, బార్ అసోసియేషన్ నాయకులు సందాని, కర్ర లచ్చన్న, మొహియుద్దీన్, దమ్మల శ్రీనివాస్, జలాలుదీన్, తాజ్, రాయమల్లు, రాజేందర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ఎన్నో అవకాశాలు

- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- మెగా టెక్స్‌టైల్ పార్క్‌పై సమీక్షా సమావేశం



**వరంగల్ ప్రతినిధి, మే29 (జనంసాక్షి):** రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో వరంగల్ టెక్స్‌టైల్ డైరెక్టర్ ధణికాంత్‌తో కలిసి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిలో భాగంగా సమీక్ష నిర్వహించారు. జోనల్ మేనేజర్ తో పాటు హార్టికల్చర్, ఫారెస్ట్, డిఆర్‌డిఓ, జిఎం ఇండస్ట్రియల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఎలక్ట్రిసిటీ శాఖల, ఉపాధి కల్పన శాఖ అధికారులతో పాటు కిటెక్స్ యంగ్ వన్ గణేష్ ఎకోటెక్ పరిశ్రమల యజమాన్యంతో సమీక్ష నిర్వహించి ఆయా శాఖలు చేయవలసిన పనులపై రివ్యూ నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి, ఉద్యోగ అవకాశాల సృష్టికి, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇది టెక్స్‌టైల్ రంగంలో సమగ్ర మౌలిక సదుపాయాలను అందించడంతో పాటు, మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలోనూ ముందుంది. ప్రభుత్వం, పరిశ్రమలు, స్థానిక వృత్తిదారుల సహకారంతో ఈ పార్క్ దేశంలో మోడల్ టెక్స్టైల్ పార్క్‌గా గుర్తింపు పొందుటకు కృషి చేయాలని అన్నారు.సంబంధిత శాఖల అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ గ్రీన్ కవర్ ఏర్పాటుకు ఫారెస్ట్ మరియు హార్టికల్చర్ అధికారులు కో ఆర్డినేషన్‌తో త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిఆర్‌డిఏ నుండి మహిళలకు టైలరింగ్ ట్రైనింగ్ నిర్వహించినట్టు మొత్తం 6 బ్యాచ్‌లుగా తయారు చేసి ఇప్పటివరకు నాలుగు బ్యాచ్‌లకు ట్రైనింగ్ పూర్తయిందని, ఇంకాను రెండు బ్యాచ్ లకు ట్రైనింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. కాకతీయ టెక్స్టైల్ పార్కులో భూమి కోల్పోయిన భూ నిర్వాసితులకు ఇండ్ల స్థలాల కూడా లేఅవుట్ అనుభూతులు ,మౌలిక సౌకర్యాలు కల్పించుటకు జోనల్ మేనేజర్ ని ఆదేశించారు. అనంతరం కూడా అనుమతులు అనంతరము రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించుటకు సంబంధిత తాసిల్దార్, జోనల్ మేనేజర్ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ టెక్స్ టైల్ ధరణి కాంత్ మాట్లాడుతూ ఈ కాకతీయ మెగా టెక్స్‌టైల్ ఇండస్ట్రియల్ లో ఎలాంటి ఉపాధి కల్పించవచ్చు అవి ఎలాంటి అర్హతలు కలిగి ఉండాలి అనే దానిపైన అవేర్నెస్ అవసరం అని అట్టి పోస్ట్ ల నియామకం చేయుటకు లోకల్ నిరుద్యోగ యువతకు ట్రైనింగ్ ఇచ్చినట్లయితే నిరుద్యోగము సమస్యను కొంతవరకు నిర్మూలించగలరని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కే ఎంపిటి జోనల్ మేనేజర్ స్వామి గీసుకొండ తాసిల్దార్ రియాజుద్దీన్, సంగం తాసిల్దార్ రాజ్ కుమార్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కనకం వెంకట్ నటించిన 'పొట్టేలు' సినిమాకు గద్దర్ అవార్డు

**భీమదేవరపల్లి, మే 29 (జనం సాక్షి) :** సామాజిక స్పృహ కలిగిన చిత్రంగా ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'పొట్టేలు' మూవీకి ప్రతిష్ఠాత్మక గద్దర్ అవార్డు లభించడంతో భీమదేవరపల్లి మండల ప్రజల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నటించిన స్థానిక యువకుడు కనకం వెంకట్ ప్రతిభకు ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ సినిమాలో ప్రజల సమస్యలను ఆవిష్కరించిన విధానం, తట్టేలా చూపిన కథన శైలి విమర్శకుల ప్రశంసలు అందుకోగా, గద్దర్ అవార్డు విజేతగా ఎంపిక కావడం గర్వకారణంగా మారింది. వెంకట్ వంటి సామాన్య గ్రామ యువకుడు ఈ స్థాయికి చేరుకోవడమే గాక ఆయన నటించిన సినిమాకు అవార్డు రావడం మండల ప్రజలకు గర్వకారణమైందని వారు తెలిపారు. వెంకట్ టీమ్‌ను అభినందిస్తూ మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కనకం వెంకట్ మాట్లాడుతూ, "ఇది నా జీవితంలో ఒక మైలురాయి. నా గ్రామం పేరు వెండితెర మీద మాత్రమే కాదు, అవార్డు వేదికల మీద కూడా వినిపించాలన్నది నా కల. ఈ సినిమా అవార్డు నన్ను, నా టీమ్‌ను మరింత బాధ్యతగా ముందుకు నడిపిస్తుంది. నన్ను చిన్ననాటి నుంచే ప్రోత్సహించిన మా కుటుంబానికి, గ్రామస్థులకు, గురువులకు ఈ గౌరవాన్ని అర్పిస్తున్నాను' అని హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, మే29 (జనం సాక్షి) :** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. వేడుకలకు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేదికను పూల తో అలంకరించి,ప్రోటోకాల్ నిబంధనల మేరకు సీటింగ్ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.విద్యార్థుల ద్వారా తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలు,దేశభక్తి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.వేడుకలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంటులు, షామియానాలు, తాగునీరు,అల్పాహారం, పండ్ల సరఫరా నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు.పరిసరాలలో శుభ్రత పాటించాలని, పోలీస్, అగ్నిమాపక శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.వైద్యశాఖ అత్యవసర మందులతో సహా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు.రాజీవ్ యువ వికాసం సహా వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,డిఆర్ఓ రత్న కళ్యాణి,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలు అందుకున్న సీఓఈ విద్యార్థులు

- ఉన్నత విద్య విభాగంలో తీగల ఆశ్రిత్, దుర్గం చరణ్ తేజ




**బెల్లంపల్లి, మే 29 (జనంసాక్షి) :** గత సంవత్సరం నీట్, జేఈఈ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ద్వారా దేశంలో ఆత్యంత ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయలు, మెడికల్ కళాశాలలో సీట్లు సాధించి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఖ్యాతిని దేశవ్యాప్తం చేసిన విద్యార్థులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రతిభ పురస్కారాలను హైదరాబాద్ లోని బాబు జగ్జీవన్ రావు భవన్ లో ప్రదానం చేసి అభినందించారు. మంచిర్యాల జిల్లా నుండి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (సిఓఈ) బెల్లంపల్లి విద్యార్థులు ఎంపికయ్యి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలను అందుకున్నారు. జెఈఈ ద్వారా తీగల ఆశ్రిత్ సెంట్రల్ యూనివర్సిటీ హర్యానాలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సిట్ సాధించగా, దుర్గం చరణ్ తేజ మద్రాస్ ఐఐటీలో బయోలజికల్ సైన్స్ విభాగంలో సిట్ సాధించి విద్యనభ్యసిస్తున్నారు. స్పోర్ట్స్ విభాగంలో పొట్ట లక్ష్మి నరసింహ అండర్ 14 బిక్సింగ్ లో రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్, సాధించి అర్హత సాధించారు. గురుకుల ప్రతిభ పురస్కారాలను అందుకున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్ రెడ్డి, కాళేశ్వరం జోనల్ అధికారి అరుణ కుమారి అభినందించారు.

## కాసిపేట గురుకులానికి సీఎం ఐదు లక్షలు గిఫ్ట్

- టెన్త్, ఇంటర్‌లో 100% ఫలితాలు



**బెల్లంపల్లి, మే 29, (జనంసాక్షి) :** బెల్లంపల్లిలోని కాసిపేట గురుకులంలో 100% టెన్త్, ఇంటర్లో ఫలితాలు సాధించడంతో కాసిపేట గురుకులానికి సీఎం రేవంత్ రెడ్డి ఐదు లక్షలు గిఫ్ట్ అందించారు. కాసిపేట గురుకులానికి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఐదు లక్షల చెక్కును పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల వెలువడిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయుల బోధనా మార్గదర్శకంలో విద్యార్థులు అహర్నిశలు కష్టపడి చదివి గురుకుల పాఠశాల కళాశాలకు పేరు తెచ్చారన్నారు. విద్యార్థులు సాధించిన ప్రతిభా ఘనతకు సీఎం రేవంత్ రెడ్డి ఐదు లక్షల పారితోషికం, ప్రశంస పత్రం అందజేయడం సాధించిన ఫలితాలకు తగిన గుర్తింపు లభించింది అన్నారు. హైదరాబాద్ బంజారా హిల్స్ లో బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో సీఎం చేతుల మీదుగా రూ. ఐదు లక్షలు అందుకున్న 239 సాంఘిక సంక్షేమ గురుకులాలలో వంద శాతం సాధించిన 14 గురుకులాల్లో బెల్లంపల్లి కాసిపేట గురుకులం ఉండడం హర్షనీయమన్నారు. పదవ తరగతి ఫలితాలలో స్కూల్ టాపర్ గా సిహెచ్ చైతన్య 549, 500 పైగా మార్కులు 22 మంది విద్యార్థులు సాధించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం, కామన్ డైట్ మెనూ అమలు చేయడం వలన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండి చదువు పట్ల దృష్టి సారించడం జరుగుతుందనీ ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషిచేసిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ స్ఫూర్తితో భవిష్యత్తులో ఇంతకన్నా మంచి ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నూరు శాతం ఫలితాలను సాధించిన ప్రిన్సిపాల్ లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్, సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిని, కాళేశ్వరం జోన్ -1 అధికారిని అరుణ కుమారి ప్రత్యేకంగా అభినందించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు:డిఏఓ



**నెరడిగొండ మే29(జనంసాక్షి):** నకిలీ విత్తనాలను విక్రయించిన సీడ్ ఫర్టిలైజర్ దుకాణ యజమానులపై కఠిన చర్యలు తప్పవని డిఏఓ శ్రీదర్ స్వామి అన్నారు.గురువారం రోజున జిల్లా వ్యవసాయ అధికారి శ్రీదర్ స్వామి తోపాటు మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి కలిసి మండల కేంద్రంలోని ఆయా సీడ్ ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సీడ్ ఫర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వం ద్వారా నిర్ధారించబడిన ప్రముఖ కంపెనీల పత్తి విత్తనాలను విక్రయించాలని,నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని సూచించారు.

## విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి


- ప్రతి కొనుగోలుకు సంబంధించిన బిల్లు తీసుకోవాలి
- జిల్లా ఇన్‌చార్జీ వ్యవసాయ అధికారి జాలిగపు అవినాష్ వర్మ



**ములుగు ప్రతినిధి, మే 29(జనంసాక్షి) :** జిల్లాలోని రైతులు విత్తనాలు ఎరువులు, పురుగుమందులు కొనే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఇన్చార్జీ వ్యవసాయ అధికారి జాలిగపు అవినాష్ వర్మ తెలిపారు. రైతుల సంక్షేమం కోసం వారికి అవగాహన కల్పించేందుకు గాను, ఏటూరునాగారం డివిజన్ ఏడిఏ గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన తన సొంత ఖర్చులతో సుమారు 5 కరపత్రాలు ముద్రించి, జిల్లాలోని రైతులను కలుస్తూ వారికి కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాలలోకి వచ్చే నకిలీ విత్తనాలను కొనుగోలు చేయవద్దని, బిజి 3 పేరుతో చలామణి అవుతున్న హెచ్టి పత్తి విత్తనాలను జిఈఏసి అనుమతి లేనందున విత్తనాలను కొనడం అమ్మడం సాగు చేయడం నేరమని తెలిపారు. కొనుగోలు చేసిన దుకాణం నుంచి నిర్ణీత ఫార్మేట్ లో ఉన్న రసీదును తీసుకోవాలని, రసీదు పై విత్తన కంపెనీ పేరు, విత్తనం రకం పేరు, లాట్ నెంబర్, గడువు తేదీ మరియు డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. లూజు గా ఉన్న సంచులు పగిలిన ప్యాకెట్ల డబ్బాల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదని గడువు దాటిన విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దని అన్నారు. విత్తన ప్యాకెట్ను బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవడం ద్వారా జన్యు స్వచ్ఛత లోపాల వల్ల లేదా మొలక శాతం తక్కువైనప్పుడు తగిన పరిహారం కోరే హక్కు రైతుకు ఉంటుందని అవినాష్ వర్మ పేర్కొన్నారు.

## వరి ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో 262 కోట్ల రూపాయల జమ

- జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**మంచిర్యాల ప్రతి నిధి, మే 29 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 24 వేల 705 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 73 వేల 814 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 262 కోట్ల 10 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 205 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 2 వేల 500 నుండి 5 వేల టన్నుల ధాన్యం పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

# ధాన్యం నిల్వల దిగుమతి విషయంలో నిర్లక్ష్యం తగదు

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని, లేదంటే కుదరదని అధికారులకు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలో గల అర్సపల్లి, ఖానాపూర్, సారంగాపూర్ ప్రాంతాలలోని రైస్ మిల్లులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి అర్సపలిలోని రుదా రైస్ మిల్లును, ఖానాపూర్ లోని ఎల్.జీ ఆగ్రో ఇండస్ట్రీస్, వీరభద్ర రైస్ మిల్లు, సారంగాపూర్ లోని అనూ ఫుడ్స్ రైస్ మిల్లులను సందర్శించారు. ఆయా మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని దిగుమతి చేసుకున్నారా, ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. ముందస్తుగానే రుతు పవనాల ప్రవేశంతో వర్షాలు కురుస్తున్నందున ధాన్యాన్ని వెంటదివెంట దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే వర్షాల వల్ల తడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఇప్పటికే 90 శాతానికి పైగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తయ్యిందని, చివరి దశలో మిగిలిన ధాన్యం నిల్వలను కూడా సకాలంలో దిగుమతి చేసుకుని సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ చేయాలని హితవు పలికారు. మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం




**చింతపల్లి, మే 29 (జనంసాక్షి) :** కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని దేవరకొండ ఎమ్మెల్యే నేనవత్ బాలు నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాయి సుమంగళి గార్డెన్స్ లో మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల ముఖా – ముఖి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా ఎమ్మెల్యే బాలు నాయక్ హాజరై మాట్లాడుతూ మండలాల్లోని రోడ్లు,మౌలిక సదుపాయాలు, విద్య,వైద్యం,వ్యవసాయం మెరుగుపరచడమే తన ప్రాథమిక లక్ష్యమని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నియోజకవర్గంలో మనం చేపట్టిన అభివృద్ధి పనుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని అన్నారు. మండల అభివృద్ధి, గ్రామ పంచాయతీల అభివృద్ధి ఇప్పటికే హామీ ఇచ్చిన కార్యక్రమాలు దాదాపుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే ఇంకా మిగిలి ఉన్న గ్రామాభివృద్ధి కార్యక్రమాలు తన దృష్టికి తీసుకురావాలని, ఆ పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. దేవరకొండ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా, పార్టీలకు అతీతంగా పని చేసి మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రతి కార్యకర్తకు, ప్రజలందరికీ అందుబాటులో ఉండి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తానని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు..ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ హరి నాయక్, మాజీ వైస్ ఎంపీపీ యాది గౌడ్, ముచ్చర్ల యాదగిరి, అంగి రేకుల గోవర్ధన్, వెంకట నర్సింహా రెడ్డి, గుండ్లపల్లి నర్సి రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, మాస భాస్కర్, కేశరావు శ్రీను, జంగిడి నర్సింహా, నల్ల సుధాకర్ రెడ్డి, మల్లేష్, శేఖర్,మాజీ ఎంపీపీ రవి, తాజా, మాజీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, మే 29 (జనంసాక్షి) :** ప్రజల రక్షణ, భద్రత కోసమే జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ నరసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రోడ్డు ప్రయాణ సమయంలో వాహనదారులు రహదారి భద్రత జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ముందస్తు జాగ్రత్తల వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా గమ్యాన్ని చేరుతారని అన్నారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించి వాహనాల నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తూ జరిమానా విధిస్తున్నామని చెప్పారు.ఈ జరిమానా అనేది మార్పు కోసమేనని తెలిపారు.ఒకరి తప్పు, నిర్లక్ష్యం వల్ల మరొకరు రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నారని అన్నారు.ప్రతి ఒక్కరూ రోడ్లపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ఐదు నెలల కాలంలో నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న 125000 వాహనాలపై జరిమానా విధించామని, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 6500 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.వాహనాలు వేగంగా,మద్యం మత్తులో వాహనాలు నడపవద్దన్నారు.ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వాహనాలు నిలుపవద్దని సూచించారు.తప్పుడు మార్గంలో వాహనాలు నడపవద్దని,వాహన పరిమితికి మించి రవాణా చేయవద్దన్నారు. ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు హెల్మెట్ ధరించాలన్నారు.పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.మూల మలుపుల వద్ద ఇండిగేటర్ ఉపయోగించాలని పేర్కొన్నారు.వాహనం మంచి కండిషన్ లో ఉండేలా చూసుకోవాలన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్‌లు ఉపయోగించవద్దన్నారు. ఎక్కువ సేపు డ్రైవింగ్ చేయవద్దని, ఎక్కువ దూరం ప్రయాణిస్తే మార్గం మధ్యలో విశ్రాంతి తీసుకోవాలని, నిద్రావస్థలో డ్రైవింగ్ చేయవద్దని కోరారు.

## ప్రజా సేవకుడు మాజీ మంత్రి హరీష్‌రావు

- జూన్ 3న మాజీ మంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి
- పాటల సీడిని ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు




**సంగారెడ్డి టౌన్, మే 29 (జనం సాక్షి) :** ప్రజల కోసం పనిచేసే నాయకులు మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని జూన్ 3న మాజీమంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకల సందర్భంగా ప్రత్యేక పాటుతో సిడిని అవిష్కరించిన ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్ మాణిక్ రావు గురువారం సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పా టల సీడిన ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రజల కోసం నిరంత పనిచేసే నాయకుడు మాజీ మంత్రి హరీష్ రావు అని ఆయన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ మంజు శ్రీ జైపల్ రెడ్డి, పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి, శివరాజ్ పాటిల్, గోపాల్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** బాసర రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్?ను మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన నేపథ్యంలో జిల్లాకు చెందిన శాసనసభ్యులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలిపారు.ట్రిబుల్ ఐటి ఏర్పాటు చేయడంతో విద్యా పరంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులకు ట్రిబుల్ ఐటి సంస్థ వరమన్నారు. శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి ,జి.మధుసూదన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జనంపల్లి అనిరుధ్ రెడ్డి , చిట్టెం పర్ణికా రెడ్డి , తూడి మేఘా రెడ్డి ,వీర్లపల్లి శంకర్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిశారు.

# కృష్ణా నది తీరా గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు




**గద్వాల నడిగడ్డ, మే 29 (జనం సాక్షి) :** జూరాల ప్రాజెక్టునుండీ 10 గేట్లను ఎత్తి 82 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేసినందున కృష్ణ నది తీరా గ్రామాలు అయిన బిరెల్లి, తెలుగొనిపల్లి, ముల్కల పల్లి,బస్సాపురం, బీచుపల్లి తో పాటు ఇతర నది తీరా గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు తెలిపారు. ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర కర్ణాటక లో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతున్నదనీ,ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో జూరాల ప్రాజెక్టులో 10 గేట్లను ఎత్తి 82 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు శ్రీశైలం ప్రాజెక్టుకు వదలడం జరుగుతుందని, నది తీరా గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపలు పట్టే వారు, పశువులు, గొర్రెల కాపరులు నదిలోకి వెళ్లవద్దని జిల్లా ఎస్పీ తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుండి ఎక్కువ మొత్తంలో నీరు విడుదలవుతున్న దృష్ట్యా సంబంధిత పోలీస్ అధికారులను తగిన ఏర్పాట్లతో అప్రమత్తంగా ఉండటం తో పాటు గ్రామాలలో టామ్ టామ్ వేయించి ప్రజలకు తెలియజేయాలని ఆదేశించడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం



**తలకొండపల్లి, మే 29 (జనంసాక్షి) :** క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని కాంగ్రెస్ నాయకులు శతాబ్ది ఫౌండేషన్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.తలకొండపల్లి మండల ప్రీమియర్ లీగ్ 2025 క్రికెట్ పోటీలను గతం వారం రోజులుగా నిర్వహిస్తున్నారు.గురువారం క్రికెట్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శతాబ్ది ఫౌండేషన్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి హాజరై మొదటి బహుమతి రూ,30 వేలను గెలుపొందిన విన్నర్ టీమ్ క్రికెట్ క్రీడాకారులకు అందజేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల పోటీల్లో గెలుపోటములు సహజమని,గెలుపొందిన వారు గర్వంగా,ఓడినవారు నిరాశతో భావించరాదని,ఓటమి నుంచి మంచి పాఠాలు నేర్చుకుని గెలుపు ద్వారా ఆదర్శవంతమైన జీవితం వైపు అడగులు వేయాలన్నారు.క్రీడలలో మంచి ప్రావీణ్యం పొందిన వారికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.యువత సన్మార్గంలో నడిచి జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పడకల్ గ్రామ కమిటీ అధ్యక్షులు జిల్లెల్ల శ్రీశైలం యాదవ్,శానమోని పాండు,పద్మ అనిల్,క్రీడాకారులు పాల్గొన్నారు.

# పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



**సూర్యాపేట ప్రతినిధి, మే 29 (జనంసాక్షి) :** పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు జూన్ 3 నుండి 13 వరకు ప్రతిరోజు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల సూర్యాపేట నందు 220 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోదాడ నందు 220 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.తహసీల్దార్లు పరీక్షలు జరిగే ప్రాంతాలలో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 విధించాలని, పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు.పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పులు దొరలకుండా నిర్వహించాలని పేర్కొన్నారు.మాల్ ప్రాక్టీస్ లాంటి సంఘటనలకి అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ పాత్ర అమోఘం

- ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండవ విడతలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు
- నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్ రెడ్డి
- టీజేఎఫ్ సిల్వర్ జూబ్లీ పోస్టర్ ఆవిష్కరణ



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మే 29 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం పాత్ర అమోఘమని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేనాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్లా రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం సిల్వర్ జూబ్లీ ఉత్సవాల గోడపత్రికను క్యాంప్ కార్యాలయంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమించడమే కాకుండా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర అవశ్యకతను చాటిన యూనియన్‌గా తెలంగాణ జర్నలిస్టు ఫోరం చరిత్రలో నిలుస్తుందని అన్నారు. అర్హులైన జర్నలిస్టు లు అందరికీ రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల పథకంలో సొంత ఇంటి కలను నెరవేరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. టియుడబ్ల్యూజే (హెచ్ 143) రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టు ఫోరం అల్లం నారాయణ సారిధ్యంలో తెలంగాణ ఉద్యమంలో చేపట్టిన కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రం సాధించేవరకు టీజేఎఫ్ సాగించిన పోరాట అంశాలు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఆవిర్భావం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్ 143) రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, సంఘం జాతీయ నాయకులు జెమిని సురేష్, హౌదే కార్ ఉమాశంకర్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, టీయూడబ్ల్యూజే (హెచ్143) జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్, సీనియర్, ఫోటో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కపిలవాయి రాజు, నాయకులు గోరటి శ్రీరాములు, షేక్ ఫరీద్ అహ్మద్, ఆవుల భాస్కర్ బాబు, సత్యం,బాలస్వామి, అహ్మదుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలి


- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**మర్రిగూడ, మే 29 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగానే ఇల్లు నిర్మించుకోవాలి నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు,గురువారం మర్రిగూడ మండలం, కొట్టాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు.కొట్టాల గ్రామానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 55 ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 18 ఇండ్లకు సంబంధించి బేస్మెంట్లు పూర్తయ్యాయి. ఇందులో 10 మందికి బేస్మెంట్‌ల బిల్లులు కూడా చెల్లింపులు చేసినట్లు గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్ జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారు దివ్యాంగుడు మేదరి రాములతో మాట్లాడారు. 10 సంవత్సరాల నుండి తాను గుడిసెలో ఉన్నానని ,ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని, ఇందిరమ్మ ఇల్లు రావడం పట్ల తనకు సంతోషంగా ఉందని తెలిపారూ.లబ్ధిదారులు ఆర్భాటాలకు వెళ్లి నిర్దేశించిన కొలతల కంటే ఎక్కువగా ఇంటి నిర్మాణం చేపట్టినట్లయితే నిర్మాణ వ్యయం పెరిగిపోతుందని, అందువల్ల నిర్దేశించిన విధంగానే ఇండ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు .అనంతరం జిల్లా కలెక్టర్ మర్రిగూడా మండల కేంద్రంలోని పాఠశాలలో భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు .భవిత కేంద్రంలో చేపట్టిన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు .రైలింగ్, ర్యాంపు, టాయిలెట్స్, ఆక్టివిటీ రూమ్ అన్నింటిని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని, ముఖ్యంగా టాయిలెట్స్, ర్యాంపు, రైలింగ్ పకడ్బందీగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడి రాజకుమార్, ఇన్చార్జ్ ఆర్డిఓ రమణారెడ్డి , మర్రిగూడ తాసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీడీవో మునయ్య, డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖర్, ఎంపీఓ రవికుమార్, మాజీ జెడ్పిటిసి మేతరి యాదయ్య,కొట్టాల గ్రామపంచాయతీ కార్యదర్శి సయ్యద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

## జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

- 2,85,446.960 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటి వరకు కొనుగోలు
- రూ. 579.96 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేగంగా చెల్లింపు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** రబి సీజన్ కు ధాన్యం సేకరణ రికార్డు స్థాయిలో కొనుగోలు జరుగుతుందని గత సీజన్‌లో ఈ రోజుతో పోలిస్తే ఈ రబీ సీజన్లో ఈ రోజు వరకు 25,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసి అతివేగంగా రైతుల ఎకౌంట్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం హవేలీఘన్పూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తాసిల్దార్ సింధు రేణుక తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్ వడ్ల సేకరణ కోసం మొత్తం 496 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, గతంలో కంటే కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో రైతులకు వేగంగా చెల్లింపులు జరిగాయనీ, తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు తుది దశలో ఉన్నాయని మరో వారం రోజుల్లో జిల్లాలో అన్నీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించటం జరుగుతుందని అన్నారు. బూర్గుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుధి దశలో ఉన్నందున త్వరితగతిన కేంద్రంలో ఉన్నధాన్యాన్నికొనుగోలు పూర్తి చేసి మిల్లుకు ధాన్యం తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రబీ 2023-24 సీజన్లో ఈరోజు వరకు 2,60,381.440 మెట్రక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 448.18 కోట్లు చెల్లింపులు జరిగాయని 61,108 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. 2024 -2025 సంవత్సరం రబీ సీజన్లో 29-5-2025 వ తేదీ నాటికి జిల్లాలో2,85,446,960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 579.96. కోట్ల రూపాయలు రైతులకు చెల్లింపులు జరిగాయన్నారు. 68,588 మంది రైతులకు లబ్ధి చేకూరింది అన్నారు. గత సీజన్ తో పోలిస్తే ఈ రబీ సీజన్లో25,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామని తెలిపారు. చివరి గింజ వరకు దాన్యం సేకరిస్తామని స్పష్టం చేశారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. తడిసిన ధాన్యం సైతం సేకరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హవేలీఘన్పూర్ తాసిల్దార్ సింధు రేణుక సంబంధిత కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.




# హైస్పీడ్‌లో జీడీపీ జంప్

● భారత్ జీడీపీ వృద్ధి ఇలా..

(జనంసాక్షి):భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి.. ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అక మన ముందు ఉన్న లక్ష్యం జర్మనీని అధిగమించడమే. ఈ తరుణంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంటుందనే విషయాన్ని'2024-2025 వార్షిక నివేదిక'లో వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతే కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని.. తద్వారా స్థిరమైన వృద్ధి సాధ్యమవుతుందని నివేదికలో వెల్లడించింది.మార్కెట్ అస్థిరతలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య విచ్ఛిన్నం, సరఫరా గొలుసుల అంతరాయాలు, వాతావరణ ప్రేరిత అనిశ్చితులు మొదలైనవన్నీ ద్రవ్యోల్బణంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. అయితే ఆర్థిక ఏకీకరణ మార్గంలో ప్రభుత్వ నిరంతర మూలధనవ్యయంపై దృష్టి పెట్టడం, వినియోగదారులు %ు% వ్యాపార ఆశావాదాన్ని బలోపేతం చేయడం, బలమైన స్థూల ఆర్థిక ప్రాథమిక అంశాలన్నీ సజావుగా ముందుకు సాగితే.. 2025-26లో భారత ఆర్థిక వ్యవస్థ దృక్పథం ఆశాజనకంగానే ఉండని స్పష్టం చేసింది.2025-26లో వ్యవసాయ రంగానికి అవకాశాలు అనుకూలంగా కనిపిస్తున్నాయి. దీనికి కారణం నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఎక్కువగా ఉండటం మాత్రమే కాకుండా..



ఉత్పాదకతను పెంచే ప్రభుత్వ విధానాలు కూడా అని ఆర్‌బీఐ పేర్కొంది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడానికి వివిధ కొత్త చొరవలను ప్రకటించారని కూడా వెల్లడించింది.టారిఫ్ విధానాలలో మార్పులు ఆర్థిక మార్కెట్లలో అప్పుడప్పుడు అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన నేషనల్ మాన్యుఫ్యాక్చరింగ్ మిషన్.. మేక్ ఇన్ ఇండియా వంటివి తయారీ రంగాన్ని మరింత బలపరుస్తాయి. తద్వారా.. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. భారత్ ఇప్పటికే అనేక దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంటోంది. ఇందులో యూఎస్ఏ మాత్రమే కాకుండా.. ఒమన్, పెరూ, ఈయూ మొదలైన దేశాలు ఉన్నాయి. ఈ వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక వృద్ధికి దోహదపడతాయి. 2024-25లో దేశంలో అనేక ఆర్థిక ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ.. ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. డిజిటల్ చెల్లింపులు కూడా దేశంలో అధికంగా ఉన్నాయి. మొత్తం మీద భారత్ ఆర్థిక వ్యవస్థలో పురోగతి ఉంటుందని ఆర్‌బీఐ వెల్లడించింది.

## 'కంటెంట్‌ను లాగేస్తున్న గూగుల్.. సీఈఓ ఏమన్నారంటే..

ఆన్‌లైన్ సెర్చ్ ఇంజిన్‌లో దూసుకుపోతున్న గూగుల్ ఉపయోగిస్తున్న ఏఐ ఫీచర్లకు సంబంధించి కొన్ని సంస్థల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. కొన్ని కంటెంట్ పబ్లిషర్ సంస్థలు నేరుగా యూజర్లు తమ వెబ్‌సైట్‌లోకి రాకుండా గూగుల్ అనైతికంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తుందని వాదిస్తున్నాయి. దీనిపై కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు.ఏఐ జనరేటెడ్ సమాధానాలను అందించే గూగుల్ ఏఐ ఫీచర్ల ద్వారా వెబ్‌సైట్ ట్రాఫిక్ తగ్గుతుందని కొన్ని సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. న్యూస్ మీడియా అలయన్స్ గూగుల్ బలవంతంగా తమ కంటెంట్‌ను తీసుకుంటుందని అని ఇటీవల ఆరోపించింది. అనైతికంగా గూగుల్ తమ కంటెంట్‌ను దొంగిలిస్తుందని వాదిస్తోంది.గూగుల్ పనితీరును సమర్థించిన సుందర్ పిచాయ్.. 'మేము ఇప్పటికీ యూజర్లను వెబ్‌లో సెర్చ్ చేసేందుకు చాలా డబ్బు వెచ్చిస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ మరింత మెరుగ్గా వెబ్‌సైట్లకు ట్రాఫిక్‌ను అందించేందుకు రూపొందించారు. వినియోగదారులు అడిగే కొన్ని సాధారణ ప్రశ్నలకు కృత్రిమ మేధ ద్వారా నేరుగా సమాధానాలు లభించినప్పటికీ, వారికి విస్తృతమైన వనరులుగా వెబ్‌సైట్లు నిలుస్తున్నాయి. అయితే వ్యక్తిగత ప్రచురణకర్తలు తమ వెబ్‌సైట్ ట్రాఫిక్‌లో తేడాను చూసే అవకాశం ఉంటుంది. ట్రాఫిక్ వృద్ధి ధోరణి క్రమంగా పెరుగుతోంది. వెబ్‌సైట్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఏఐ ఓవర్‌వ్యూలను మెరుగుపరిచేందుకు సిద్ధంగా ఉంది' అని తెలిపారు.

## సిక్ లీవ్ పెట్టి కూర్గ్‌లో ఎంజాయ్...

● ఎలా దొరికాడో చూడండి..

(జనంసాక్షి):సాధారణంగా వీకెండ్ ఎప్పడొస్తుందా అని ఉద్యోగులు ఎదురు చూస్తుంటారు. ఆ వీకెండ్‌కు ముందో.. వెనకో మరో సెలవు తోడైతే ఎక్కడికైనా ట్రిప్ వేసి ఎంజాయ్ చేయాలనుకుంటారు.కానీ కొందరైతే ఇందుకోసం సిక్ లీవ్‌లను దుర్వినియోగం చేస్తున్నారు. ఇలాగే బెంగళూరుకు చెందిన ఓ ఉద్యోగి కూడా ఎక్కువ రోజులు వారాంతాన్ని ఆస్వాదించేందుకు సిక్ లీవ్ పేరుతో నాటకమాడాడు. కానీ దొరికిపోయాడు. అతను ఎలా దొరికిపోయాడు.. ఆ తర్వాత ఏమైంది. తన వీకెండ్ ట్రిప్ గురించి ఓ రెడిట్ యూజర్ ఇటీవల ఒక పోస్ట్ పెట్టాడు. ఒంట్లో బాగోలేదని చెప్పి శుక్రవారం సిక్ లీవ్ పెట్టి స్నేహితులతో కలిసి కూర్గ్ వెళ్లాడు. అక్కడ వీకెండ్ అంతా ఎంజాయ్ చేసి సోమవారం ఏమీ తెలియనట్టుగా తిరిగి విధుల్లో చేరాడు. కానీ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయిన ఓ వీడియో అతన్ని పట్టించింది. 'గత నెలలో శుక్రవారం సెలవు పెట్టి కూర్గ్ వెళ్లాను. కడుపులో ఇన్‌ఫెక్షన్ (స్టమక్ ఫ్లూ) అని మా మేనేజర్‌కు చెప్పాను. అక్కడ హెూమ్ స్టేలో ఓ వ్యక్తి డ్యాన్స్ చేసిన వీడియో రీల్ వైరల్ అయింది. అందులో బ్యాక్‌గ్రౌండ్‌లో నేనున్నాను. అలా దొరికిపోయాను' అంటూ చెప్పుకొచ్చాడు. 'సోమవారం మా స్కిప్ లెవల్ మేనేజర్ ఓ రీల్ లింక్ పంపించారు. 'ఇప్పుడు నీ కడుపులో ఇన్‌ఫెక్షన్ బాగైందనుకుంటాను' అని దానికి జోడించారు. సిక్ లీవ్ ఫేక్ చేసి అలా దొరికిపోయాను. దేవుడి దయ వల్ల ఉద్యోగం పోలేదు. కానీ అప్పటి నుండి ఒక్క వర్క్ ఫ్రమ్ హెూమ్ రిక్వెస్ట్ కూడా అప్రూవ్ చేయలేదు. ఇప్పుడు ఆయన నన్ను నమ్మడం లేదు' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. వైరల్‌గా మారిన ఈ రెడిట్ పోస్ట్‌కు యూజర్లు విశేషంగా ప్రతిస్పందించారు. 'భలే నవ్వు తెప్పిస్తోంది'.. అని ఒకరు కామెంట్ చేయగా 'వెంటనే ఇన్‌స్టాగ్రామ్ డిలీట్ చేసేయాలి' అంటూ మరొకరు వ్యాఖ్యానించారు.

## టాటా గ్రూప్‌లో కీలక పరిణామం

చైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

(జనంసాక్షి):దిగ్గజ వ్యాపార సంస్థ టాటా గ్రూప్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా సన్స్ చైర్మన్ 'ఎన్ చంద్రశేఖరన్' టాటా కెమికల్స్ డైరెక్టర్ అండ్ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు.బుధవారం ఈ విషయాన్ని ఎక్స్ఛేంజ్ ఫైలింగ్స్‌లో కంపెనీ వెల్లడించింది. "నా ప్రస్తుత.. భవిష్యత్తు నిబద్ధతలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, నేను బోర్డు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. టాటా కెమికల్స్ బోర్డుకు అధ్యక్షత వహించడం గౌరవంగా ఉంది. అంతే కాకుండా నా పదవీకాలంలో నాకు మద్దతు.. సహకారాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అంటూ.. టాటా సన్స్ చైర్మన్ మే 28న కంపెనీ డైరెక్టర్ల బోర్డును ఉద్దేశించి ప్రసంగించారు.ఎన్ చంద్రశేఖరన్ పదవి నుంచి వైదొలిగిన తరువాత.. 2025 మే 30 నుంచి 'ఎస్. పద్మనాభన్' కొత్త చైర్మన్ బాధ్యతలను తీసుకుంటున్నట్లు కంపెనీ వెల్లడించింది. అయితే.. నామినేషన్, వేతన కమిటీ సిఫార్సుల ఆధారంగా, మే 28, 2025 నుంచి అమలులోకి వచ్చేలా 'మోదన్ సాహూను అదనపు డైరెక్టర్ (నాన్-ఎగ్జిక్యూటివ్, నాన్-ఇండిపెండెంట్)'గా నియమించడానికి బోర్డు ఆమోదం తెలిపింది.

## ఐక్యూ నియో 10 స్మార్ట్‌ఫోన్



న్యూఢిల్లీ(జనంసాక్షి): స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తాజాగా నియో 10 ఫోన్‌ను ఆవిష్కరించింది. ఆఫర్లు, డిస్కౌంట్లు పోగా రూ. 29,999 నుంచి ధర ప్రారం భమ వుతుంది.భారత్‌లో తొలిసారిగా స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 ప్రాసెసర్‌తో దీన్ని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. శక్తివంతమైన 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 6.78 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 50 ఎంపీ సోనీ ఓఐఎస్ కెమెరా, 3 ఏళ్ల పాటు ఆండ్రాయిడ్.. 4 ఏళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్, మొదలైన ప్రత్యేకతలు ఈ ఫోన్‌లో ఉంటా యి. అమెజాన్, ఐక్యూ ఈ-స్టోర్‌లో జూన్ 3 మధ్యాహ్నం నుంచి ఫోన్ విక్రయాలు ప్రారంభమవుతాయి. ముందుగా బుక్ చేసుకున్న వారికి ఐక్యూ టీడబ్ల్యూఎస్ 1ఈ కాంప్లిమెంటరీగా లభిస్తుంది.

## మైక్రోసాఫ్ట్, యోటా జట్టు.. ఏఐ వినియోగానికి మరింత జోరు

న్యూఢిల్లీ: భారత్‌లో కృత్రిమ మేధ (ఏఐ) మరింతగా వినియోగంలోకి తెచ్చే దిశగా మైక్రోసాఫ్ట్, యోటా డేటా సర్వీసెస్ చేతులు కలిపాయి. ఈ ఒప్పందం ప్రకారం యోటా ఏఐ క్లౌడ్ ప్లాట్‌ఫాం అయిన శక్తి క్లౌడ్‌లో మైక్రోసాఫ్ట్ తమ అజూర్ ఏఐ సర్వీసులను అందుబాటులోకి తెస్తుంది.దీంతో డెవలపర్లు, స్టార్టప్‌లు, కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇండియాఏఐ మిషన్‌లో భాగమైన సంస్థలకు అధునాతన సేవలు అందుబాటులోకి వస్తాయి. దేశీయంగా కృత్రిమ మేధ సామర్థ్యాలను పెంపొందించడం, నవకల్పనలను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలను పటిష్టపర్చడం ద్వారా ఇండియాఏఐ మిషన్ లక్ష్యాల సాధనకు కూడా మైక్రోసాఫ్ట్-యోటా భాగస్వామ్యం తోడ్పడనుంది.ఇండియాఏఐ మిషన్ అనేది దేశంలోని కృత్రిమ మేధ వ్యవస్థను బలోపేతం చేయడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ చొరవ. ఏఐ ఇన్నోవేషన్‌ ను ప్రోత్సహించడం, స్వదేశీ ఏఐ మోడళ్లను అభివృద్ధి చేయడం, పటిష్టమైన ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ను సృష్టించడం ఈ మిషన్ లక్ష్యం.

## ఇళ్ల కొనుగోళ్లపై ఆసక్తి ఎక్కడ ఎక్కువంటే..

(జనంసాక్షి):దేశవ్యాప్తంగా ఆస్తుల కొనుగోళ్లపై ఆసక్తి పెరుగుతోందని నైట్ ఫ్రాంక్ తెలిపింది. ఇటీవల సంస్థ నిర్వహించిన 'బియాండ్ బ్రిక్స్-ది పల్స్ ఆఫ్ హెూమ్ బైయింగ్' సర్వేలో భాగంగా దేశంలో ఇళ్ల కొనుగోళ్లపై వివిధ్న వర్గాల ప్రజల ఆసక్తులు ఎలా ఉన్నాయో తెలియజేసింది. చెన్నై (86 శాతం), ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (85 శాతం), హైదరాబాద్ (83 శాతం) ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు సర్వేలో పేర్కొంది. సర్వేలోని వివరాల ప్రకారం ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని గృహ కొనుగోలుదారులు నిర్మాణంలో ఉన్న ఆస్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. బెంగళూరులో ఆ ఆస్తుల పెట్టుబడులపై దృష్టి సారిస్తున్నారు. ఇళ్ల కొనుగోళ్లకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే అంశాల్లో ఆరోగ్య సదుపాయాలు, విద్యా సౌకర్యాల అందుబాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ అంశంలో హైదరాబాద్ (81 శాతం), కోల్‌కతా (80 శాతం) దీర్ఘకాలిక భద్రతా కారణాల దృష్ట్యా బలమైన కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు.దేశంలోని టాప్ 8 టైర్-1 నగరాల్లోని 1,629 మంది పట్టణ గృహ కొనుగోలుదారుల నుంచి వివరాలు సేకరించి ఈమేరకు నివేదిక రూపొందించారు. ఈ సర్వేలో మిలీనియల్స్, అధిక ఆదాయ వ్యక్తులు ఆస్తుల చురుకైన కొనుగోలుదారులుగా ఉన్నారని తేలింది. నైట్ ఫ్రాంక్ ఇండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజాల్ మాట్లాడుతూ.. కొవిడ్19 అనంతర కాలంలో నివాస డిమాండ్ గణనీయంగా పెరిగిందని అన్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపు, స్టాంప్ డ్యూటీ రిబేట్లు వంటివి కొనుగోలుదారులకు కలిసి వస్తున్నాయని తెలిపారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.80 | ₹ 4.82 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 90,750 | ₹ 99,000 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,11,000

# ట్రంప్‌కు మస్క్‌కు చెడిందా?

● ఆ ఒప్పందం వద్దని ట్రంప్‌పై ఒత్తిడి..
● మాట వినలేదనే మస్క్ దూరమా..?

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వంలోని డోజ్ శాఖ బాధ్యతల నుంచి అపర కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వైదొలిగారు. ఈ సంచలన నిర్ణయం వెనక కారణమేంటో చెప్పలేదు గానీ..ప్రత్యేక గవర్నమెంట్ ఉద్యోగిగా తన షెడ్యూల్ ముగిసిందని పేర్కొన్నారు. ట్రంప్-మస్క్ బంధం చెడిందంటూ వార్తలు వస్తోన్నవేళ ఈ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఈక్రమంలోనే తాజాగా ఓ కథనం వెలుగులోకి వచ్చింది. కృత్రిమ మేధ సంస్థ ఓపెన్ఏఐ-యూఏఈ మధ్య ఒప్పందం కుదర్చవద్దని మస్క్ అమెరికా అధ్యక్షుడిపై ఒత్తిడి తెచ్చినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం సారాంశం. దీన్ని వైట్‌హౌస్ పట్టించుకోలేదని సమాచారం. ఓపెన్ ఏఐ సాఫ్ట్ బ్యాంక్, ఒరాకిల్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ఏడాది ఆరంభంలో 'స్టార్‌గేట్' అనే ప్రాజెక్టును ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే అబుదాబీలో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటుచేసుకునేందుకు 'స్టార్‌గేట్ యూఏఈ' అని పెంటగాన్ ప్రకటించారు. ఇందులో జీ42, ఎమిరాటీ ఏఐ కంపెనీలు భాగస్వామిగా ఉండనున్నాయి. ఇటీవల ట్రంప్ గల్ఫ్ పర్యటన సందర్భంగా ఓపెన్ఏఐ-యూఏఈ మధ్య దీనిపై ఒప్పందం ఖరారైనట్లు సమాచారం. అంతేకాదు.. ట్రంప్ పర్యటనలో ఆయన వెంట ఓపెన్ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ కూడా ఉన్నారు.ఇది నచ్చని మస్క్.. ఒప్పందం కుదుర్చుకోవద్దని ట్రంప్ సర్కారుపై ఒత్తిడి తెచ్చినట్లు వాల్‌స్ట్రీట్ కథనం వెల్లడించింది. ఆ ప్రాజెక్టులో తన 'ఎక్స్ఏఐ'ను కూడా చేర్చాలని ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అంతేగాక, స్వయంగా జీ42 కంపెనీ డైరెక్టర్లకు మస్క్ ఫోన్ చేసి.. 'ఎక్స్ఏఐ లేకుండా.. ట్రంప్ ఎలాంటి డీల్‌ను అంగీకరించరు' అని చెప్పినట్లు సదరు కథనం పేర్కొంది.అయితే, మస్క్ ఒత్తిడిని పట్టించుకోకుండా ట్రంప్ సర్కారు డీల్‌కు సుముఖత వ్యక్తంచేసినట్లు సమాచారం. వైట్‌హౌస్ అధికారులు ఈ ఒప్పందాన్ని పరిశీలించి ప్రణాళిక ప్రకారమే డీల్ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఓ అధికారి మాట్లాడుతూ.. "మస్క్ అందోళనలో నిజం ఉందో, లేదో పక్కనబెడితే.. శామ్ ఆల్ట్‌మన్‌తో ఆయనకు సుదీర్ఘకాలంగా వైరం ఉన్న విషయం అందరికీ తెలిసిందే. దానిపట్లే ఆయన ఈ ఒత్తిడి తెచ్చి ఉంటారనే సంకేతాలు కన్పిస్తున్నాయి" అని అన్నారు.2022 నవంబరులో వచ్చిన ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌జీపీటీ ఆరు నెలల్లోనే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ సంపాదించుకున్న సంగతి తెలిసిందే. అయితే, 2015లో ఓపెన్ ఏఐను శామ్ ఆల్ట్‌మన్ బృందం స్థాపించినప్పుడు మస్క్ అందులో పెట్టుబడులు పెట్టారు. 2018లో ఆ కంపెనీని వీడారు. ఆ తర్వాత 2019లో మైక్రోసాఫ్ట్ ఓపెన్ ఏఐలో 14 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. ఈక్రమంలోనే ఓపెన్ ఏఐ, మైక్రోసాఫ్ట్‌పై మస్క్ గతేడాది దావా వేశారు. కంపెనీ స్థాపించినప్పుడు రాసుకున్న ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నారంటూ అందులో ఆరోపించారు.



## టెలిగ్రామ్‌లో గ్రోక్ఏఐ పాగా

(జనంసాక్షి):కృత్రిమ మేధకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. దాంతో ఆన్‌లైన్ మెసేజింగ్ యాప్‌లు ఏఐను తమ ప్లాట్‌ఫామ్‌ల్లో భాగం చేస్తున్నాయి. అందులో భాగంగా టెలిగ్రామ్ ఎక్స్ఏఐతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది.ఈమేరకు టెలిగ్రామ్ ప్లాట్‌ఫామ్‌లో ఎక్స్ఏఐ గ్రోక్ చాట్‌బాట్‌ను వాడేందుకు ఒప్పందం చేసుకుంది. ఈ డీల్ విలువ 300 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు కొన్ని మీడియా సంస్థలు తెలిపాయి. దాంతోపాటు టెలిగ్రామ్ ద్వారా విక్రయించిన ఎక్స్ఏఐ సబ్‌స్క్రిప్షన్ల నుంచి ఆరు కంపెనీలకు 50 శాతం ఆదాయ భాగస్వామ్యం ఉన్నట్లు పేర్కొన్నాయి.టెలిగ్రామ్‌కు ఉన్న యూజర్ బేస్ గ్రోక్ విస్తరణకు కూడా ఎంతో తోడ్పడుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. సంభాషణాత్మక ఏఐ సామర్థ్యాలకు ప్రసిద్ధి చెందిన ఈ చాట్‌బాట్‌ను టెలిగ్రామ్ వినియోగదారులకు త్వరలో అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ తన ఎక్స్ ఖాతాలో దీనికి సంబంధించిన వివరాలు ప్రకటించినా, ఎక్స్ఏఐ ఇంకా దీనిపై అధికారిక ప్రకటన చేయలేదు.మార్కెట్‌లో ఇప్పటికే వాట్సప్, గూగుల్‌చాట్ వంటి మెసేజింగ్ యాప్‌ల్లో మెటా లామా, జెమిని వంటి ఏఐ టూల్స్ సేవలందిస్తున్నాయి. ఈ కంపెనీలకు మాతృసంస్థలుగా ఉన్న మెటా, గూగుల్ సొంతంగా తయారు చేసిన ఈ ఏఐ టూల్స్‌ను వాడుతున్నాయి. అయితే టెలిగ్రామ్‌కు ఆ అవకాశం లేదు. దాంతో తన ప్లాట్‌ఫామ్‌లో ఏఐ టూల్ వాడేందుకు ఎక్స్ఏఐతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తుంది.

## ఇజ్రాయెల్ చేతిలో కాంతి ఖడ్గం..!

ఇజ్రాయెల్ తమ అమ్ములపొదిలోని కాంతి ఖడ్గం శక్తిని యుద్ధంలో పరీక్షించింది. డజన్ల కొద్దీ ప్రత్యర్థి డ్రోన్లను కూల్చింది. తాము లేజర్ ఆయుధమైన ఐరన్ బీమ్ వ్యవస్థలో తక్కువ శక్తిమంతమైన ఆయుధం వాడినట్లు బుధవారం ఆ దేశ రక్షణ శాఖ, ఐడీఎఫ్ ప్రకటించాయి. ఈ సరికొత్త సిస్టమ్‌లో తక్కువ శక్తి లేజర్ బీమ్‌ను ఇంటర్‌సెప్టర్‌గా యుద్ధంలో వాడినట్లు పేర్కొన్నాయి. దీనిని ఈ ఏడాది ద్వితీయార్థంలో పూర్తిస్థాయిలో సైన్యానికి అందించనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవస్థను ఇజ్రాయెల్‌కు చెందిన రఫేల్ సంస్థ అభివృద్ధి చేసింది. 'హెజ్‌బొల్లా నుంచి డ్రోన్ల ముప్పు పెరగడంతో అనుకున్న సమయం కంటే వేగంగా దీనిని రూపొందించినట్లు రక్షణశాఖ వెల్లడించింది.'ప్రస్తుత యుద్ధంలో మా వైమానిక రక్షణ వ్యవస్థలతో సహా.. లేజర్‌వ్యవస్థలను కూడా మోహరించాం. అవి చాలా అద్భుతంగా పనిచేశాయి. శత్రువులు ప్రయోగించిన ఆయుధాలను అద్భుతంగా అడ్డుకొని పౌరుల ప్రాణాలు కాపాడుతోపాటు.. దేశ ఆస్తులను రక్షించాయి' అని ఐడీఎఫ్, ఇజ్రాయెల్ రక్షణశాఖ వెల్లడించాయి. ఈ మేరకు ఐరన్ బీమ్ వ్యవస్థ విజయవంతంగా డ్రోన్లను కూల్చివేసిన దృశ్యాలను విడుదల చేసింది.మరోవైపు రఫేల్ సంస్థ చైర్మన్ యువల్ స్టెయినిట్జ్ స్పందిస్తూ.."ప్రపంచంలోనే తొలిసారి అత్యంత శక్తిమంతమైన లేజర్‌ను పూర్తిగా వినియోగించి.. యుద్ధాల్లో ఇంటర్ సెప్టర్ వాడిన దేశంగా ఇజ్రాయెల్ నిలిచింది" అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఇప్పటివరకు మూడు శ్రేణుల్లో లేజర్ ఆయుధాలను అభివృద్ధి చేసింది. వీటిల్లో ఐరన్ బీమ్-ఎం అనేది భారీ వాహనాలపై అమర్చే శక్తిమంతమైన ఆయుధం. ఇది 50 కిలోవాట్ల శ్రేణి లేజర్‌తో ప్రత్యర్థి ఆయుధాలను కూల్చేస్తుంది. వివిధ లేయర్లు ఉండే రక్షణ వ్యవస్థల్లో భాగంగా దీనిని వాడొచ్చు. ఐరన్ బీమ్‌లోనే తేలికపాటి వెర్షన్‌గా భావించే లైట్ బీమ్‌ను కూడా అభివృద్ధి చేసింది. దీనిని చిన్న వాహనాలపై అమర్చి ఉపయోగించవచ్చు. ఇది 10 కిలోవాట్ల శ్రేణి హైఎనర్జీ లేజర్ ఆయుధం. యూఏవీలు, డ్రోన్ల దండుపై ప్రభావంతంగా పనిచేస్తోంది. దీంతో ప్రత్యర్థి డ్రోన్లను కూల్చడానికి అయ్యే ఖర్చు నామమాత్రమే అని రఫేల్ కంపెనీ వెల్లడించింది. ఏకకాలంలో కొన్ని కిలోమీటర్ల దూరంలోని 10 లక్ష్యాలను ఇది కూల్చగలదు.ఇక యుద్ధ నౌకల పైనుంచి వినియోగించే నేవల్ ఐరన్‌బీమ్‌ను కూడా అభివృద్ధి చేసింది. ఇది 100 కిలోవాట్ల హైఎనర్జీ లేజర్‌ను వాడి యుద్ధ నౌకలను రక్షిస్తుంది. యుద్ధనౌకలపై ఉన్న రక్షణ వ్యవస్థలు పెద్ద సంఖ్యలో దూసుకొస్తున్న ముప్పుతో (సాచురేటెడ్ అటాక్) బిజీగా మారినప్పుడు ఇది శక్తిమంతంగా పనిచేస్తుంది.

## పాక్‌లో అణుపరీక్షల వార్షికోత్సవ ర్యాలీ

నేతలతో కలిసి పాల్గొన్న ఉగ్రవాదులు

ఇస్లామాబాద్(జనంసాక్షి):పాకిస్తాన్‌లో నిర్వహించిన ర్యాలీలో లష్కరే తయ్యిబా ఉగ్రవాది, పహల్గాం ఉగ్రదాడి మాస్టర్ మైండ్ సైఫుల్లా కసూరీ పాల్గొన్నాడు. దేశ అణు పరీక్షల వార్షికోత్సవం సందర్భంగా పాకిస్తాన్ మర్కజీ ముస్లిం లీగ్ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. లాహెూర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంజాబ్ అసెంబ్లీ (ప్రావిన్షియల్) స్పీకర్ మాలిక్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అతడు వేదిక పంచుకోవడం గమనార్హం. ఈ ర్యాలీలో భారత వ్యతిరేక నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కసూరీ మాట్లాడుతూ "తనను పహల్గాం ఉగ్రదాడికి మాస్టర్‌మైండ్‌గా నిందించడంతో.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'ఫేమస్ అయ్యాను'' అని వ్యాఖ్యానించాడు. దాదాపు 20 నిమిషాలపాటు సాగిన అతడి ప్రసంగంలో భారత్‌పై విషం చిమ్మాడు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ దాడిలో మరణించిన ఉగ్రవాది ముదస్సిర్ అహ్మద్ పేరిట పంజాబ్ ప్రావిన్స్‌లోని అల్లాహాబాద్‌లో పలు నిర్మాణాలు చేపడతానని చెప్పాడు.ఇదే ర్యాలీలో లష్కరే తయ్యిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్ కుమారుడు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది తల్హా సయీద్ కూడా పాల్గొన్నాడు. అతడు కూడా భారత వ్యతిరేకతను పెంచేలా ప్రసంగించాడు. తల్హా గతంలో లాహెూర్ నుంచి నేషనల్ అసెంబ్లీ 122వ సీట్ నుంచి ఎన్నికల్లో నిలబడి ఓడిపోయాడు. లష్కరే రాజకీయ విభాగమైన పీఎంఎంఎల్ నిర్వహించే వ్యవహారాల్లో పాల్గొంటుంటాడు. పాకిస్తాన్‌లోని లాహెూర్, కరాచీ, ఇస్లామాబాద్, ఫైసలాబాద్ ఇటీవల ఈ సంస్థ భారత వ్యతిరేక ప్రచారం నిర్వహించింది.

# అమెరికాలో చైనా విద్యార్థులకు భారీ షాక్!

వాషింగ్టన్: అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికాలో చైనా విద్యార్థుల వీసాలు రద్దు చేయడానికి ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది.ఈ మేరకు అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో ఓ ప్రకటనలో వెల్లడించారు. దీంతో, చైనా విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది.మంత్రి మార్కో రూబియో తాజాగా ట్విట్టర్ వేదికగా..'అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో చైనా విద్యార్థుల వీసాలను రద్దు చేయడానికి అమెరికా విదేశాంగ శాఖ హెూంల్యాండ్ సెక్యూరిటీ శాఖతో కలిసి పని చేస్తుంది. చైనా విద్యార్థుల వీసాలను రద్దు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.వీరిలో చైనా కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలు ఉన్నవారు, కీలక రంగాలలో చదువుతున్నవారు కూడా ఉన్నారు. దీనికి సంబంధించిన కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఇక, అమెరికాలో భారత్, తర్వాత చైనా విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అంతర్జాతీయ విద్యార్థుల్లో చైనా విద్యార్థులే రెండో స్థానంలో కొనసాగుతున్నారు. 2023-2024 విద్యా సంవత్సరానికి గాను చైనా నుంచి 2,70,000 మంది విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. మరోవైపు.. 'హెూంల్యాండ్ సెక్యూరిటీ విభాగం హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో కొత్త అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకోకుండా తాత్కాలికంగా నిలిపివేసింది. వర్సిటీలోని పరిశోధన భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు.. చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీతో సమన్వయం చేసుకుంటున్నట్లు ఆరోపించింది. హార్వర్డ్ ఒక చైనీస్ పారామిలిటరీ గ్రూప్ సభ్యులకు శిక్షణ ఇస్తోందని డీహెచ్ఎస్ వ్యాఖ్యానించింది. చైనా విద్యార్థులు వామపక్ష భావజాలంతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు చేసింది. ఇదిలా ఉండగా.. అమెరికా వీసాల విషయంలో ట్రంప్ సర్కార్ సంచలన నిర్ణయాలు తీసుకుంటోంది. యూఎస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అమెరికన్లు చేసే పోస్టులను, కామెంట్లను సెన్సార్ చేయడానికి ప్రయత్నించే విదేశీ అధికారులపై కొత్తగా వీసా నిషేధాన్ని ప్రకటించింది. అంతేకాకుండా తమ దేశానికి చెందిన సామాజిక మాధ్యమాలకు కంటెంట్‌ను తీసేయమని నోటీసులు పంపడం, ఒత్తిడికి గురిచేసే వారిపైనా ఈ వీసా నిషేధం అమలుకానున్నట్లు అమెరికా పేర్కొంది. ఇటీవల పలు దేశాల ప్రభుత్వాల నుంచి యూఎస్ సోషల్ మీడియా కంపెనీలకు ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆదేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.'అమెరికా పౌరులు లేదా నివాసితులు తాము సోషల్ మీడియాలో చేసిన పోస్టులను, కామెంట్లను తొలగించాలని ఒత్తిడికి గురిచేయడం, అరెస్టు వారెంట్లు జారీ చేయడం, యూఎస్ టెక్ కంపెనీలను సైతం ఒత్తిడికి గురిచేసే విదేశీ అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త పాలసీ తీసుకొచ్చాం' అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విదేశీ అధికారులు ఇలా అమెరికా పౌరులు, టెక్ కంపెనీలను ఒత్తిడికి గురిచేయడం అనైతికం అన్నారు. అంతేకాకుండా గ్లోబల్ కంటెంట్ మోడరేషన్ విధానాలు అవలంబించడం లేదా వారి అధికార పరిధి దాటి సెన్సార్‌షిప్ కార్యకలాపాల్లో పాల్గొనాలని ఇతర దేశాల అధికారులు యూఎస్ టెక్ కంపెనీలను డిమాండ్ చేయడం ఆమోదయోగ్యం కాదన్నారు. అంతేకాదు ఏ దేశం పేరును గానీ, అధికారులను గానీ ఆయన నేరుగా ప్రస్తావించలేదు.





- జనాభా ఆధారంగా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ రిజర్వేషన్లు
- విలీనమైన పంచాయతీలపై ఎలా కొనసాగాలనే దానిపై చర్చలు
- పంచాయతీ ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లను తీవ్రతరం చేశారు
- ఆగస్టు 15 లోపు పూర్తి చేయాలని టార్గెట్..

# స్థానిక ఎన్నికలపై సర్కార్ దృష్టి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 29 (జనంసాక్షి) :** ఆగస్టు 15 లోగా అన్ని రకాలైన స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. ముందుగా గ్రామీణ ప్రాంతాల్లో లోకల్ బాడీస్ ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలకు వెళ్లనున్నట్లు తెలుస్తుంది. ఎన్నికల ప్రక్రియ మొత్తం 45 రోజుల్లో పూర్తి చేసే విధంగా షెడ్యూలు తయారు చేస్తున్నట్లు అధికార వర్గాల్లో టాక్. షెడ్యూలు విడుదల చేసేలోపు పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసేందుకు అధికారులు క్యాలెండర్ తయారు చేసే పనిలో అధికారులు బిజీగా ఉన్నట్లు తెలిసింది.

**జూన్ చివరి లేదా జూలై తొలివారంలో షెడ్యూలు..**

ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌తో ఇప్పటికే సంప్రదింపులు మొదలుపెట్టినట్లు తెలుస్తున్నది. రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ఎన్ని రోజులు పడుతుంది..? ఆ తర్వాత ఎన్ని రోజులకు ఎన్నికల షెడ్యూలు విడుదల చేయొచ్చు..? ఒక ఎన్నికకు మరో ఎన్నికకు మధ్య ఎన్ని రోజుల సమయం కావాలి..? అనే అంశాలపై చర్చ జరుగుతున్నది. ముందుగా బీసీ డెడికేషన్ కమిషన్ సిఫారసుల మేరకు పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలు రిజర్వేషన్లను ఖరారు చేసి గెజిట్ విడుదల చేయాలి. ఈ ప్రక్రియను జూన్ మూడో వారంలో పూర్తి చేయాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే జూన్ చివరన లేదా జూలై మొదటి వారంలో ఎన్నికలు షెడ్యూలు ప్రకటించేందుకు ఎన్నికల సంఘం సైతం రెడీగా ఉన్నట్టు సమాచారం.

**ఒక్కో ఎన్నికకు వారం రోజుల గడువు..**

ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తున్నది. ఈ ఎన్నికలు ముగిసిన వారం రోజుల తర్వాత సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఓ వైపు సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో అటు ఇటుగా పరోక్ష పద్ధతిలో నిర్వహించే మండల, జిల్లా పరిషత్ అధ్యక్షుల ఎన్నికలు పూర్తి చేసేందుకు షెడ్యూలు తయారు చేస్తున్నట్టు తెలుస్తుంది. ఆ ఫలితాలు ప్రకటించిన వారం,10 రోజుల తేడాతో 139 మున్సిపల్,17 మున్సిపల్ కార్పోరేషన్లలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ ప్రక్రియ మొత్తం 45 రోజుల్లో పూర్తి చేసి, అగస్టు 15 లోపు కొత్త పాలక వర్గాలతో జెండా వందనం చేయించడమే టార్గెట్‌గా పెట్టుకున్నట్టు అధికారులు చెప్పుకుంటున్నారు.

**షెడ్యూలు లోపు రైతు భరోసా పూర్తి..**

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే లోపు రైతు భరోసా కింద పంట సాయం పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది. యాసంగి సీజన్ రైతుభరోసా కింద కేవలం 4 ఎకరాలలోపు రైతులకు మాత్రమే చెల్లించారు. మిగతా రైతులు తమ అకౌంట్‌లో డబ్బులు ఎప్పుడు పడుతాయోనని ఎదురుచూస్తున్నారు. దీనితో రైతు భరోసాను పూర్తిగా చెల్లించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది.

ఈలోపు గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసేందుకు క్యాలెండర్ రెడీ చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.



## జూరాల ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్ళు

**12 గేట్ల నీటి నుండి విడుదల**

**గద్వాల్ రూరల్ మే 29 జనంసాక్షి :** జూరాల ప్రాజెక్టు నుండి కృష్ణమ్మ పరవళ్ళు 12 గేట్ల నుండి నీటినీ విడుదల.ఎగువ రాష్ట్రాలు మహారాష్ట్ర కర్ణాటకలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో గల జూరాల ప్రాజెక్టుకు 1 లక్ష క్యూసెక్కుల భారీగా వరద నీరు వస్తుండడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై జూరాల ప్రాజెక్టులో 12 గేట్లను ఎత్తి 82 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు శ్రీశైలం ప్రాజెక్టుకు వదులుతున్నారు.ప్రస్తుతం ఇన్ఫ్లో 82 వేల క్యూసెక్కులు అవుట్ ఫ్లో 82 వేల క్యూసెక్కులు.

## ఫార్మాసిటీ రైతుల సమస్యలు పరిష్కరించండి

- ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి
- మాజీమంత్రి ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి
- జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేత



**ఇబ్రహీంపట్నం, మే 29 ( జనం సాక్షి ) :** ఫార్మాసిటీ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి వర్యులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫార్మాసిటీ రైతులతో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి జిల్లా బీఆర్ఎస్ నేతలు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మాజీ మంత్రి వర్యులు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఫార్మాసిటీ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. రైతులకు ప్లాట్ల పోజీషన్ చూపించాలన్నారు. రైతుల అంగీకారం లేకుండా టీజీఐఐసీ పేరిట ఆన్లైన్‌లో నమోదైన భూమిని వెంటనే తిరిగి రైతుల పేరిట మార్చాలన్నారు. రైతు భరోసా, రైతు భీమా పథకాలను వర్తింపజేయాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు మొత్తం భూమికి న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూ సేకరణను వెంటనే ఆపాలని కోరారు. ఫ్యూచర్ సిటి, ఫోర్త్ సిటీ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయడంతగదన్నారు. ఫార్మాలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. ఫార్మాసిటీ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.దీనికి సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ త్వరలో ఫార్మా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీ నరసింహా రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కర్నాటి రమేష్ గౌడ్, భాష, రాంరెడ్డి, ప్రభాకర్, గంగాపురం లక్ష్మినరసింహ రెడ్డి, రాజు నాయక్, గోవర్ధన్ నాయక్, శేఖర్ గుప్తా, సాయికిరణ్ రెడ్డి, హరికిషన్ రెడ్డి, మెరుగు రమేష్, కందుకూరి సాయి, శ్రీధర్ రెడ్డి, హాబీబుద్దీన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి



**దోమ మే 29 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని గుండాల్ గ్రామంలో నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మహేష్( 11), శివతేజ్ (11), గ్రామ సమీపంలో నీటి గుంతలో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆడుకుంటూ వెళ్లి అందులో పడ్డారని చెప్పారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### గురుకులాలలో విద్యాబోధన చేస్తారా?

## వెట్టిచాకిరి చేయిస్తారా?

**గురుకుల విద్యార్థుల పట్ల అవమానకరంగా మాట్లాడిన అలుగు వర్షిణిపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఇంజమూరి రఘునందన్**



**హయత్ నగర్, మే 29 (జనం సాక్షి) :** ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి ఇటీవల ఓ ఆడియోలో మాట్లాడిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. బాలల హక్కుల కార్యకర్తలను, విద్యావేత్తలను ఆవేదనకు గురిచేశాయి. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులు టాయిలెట్లు కడగడం, ఎవరి రూమ్ వాళ్లే క్లీన్ చేసుకోవటంలో తప్పేంటి? ఎవరొచ్చి చేస్తారు, వాళ్లది వాళ్ళు చేసుకోవడంలో తప్పేంటి, గురుకులాల పిల్లలు టూ మచ్ ఫాస్ సొసైటీ నుంచి రాలేదు, వాళ్ల టేబుల్ మీదకి ఫుడ్ రాదు, కిచెన్‌లో రోటీలు చేయాల్సిందే, అది నేర్చుకోవ డంలో భాగమే కదా అని వ్యాఖ్యానించడాన్ని బాలల హక్కుల సంక్షే మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ (బిహెచ్ఎస్ఎస్) తీవ్రంగా ఖండించారు. ఆమె మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నాయి. ఆమె మాటలు చాలా దారుణంగా ఉన్నాయి. అట్టడుగు వర్గాల పిల్లను అవమాని చేవిగా, సభ్యసమాజంలో ఇలాంటి అధికారులు ఉండడం అక్షేపణీయం అని అన్నారు. ఆమె మాటలు గురుకుల విద్యార్థుల పట్ల అవమానకరంగా, కుల వివక్షను ప్రోత్సహించేలా ఉన్నాయని వారు అన్నారు. బాలకార్మికులతో పనిచేయించడం నేరం అని తెలియదా? అని ప్రశ్నించారు. తక్కువ జాతి కి చెందిన పిల్లలు అని అర్థం వచ్చేలా మాట్లాడటం తగునా? తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని వెంట నే క్షమాపణ చెప్పాలి. విద్యార్థులతో టాయిలెట్లు కడిగించడం, వంటలు చేయించడం వంటివి కుల వివక్షకు సంబంధించినవే. అవి బాలల హక్కులను ఉల్లంఘించేవే? ఇది శ్రమ గౌరవాన్ని నేర్పడం కంటే, వెట్టిచాకిరి చేయించేవే అని వారు అన్నారు. గురుకులాలలో విద్యాబోధన చేస్తారా? లేదా వెట్టిచాకిరి చేయిస్తారా? అని వారు ప్రశ్నించారు. గురుకులాల వ్యవస్థను మసక బార్చడం కోసం కార్పోరేట్ శక్తుల ప్రసన్నం చేసుకోవడం కోసమా వీరి వ్యాఖ్యల అంతరార్థం అని వారు ప్రశ్నించారు. గతంలో కూడా అలుగు వర్షిణి అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నప్పుడు గురుకుల అధ్యాపక సంఘాలు ప్రశ్నించినప్పుడు అప్రజాస్వామికంగా నియంతృత్వపూర్వకంగా మాట్లాడేవారు. ఇప్పుడు చివరకు విద్యార్థులు ఎవరి టాయిలెట్స్ వాళ్లే కడుక్కోవాలి ఇది శ్రమ సంస్కృతి నేర్పుతుంది, ఈ పిల్లలేమన్న ఉన్నత వర్గాల నుండి వచ్చారా అని మాట్లాడిన గురుకులాల సొసైటీ సెక్రెటరీ అలుగు వర్షిణి బాలల హక్కులను ఉల్లఘించడమే అని అన్నారు. విద్యాశాఖను తానే నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

**చేవెళ్ల ఏడిఎ సురేష్ బాబు, ఎస్ఐ శిరీష**

**చేవెళ్ల, మే 29 (జనంసాక్షి) :** రైతులకు నకిలి విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ఏడిఎ సురేష్ బాబు, చేవెళ్ల ఎస్సై శిరిష తెలిపారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని రైతువేదికలో పర్టిలేజర్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధలను ఉల్లంఘించి నిర్లక్ష్యంగా వ్యవరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, మందులు అమ్మాలని వారు సూచించారు. రైతులకు నకిలీ విత్తనాలు, లుజూ విత్తనాలు అమ్మితే పిడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు తమ స్టాక్ట్ వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి రైతులకు రశీదు ఇవ్వాలని సూచించారు. రైతులు సైతం బిల్లులు అడిగి తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైన నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే రైతులు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏవో శంకర్ లాల్, డీలర్లు ఉన్నారు.

### ఆవులను వధించకండి..

## చట్టాలను గౌరవించండి

- వారసంతలో వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచాలి
- మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్



**కరీంనగర్, మే 29 (జనం సాక్షి) :** చట్టాలను గౌరవిస్తూ, దేశ సమైక్యత, సమగ్రత కోసం బక్రీద్ సందర్భంగా ఆవులను వధించకూడదని, ప్రభుత్వం నిషేధాన్ని ఉల్లంఘించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రేకుర్తి మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ ప్రిన్సిపాల్ ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ యావత్తు ముస్లిం సమాజానికి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా, ఖుర్బానీ (బలి) ఇచ్చే జంతువుల్లో ఆవులను వధించకూడదని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి సున్నిత విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇస్లాం ధర్మం ప్రకారం మనం చేసే పనులు, కార్యక్రమాలతో సమాజంలో నివసించే ఇతర ధర్మం ప్రజల మనోభావాలకు ఇబ్బంది కలుగకుండా ఉండాలని, ఆవిధంగా జీవించాలని మహానీయ మహమ్మద్ ప్రవక్త (సల్లం) సెలవిచ్చారని పేర్కొన్నారు. ఇస్లాం సంస్కృతి, సాంప్రదాయలకు పెట్టింది పేరని, ఇస్లాంకు విరుద్ధంగా ప్రవర్తించడానికి వీలు లేదన్నారు. బక్రీద్ లో పరిసరాల పరిశుభ్రతను విధిగా పాటించాలని కోరారు. బక్రీద్ మాసం దృష్ట్యా గోవులను ఈనెల రోజుల పాటు వార సంతల్లో విక్రయించకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వారసంతల్లో వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో సర్టిఫికెట్ల కోసం ఉంచాలని ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతిలోకి తీసుకొని దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ లకు విజ్ఞప్తి చేశారు.

## నవోదయ తరగతులు ఈ ఏడాది నుండే

***నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్***

**నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 29 (జనం సాక్షి) :** పార్లమెంట్ పరిధిలో నిజామాబాద్, జగిత్యాల జిల్లాలలో రెండు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందున, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఈ విద్యా సంవత్సరం నుండే తరగతులు ప్రారంభించాలని నవోదయ అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా విద్యాలయాల శాశ్వత మరియు తాత్కాలిక స్థలాలకు సంబంధించి అవసరమైన చర్యలను ప్రారంభించాలని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణకు అయన లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లాలో శాశ్వత భవన నిర్మాణానికి జక్రాన్ పల్లి మండలం కలిగోట్ గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 1063 లోస్థలాన్ని కేటాయించగా, తాత్కాలిక వసతి కొరకు నాగారం శివారు లోని ప్రభుత్వ డైట్ కళాశాల ఎంపిక చేయబడ్డాయని ఆయన లేఖలో తెలియజేశారు. ఆయా జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుని ఎలాంటి వివాదాలు లేని కలిగోట శివారులోని 30 ఎకరాల భూమిని నవోదయ విద్యాలయ సమితి పేరుపై బదలాయింపు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా శాశ్వత మరియు తాత్కాలిక భవనాల్లో రోడ్లు, నీరు, విద్యుత్, టెలికమ్యూనికేషన్ లాంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యా సంస్థ తాత్కాలిక భవనంలో ప్రారంభమయ్యేందుకు చొరవ తీసుకోవడంతో పాటు, తాత్కాలిక భవన మరమ్మత్తుల కొరకు తన యొక్క ఎంపీ నిధుల ద్వారా 20 లక్షలు మంజూరు చేసినందుకు జిల్లా ప్రజలు ఎంపీ అర్వింద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జూన్ 1న బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**



**హైదరాబాదు మే 29 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్ల అమలు, దేశవ్యాప్తంగా సమగ్ర కులగనన, భవిష్యత్తు బిసి ఉద్యమ కార్యాచరణ పై చర్చించడానికి జూన్ 1వ తేదీన హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న కళింగ భవన్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల బాధ్యులు, బీసీ సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గ నేతలు హాజరు కావాలని ఆయన కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థలలో 42% బీసీ రిజర్వేషన్ అమలు, త్వరలో దేశవ్యాప్తంగా జరిగే జనగణలో సమగ్ర కులగనన అమలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ఈ సమావేశంలో ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే పోలీసుల ముఖ్య ధ్యేయం





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 29 (జనం సాక్షి) :** ప్రజలు ఎల్లప్పుడూ శాంతి భద్రతలతో కూడిన సమాజాన్ని కోరుకుంటారు ప్రజలద్వారానే ముందస్తు సమాచారాన్ని సేకరిస్తూ ఉండాలి. తద్వారా నేరాల నియంత్రణ మరియు ఛేదన చేయవచ్చు. పాత నేరస్తులే తరచూ నేరాలకు పాల్పడుతున్నారు. వారి ప్రతీ కదలికపై నిఘా ఉంచాలి. రోడ్డు ప్రమాదాల మరియు సైబర్ నేరలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారి విలువైన ప్రాణాలను, డబ్బును కాపాడాల్సిన భాధ్యత పోలీసులదే.నని వాహణాలపై పెండింగ్ చలాన్స్ అందరూ చల్లించవలసిందే.నని నేరస్తులపై కఠినంగా వ్యవహరించడం, బాధితులకు అండగా నిలవడం పోలీసింగ్.

ప్రతీగ్రేవ్ కేసును జిల్లా యస్పి మానిటర్ చేస్తూ,నేరస్తుడికి కచ్చితంగా శిక్ష పడే విధంగా కేసు విచారణ పర్సనల్ గా చూడటం ప్రశంసనీయం. కొనియాడారు.కామారెడ్డి జిల్లా పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది శాంతి భద్రతల గురించి అద్భుతంగా పనిచేస్తున్నారని సిఈఐఆర్ ద్వారా మొబైల్ రికవరీలలో రాష్ట్రంలోని జిల్లాలలో కమిషనరేట్లను మినహాయిస్తే, కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానం అభినందనీయమని. తెలంగాణ పోలీసు శాఖ దేశములోనే సాంకేతికత ఉపయోగములో ప్రథమ స్థానంలో ఉందని తెలిపినారు. జితేందర్, ఐపీఎస్,డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, తెలంగాణ రాష్ట్ర డిజిపి డా. జితేందర్ ముందుగా పోలీసు వందనం స్వీకరించిన తర్వాత జిల్లాల పోలీసు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. తదుపరి కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో ముందుగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర జిల్లాలో శాంతి భద్రతల నిర్వహణ, ప్రాధాన్యమైన కేసులు, మరియు నేరాల పరిశీలన, ప్రజలకు అందించిన సేవలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ప్రజెంటేషన్ లో జిల్లాలో ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలు జిల్లా పోలీసులు ప్రదర్శించిన ప్రతిభలను ప్రస్తావించారు. డీజీపీ ప్రతి సర్కిల్ ఇన్స్పెక్టర్ మరియు సబ్ డివిసనల్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి వారి ఏరియాలో జరుగతున్న నేరాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ముఖ్యమైన కేసుల వివరాలు, వాటి పురోగతి నేరాల నివారణకు చేపట్టిన చర్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పోలీసు శాఖ యొక్క ప్రధాన లక్ష్యం ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం అని స్పష్టం చేశారు. ప్రజలలో వారు సురక్షితంగా ఉన్నామన్న భావన కలిగేలా పోలీసింగ్ జరగాలని ఆయన సూచించారు. ప్రజల అభిప్రాయాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలు సుకుంటూ ఉండటం ద్వారా వారి సమస్యలకు పరిష్కార మార్గాలు చూపడమే కాకుండా నేరాలు కూడా తగ్గించవచ్చు అని తెలిపారు.అదే విధముగా ప్రతి కేసులో సమర్థమంతమైన మరియు నిష్పక్ష పాత దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నప్పుడే ప్రజల నమ్మకాన్ని పెంపొందిచవచ్చని అన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హై వే అథారిటీ, రవాణా శాఖ వారితో సమన్వయం చేసుకుంటూ ప్రివెంటివ్ చర్యలు, ట్రాఫిక్ నియమాల పై మరియు సైబర్ నేరాలపట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమని కొనియాడారు. ఏదైనా నేరం జరిగాక చర్యలు తీసుకునే కంటే జరుగక ముందే ముందస్తు సమాచారం తో నేరాలను ప్రివెంటివ్ చెయ్యాలని, తరచు ప్రాపర్టీ నేరాలకు పాల్పడే వారే మరలా నేరాలు చేస్తున్నారు కావున వారి పై నిరంతర నిఘా ఉండాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో చంద్రశేఖర్ రెడ్డి, మల్టీ జోన్-1 ఐజిపి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి, డిఎస్పిలు శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# ఫైనల్‌కు నమన్, అన్షుల్

## మహిళా బాక్సర్లు కాంస్య పోరుకు

థాయ్‌లాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత హెవీవెయిట్ బాక్సర్లు నమన్ తన్వర్ (90 కిలోలు), అన్షుల్ గిల్ (90ం కిలోలు) తమ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన సెమీ ఫైనల్స్‌లో ఈ ఇద్దరూ ఉజ్బెకిస్థాన్ బాక్సర్లను చిత్తు చేశారు. అయితే, మహిళా బాక్సర్లు నిరాశపరిచారు. తమన్నా (51 కిలోలు), ప్రియా (57 కిలోలు), లల్ఫకమవి (80 కిలోలు) సెమీస్‌లో ఓటమి చెందినప్పటికీ, వారికి కాంస్య పతకం కోసం పోరాడే అవకాశం ఉంది. నమన్ తన్వర్ సెమీస్‌లో 90 కిలోల విభాగంలో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ జురబోఎవ్ ఎలిర్బెక్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించి 4-1 తేడాతో విజయం సాధించాడు. అదే విధంగా, అన్షుల్ గిల్ 90ం కిలోల విభాగంలో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన రుస్తమోవ్ అబ్దురఖ్మోన్‌ను 3-2 తేడాతో ఓడించి ఫైనల్‌కు చేరాడు. ఈ ఇద్దరూ జూన్ 1న జరిగే ఫైనల్ కోసం సిద్ధమవుతున్నారు. భారత్ ఈ టోర్నమెంట్‌కు 19 మంది ప్రతిభావంతులతో కూడిన జట్టును పంపినప్పటికీ, కేవలం నమన్, అన్షుల్ మాత్రమే ఫైనల్‌కు చేరడం నిరాశ కలిగించింది. మహిళా బాక్సర్లు కాంస్య పతకం కోసం పోరాడి తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఆశిస్తున్నారు.



### ధోనీతో మాట్లాడటానికి

# ఇప్పటికీ సంకోచిస్తా : రవీంద్ర జడేజా



టీమ్ ఇండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, భారత మాజీ దిగ్గజ క్రికెటర్ ఎంఎస్ ధోనీని తొలిసారి కలిసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నాడు. ధోనీని మొదటిసారి కలిసేటప్పుడు తాను సంకోచించానని, ఇప్పటికీ ధోనీ సరైన మూడ్‌లో లేనప్పుడు మాట్లాడటానికి బెరుకుగా ఉంటుందని జడేజా వెల్లడించాడు. ఈ విషయాలను భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్‌లో జడేజా పంచుకున్నాడు."2005లో చెన్నైలో ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ధోనీని మొదటిసారి కలిశాను. నేను ముంబై నుంచి విమానంలో వస్తుండగా, ధోనీ కూడా అదే ఫ్లైట్‌లో ఉన్నాడు. నేను ఎకానమీ క్లాస్‌లో ఉంటే, అతను బిజినెస్ క్లాస్‌లో ఉన్నాడు. అందరూ ధోనీ ముందు కూర్చున్నాడని చెప్పారు, కానీ నేను అతన్ని కలవడానికి సంకోచించాను. ఇప్పటికీ ధోనీ సరైన మూడ్‌లో లేనప్పుడు మాట్లాడటం కష్టంగా ఉంటుంది. అతను ఏమీ అనడు, కానీ అతని ముఖంలో మాట్లాడే మూడ్ లేదని స్పష్టంగా కనిపిస్తుంది," అని జడేజా వివరించాడు.

తొలిసారి ధోనీని కలిసిన సందర్భాన్ని గురించి జడేజా ఇలా చెప్పాడు: "అప్పుడు నేను చిన్నవాడిని. విమానంలో ధోనీని చూశాను, అతను పొడవైన జుట్టుతో ఉన్నాడు. మా మేనేజర్, ఎయిర్‌పోర్ట్ నుంచి ధోనీతో కలిసి హోటల్‌కు వెళ్లాలని చెప్పాడు. నాకు అప్పుడు బెరుకుగా అనిపించింది. 'అతను ధోనీ కదా, నేను ఎలా వెళ్తాను?' అని సంకోచించాను. అదృష్టవశాత్తూ, ధోనీ తన ఫోన్‌ను పోగొట్టుకుని, దాని కోసం వేచి ఉన్నాడు. అదే సమయంలో నేను అక్కడి నుంచి వెళ్లిపోయాను. అతనితో ఏం మాట్లాడాలో ఆలోచించేవాడిని," అని జడేజా ఆ రోజును వివరంగా గుర్తు చేసుకున్నాడు. ఎంఎస్ ధోనీ సారథ్యంలో జడేజా టీమ్ ఇండియాతో పాటు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో కూడా ఆడాడు. 2018, 2021, 2023లో చెన్నై ఐపీఎల్ టైటిల్ గెలవడంలో జడేజా కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా 2023 ఫైనల్‌లో మోహిత్ శర్మ బౌలింగ్‌లో చివరి రెండు బంతుల్లో 10 పరుగులు చేసి చెన్నైకి ఐదో ఐపీఎల్ టైటిల్ అందించాడు. అయితే, ఈ సీజన్‌లో జడేజా అంతగా రాణించలేకపోయాడు, చెన్నై సూపర్ కింగ్స్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరకుండా టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది.

# భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే సిరీస్ షెడ్యూల్ విడుదల



భారత మహిళల క్రికెట్ జట్టు, ఆస్ట్రేలియా మహిళల జట్టుతో సెప్టెంబర్‌లో స్వదేశంలో మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. సెప్టెంబర్ 14 నుంచి చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది చివర్లో జరిగే మహిళల వన్డే ప్రపంచ కప్‌కు సన్నాహకంగా ఈ సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. అన్ని మ్యాచ్‌లు మధ్యాహ్నం 1:30 గంటలకు చెన్నైలో జరగనున్నాయి.

ఈ సిరీస్‌లో విజయం సాధించి, వన్డే ప్రపంచ కప్‌లో ఉత్సాహంతో పాల్గొనాలని భారత జట్టు లక్ష్యంగా పెట్టు కుంది. చెపాక్ స్టేడియం 2007 నుంచి మహిళల వన్డే మ్యాచ్‌లకు వేదికగా ఉంది. అప్పట్లో భారత్, న్యూజిలాండ్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య సిరీస్ ఇక్కడ జరిగింది. ఇటీవల మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ మరియు గత ఏడాది భారత్-దక్షిణాఫ్రికా టెస్ట్ మ్యాచ్ కూడా ఈ మైదానంలో నిర్వహించ బడ్డాయి. ఈ ఏడాది వన్డే ఫార్మాట్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. జనవరిలో ఐర్లాండ్‌ను ఓడించగా, ఇటీవల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో లంకను చిత్తు చేసి ట్రోఫీని సొంతం చేసుకుంది.

**ఇండియా x ఆస్ట్రేలియా వన్డే సిరీస్ షెడ్యూల్:**
మొదటి వన్డే: సెప్టెంబర్ 14
రెండో వన్డే: సెప్టెంబర్ 17
మూడో వన్డే: సెప్టెంబర్ 20

# ధోనీపై నిషేధం విధించలేదు?

## వీరేంద్ర సెహ్వాగ్



ఈ ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఆటగాడు దిగ్వేశ్ రాఠీ అతిగా సంబరాలు చేసుకోవడంతో వార్తల్లో నిలిచాడు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు రెండుసార్లు జరిమానా ఎదుర్కొన్న దిగ్వేశ్, మూడోసారి కూడా నియమాలను అతిక్రమించడంతో మ్యాచ్ ఫీజులో 50% కోతతో పాటు ఒక మ్యాచ్ నిషేధం విధించారు. ఈ సందర్భంగా భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ, ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లి వంటి సీనియర్ ఆటగాళ్లు నియమాలను ఉల్లంఘించినప్పుడు బీసీసీఐ నిషేధం విధించలే దని, కానీ తొలి ఐపీఎల్ సీజన్‌లో ఆడుతున్న దిగ్వేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డాడు.

"దిగ్వేశ్‌పై విధించిన నిషేధం కొంత కఠినంగా ఉంది. అతనికి ఇది ఐపీఎల్‌లో మొదటి సీజన్. ధోనీ మైదానంలోకి దూసుకెళ్లినప్పుడు అతనిపై నిషేధం విధించలేదు. కోహ్లి అనేకసార్లు అంపైర్లతో వాగ్వాదం చేశాడు, అతనిపై కూడా నిషేధం లేదు. కాబట్టి, దిగ్వేశ్ విషయంలో కూడా ఇలాంటి విధానాన్ని అనుసరించాల్సింది. అతను యువ ఆటగాడు, ఇప్పుడే గుర్తింపు సంపాదిస్తున్నాడు. కాలక్రమంలో తన దూకుడును తగ్గించుకోవచ్చు," అని సెహ్వాగ్ పేర్కొన్నాడు. సాధారణంగా ప్రశాంతంగా కనిపించే ధోనీ 2019 ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో నో-బాల్ (ఎత్తు) విషయంపై కోపంతో డగౌట్ నుంచి మైదానంలోకి పరుగెత్తుకొచ్చి అంపైర్లతో తీవ్రంగా వాదించాడు. ఈ ఘటన అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లంఘించినందుకు ధోనీకి మ్యాచ్ ఫీజులో 50% జరిమానా విధించారు, అయితే నిషేధం విధించలేదు.

### చరిత్రకు అడుగు దూరంలో

# విరాట్ కోహ్లి



ఐపీఎల్ 2025లో విరాట్ కోహ్లి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చాలా బాగా రాణిస్తోంది. విరాట్ కోహ్లి జట్టుకు కెప్టెన్ కాకపోయినా జట్టు బాధ్యత ఇప్పటికీ ఆయన భుజాలపైనే ఉంది. విరాట్ కోహ్లి కూడా ఈ బాధ్యతను చాలా బాగా నిర్వర్తిస్తున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లి మంచి దూకుడుతో బ్యాటింగ్ చేస్తున్నాడు. విరాట్ కోహ్లి బ్యాటింగ్ చూస్తుంటే చాలా త్వరగా టీ20 ఇంటర్నేషనల్ నుంచి రిటైర్ అయినట్లు అనిపిస్తుంది. ఇంతలో విరాట్ గొప్ప రికార్డుకు చాలా దగ్గరగా వచ్చాడు. కోహ్లీ వెస్టిండీస్ దిగ్గజం కీరన్ పొలార్డ్, పాకిస్తాన్ జట్టుకు చెందిన షోయబ్ మాలిక్ రికార్డులను అధిగమించే అవకాశం ఉంది. టీమిండియా, ఆర్సీబీ రన్ మెషీన్ విరాట్ కోహ్లి టీ20 క్రికెట్‌లో గొప్ప బ్యాటర్లలో ఒకడు. విరాట్ కోహ్లి టీ20 క్రికెట్‌లో 412 మ్యాచ్‌లు ఆడాడు. ఈ కాలంలో విరాట్ కోహ్లి 42.01 సగటు, 134.75 స్ట్రైక్ రేట్‌తో 13488 పరుగులు చేశాడు. అత్యధిక టీ20 పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లి 5వ స్థానంలో ఉన్నాడు. అదే సమయంలో వెస్టిండీస్‌కు చెందిన కీరన్ పొలార్డ్ 13537 పరుగులతో నాల్గవ స్థానంలో, పాకిస్థాన్ జట్టుకు చెందిన షోయబ్ మాలిక్ 13571 పరుగులతో ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లి ఇంకా ఐపీఎల్‌లో మూడు మ్యాచ్‌లు ఆడగలడు. ఈ జాబితాలో ఈ ఇద్దరు బ్యాటర్లను విరాట్ కోహ్లి సులభంగా అధిగమించగలడు.

# వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో కండక్టర్ కుమారుడి సత్తా

## రెండు పతకాలను గెలుచుకున్న అకీరా నందన్

మొరాకోలో ఇటీవల జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో కూకట్‌పల్లి డిపోనకు చెందిన కండక్టర్ బానోత్ మోహన్ కుమారుడు అకీరా నందన్ సత్తా చాటాడు. 400 మీటర్ల పరుగు పందెంను 53.07 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచి.. స్వర్ణ పతకం సాధించాడు. 200 మీటర్ల పరుగులోనూ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో మెరిసిన కండక్టర్ కుమారుడు అకీరా నందన్‌ను టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అభినందించారు. హైదరాబాద్ బస్ భవన్‌లోని తన చాంబర్‌లో గురువారం అకీరా నందన్‌ను ఆయన సన్మానించారు. తన కుమారుడిని క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తోన్న కండక్టర్ మోహన్ దంపతులను ఈ సందర్భంగా ప్రశంసించారు. భవిష్యత్‌లో మంచిగా ప్రాక్టిస్ చేసి మరిన్ని అంత ర్జాతీయ వేదికలపై అత్యుత్తమంగా రాణించాలని అకీరా నందన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు ముని శేఖర్, వెంకన్న, సీటీఎం (కమర్షియల్) శ్రీధర్, సీపీఎం ఉషాదేవి, కూకట్ పల్లి డీఎం హరి, తదితరులు పాల్గొన్నారు.

# క్వార్టర్ ఫైనల్‌కు.. సాత్విక్-చిరాగ్ జోడీ

సింగపూర్ ఓపెన్‌లో సింధు, ప్రణయ్‌లకు నిరాశ ప్రతిష్ఠాత్మక సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా, స్టార్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్‌లు రెండో రౌండ్‌లో ఓటమితో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించారు. సాత్విక్-చిరాగ్ జంట అద్భుత ప్రదర్శనతో ఏడో సీడ్ ఇండోనేషియా జోడీ సబర్ కర్యమన్ గుటమ, మొహ్ రెజా పహ్లెవీని చిత్తు చేసింది. గంట 14 నిమిషాల సుదీర్ఘ పోరులో తొలి సెట్‌ను 19-21తో కోల్పోయినప్పటికీ, రెండో, మూడో సెట్లలో 21-16, 21-19 స్కోర్లతో అద్భుతంగా పుంజుకుని క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీస్ బెర్త్ కోసం ఈ జంట మలేషియా ద్వయంతో తలపడనుంది.

అయితే, ఈ సీజన్‌లో నిరాశపరుస్తున్న పీవీ సింధు మరోసారి క్వార్టర్ ఫైనల్‌కు ముందే టోర్నమెంట్ నుంచి వైదొలిగింది. ఇటీవల మలేషియా మాస్టర్స్‌లో తొలి రౌండ్‌లో ఓడిన సింధు, సింగపూర్ ఓపెన్‌లో వరల్డ్ నంబర్ 5 చెన్ యుఫే చేతిలో 9-21, 21-16, 11-21 స్కోర్లతో ఓటమిపాలైంది. తొలి సెట్‌ను సులభంగా కోల్పోయిన ఆమె, రెండో సెట్‌లో పుంజుకున్నప్పటికీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో చేతులెత్తేసింది. ప్రణయ్ కూడా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. రెండో రౌండ్‌లో క్రిస్టో పొపోవ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో 16-21, 14-21 స్కోర్లతో వరుస సెట్లలో ఓడి ఇంటిదారి పట్టాడు. మహిళల డబుల్స్‌లో త్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జోడీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-రుత్వికా శివాని జంట కూడా ఓటమితో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించారు.



# ఫైనల్‌కు ఆర్సీబీ

## మెరుపు బ్యాటింగ్‌తో పంజాబ్‌ను చితక్కొట్టిన సాల్ట్

- పంజాబ్‌ను కట్టడి చేసిన బౌలర్లు
- పంజాబ్ బ్యాటింగ్ వైఫల్యం
- సుయాశ్ స్పిన్ మాయాజాలం



***రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మెరిసింది. ఐపీఎల్ 2025 ఫైనల్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. టోర్నీ ఆరంభం నుంచి అద్భుతంగా రాణిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలకమైన మ్యాచ్‌లో కూడా సత్తా చాటింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ విభాగాల్లో రాణించి పంజాబ్ కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన పంజాబ్ కింగ్స్ జట్టుకు మరో క్వాలిఫయర్ మ్యాచ్ ఆడే అవకాశం ఉంది.***

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 18వ సీజన్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. 'ఈ సాలా కప్ నమదే' నినాదంతో టోర్నమెంట్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ, క్వాలిఫయర్ 1లో పంజాబ్ కింగ్స్‌పై అద్భుత విజయంతో తొలి ఐపీఎల్ ట్రోఫీకి అడుగు దూరంలో నిలిచింది. 102 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కేవలం 10 ఓవర్లలోనే ఛేదించిన ఆర్సీబీ, నాలుగోసారి ఫైనల్‌కు చేరింది. ముల్లనూర్ మైదానంలో హేజిల్‌వుడ్ (3-21), సుయాశ్ శర్మ (3-17)ల ధాటికి పంజాబ్ కేవలం 101 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత, ఫిలిప్ సాల్ట్ (56 నాటౌట్) మెరుపు బ్యాటింగ్‌తో అర్ధ సెంచరీ సాధించగా, కెప్టెన్ రజత్ పాటిదార్ (15 నాటౌట్) 10వ ఓవర్ చివరి బంతికి సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. సమిష్టి వైఫల్యంతో ఓడిన పంజాబ్ కింగ్స్‌కు ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో మరో అవకాశం ఉంది.

### ఆర్సీబీ బౌలర్ల హవా

క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ బౌలర్లు పంజాబ్ కింగ్స్‌ను చాపచుట్టేశారు. పవర్‌ప్లేలో హేజిల్‌వుడ్ (3-21), యశ్ దయాల్ (2-26) నిప్పులు చెరిగితే, మిడిల్ ఓవర్లలో సుయాశ్ శర్మ (3-17) పంజాబ్ బ్యాటింగ్‌ను కుదేలు చేశాడు. ఫలితంగా, ఈ సీజన్‌లో రెచ్చిపోయి ఆడిన పంజాబ్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. 50 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన పంజాబ్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. మార్కస్ స్టోయినిస్ (26), అజ్మతుల్లా ఒమర్జాయ్ (18) పోరాడినప్పటికీ, హేజిల్‌వుడ్ ఒమర్జాయ్‌ను ఔట్ చేసి పంజాబ్ ఇన్నింగ్స్‌ను 14.1 ఓవర్లలో 101 పరుగులకు ముగించాడు.

### పంజాబ్ బ్యాటింగ్ వైఫల్యం

లీగ్ దశలో 9 విజయాలతో దూకుడు మీదున్న పంజాబ్ కింగ్స్ కీలక మ్యాచ్‌లో తడబడింది. ముల్లనూర్ మైదానంలో ఆర్సీబీ బౌలర్లను ఎదుర్కోలేక బ్యాటర్లు చేతులెత్తేశారు. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (5)ను యశ్ దయాల్ ఔట్ చేయగా, భువనేశ్వర్ కుమార్ డేంజరస్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (18)ను పెవిలియన్‌కు పంపాడు. హేజిల్‌వుడ్ శ్రేయస్ అయ్యర్ (2), జోష్ ఇంగ్లిస్ (0)లను వరుసగా ఔట్ చేసి పంజాబ్‌ను 30 పరుగులకే మూడు వికెట్ల దెబ్బతీశాడు.


### సుయాశ్ స్పిన్ మాయాజాలం

పవర్‌ప్లే తర్వాత సుయాశ్ శర్మ స్పిన్‌తో పంజాబ్‌ను మరింత ఇరకాటంలోకి నెట్టాడు. యశ్ దయాల్ నెహాల్ వధేరా (6)ను ఔట్ చేయగా, 60 పరుగులకే పంజాబ్ సగం వికెట్లు కోల్పోయింది. సుయాశ్ శర్మ శశాంక్ సింగ్ (3)ను బౌల్డ్ చేసి పంజాబ్ బ్యాటింగ్‌ను కుదేలు చేశాడు. స్టోయినిస్, ఒమర్జాయ్ గౌరవప్రద స్కోర్ కోసం పోరాడినప్పటికీ, ఆర్సీబీ బౌలర్ల ధాటికి పంజాబ్ 101 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ భారీ విజయంతో ఆర్సీబీ ఫైనల్‌కు చేరుకోగా, తొలి ఐపీఎల్ టైటిల్ గెలవాలనే కల సాకారమయ్యే దిశగా దూసుకెళ్తోంది.

## స్టంప్స్ చెల్లాచెదురు..

**లెగ్ స్పిన్నర్ సుయాష్ శర్మ చెలరేగి బౌలింగ్ చేస్తున్నాడు. ఇప్పటికే 2.4 ఓవర్లలో 3 వికెట్లు తీసి ఊపు మీదున్నాడీ ఆర్సీబీ స్టార్. అతడు తీసిన వికెట్లలో శశాంక్ సింగ్‌ను ఔట్ చేసిన విధానం మాత్రం హైలైట్ అనే చెప్పాలి. 50 పరుగులకు 5 వికెట్లు పడిపోయిన దశలో బ్యాటింగ్‌కు దిగిన శశాంక్ 5 బంతుల్లో 3 పరుగులు చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతుండటం, మరోవైపు పరుగులు రాకపోవడంతో అతడు హిట్టింగ్‌కు దిగాలని భావించాడు. పేసర్లు జోష్‌లో ఉండటంతో స్పిన్నర్లను అటాక్ చేయాలని అనుకున్నాడు. ఈ తరుణంలో బౌలింగ్‌కు దిగాడు సుయాష్. అతడి బౌలింగ్‌లో గూగ్లీని హిట్ చేయబోయి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు శశాంక్. పిచ్ మీద పడిన బంతి ఒక్కసారిగా లోపలకు టర్న్ అయి రావడంతో లైన్ మిస్ అయ్యాడు శశాంక్. అతడి బ్యాట్‌ను ఛేదించుకొని వెళ్లిన బంతి స్టంప్స్‌ను చెల్లాచెదురు చేసింది.**

# రెజ్లింగ్ కోచ్‌కు బజరంగ్ క్షమాపణ



ఒలింపిక్ పతక విజేత బజరంగ్ పూనియా రెండేళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలకు రెజ్లింగ్ కోచ్ నరేశ్ దహియాకు బేషరతుగా క్షమాపణ చెప్పాడు. పరువునష్టం కేసులో తన తప్పును అంగీకరిస్తూ పూనియా ఒక ప్రకటన విడుదల చేశాడు. "జంతర్ మంతర్ వద్ద జరిగిన సభలో నరేశ్ దహియాపై సత్య దూరమైన ఆరోపణలు చేశాను. నా వ్యాఖ్యలు ఆయన పరువు, ప్రతిష్ఠలను దెబ్బతీశాయి. ఈ తప్పుడు ఆరోపణల వల్ల ఆయనకు, ఆయన సన్నిహితులకు మనోవేదన కలిగినందుకు బాధపడుతున్నాను," అని గురువారం పూనియా తెలిపాడు.

"నరేశ్ దహియా ఒక ప్రసిద్ధ కోచ్, దేశానికి ఎనలేని సేవలు అందించారు. నా వ్యాఖ్యలతో ఆయన మనసు నొప్పించినందుకు ఆయనతో పాటు ఆయన సన్నిహితులకు క్షమాపణలు కోరుతు న్నాను," అని పూనియా తన ప్రకటనలో వెల్లడించాడు. ఈ క్షమాపణను స్వీకరిస్తున్నట్లు దహియా స్పందిస్తూ, "పూనియా తరఫు న్యాయవాది మా న్యాయవాదితో మాట్లాడారు. ఆయన క్షమాపణలను నేను అంగీకరిస్తున్నాను. నాకు బ్రిజ్ భూషణ్‌తో ఎలాంటి సంబంధం లేదు. కేవలం పని నిమిత్తం 3-4 సార్లు రెజ్లింగ్ సమాఖ్య కార్యాలయానికి వెళ్లాను," అని వివరించాడు. రెజ్లింగ్ కోచింగ్‌లో అనుభవ జ్ఞుడైన దహియా, ఢిల్లీలోని షాదాబ్ డెయిరీ ప్రాంతంలో చోటు రామ్ వ్యాయామశాల ద్వారా శిక్షణ అందిస్తున్నారు. రెండేళ్ల క్రితం, అప్పటి రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలతో బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, వినేశ్ ఫొగాట్‌లు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టారు. 2023 మే 10న మీడియాతో మాట్లాడుతూ, పూనియా కోచ్ నరేశ్ దహియాపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయని, అతనికి ఈ ఆందోళనను వ్యతిరేకించే అర్హత లేదని వ్యాఖ్యానించాడు. ఈ నిరాధార ఆరోపణలపై దహియా పరువునష్టం కేసు దాఖలు చేశాడు. ఆయన 2019లోనే ఆ కేసులో నిర్దోషిగా విడుదలయ్యారని కోర్టుకు తెలిపాడు. ఈ నేపథ్యంలో పాటియాలా హౌస్ కోర్టు పూనియాకు సమన్లు జారీ చేసి, మే 17, 2025న బెయిల్ మంజూరు చేసింది.

# అడ్డదారుల్లో బంగ్లా శరణార్థులు

- ఆధార్ కార్డులు సహా సకల సౌకర్యాలు
- నేరాలుచేస్తూ ఇక్కడే ఉండేలా నైజీరియన్లు
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆనంద్ వెల్లడి



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** హైదరాబాదులో నేరాలు చేస్తున్న నైజీరియన్స్‌ను డిపోర్ట్ చేస్తున్నట్లు- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డిపోర్టు చేసిన తర్వాత కూడా చాలా మంది నకిలీ పాస్‌పోర్ట్ లతో ఇండియాలోకి ప్రవేశిస్తున్నారని, అలాంటి వాళ్లను కూడా అరెస్ట్ చేస్తున్నట్లు- వెల్లడించారు. హైదరాబాద్ లో జోనల్ సైబర్ సెల్స్ ను ప్రారంభించిన కార్యక్రమంలో ప్రసంగించారు. నైజీరియన్లను వాళ్ళ దేశానికి డిపోర్ట్ చేస్తారని భయంతో ఏదో ఒక కేసులో ఇన్వాల్వ్ అవుతున్నారని సంచలన విషయాన్ని తెలిపారు. చివరికి 498 కేసులో అయిన ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టించు కుంటున్నారని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. నైజేరియన్స్ పై కేసు నమోదు అయితే చట్టపరంగా డిపోర్ట్ చేయలేమని స్పష్టం చేశారు. వారిపై కేసు ట్రయల్ పూర్తి చేసి క్లోజ్ అయ్యే వరకు డిపోర్టు చేయలేమని వివరించారు. బంగ్లాదేశ్ కి చెందిన పౌరులు కూడా శరణార్థులుగా ఇక్కడికి వస్తున్నారని.. ఈ వ్యవహారాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు- తెలిపారు. అడ్డదారుల్లో ఇక్కడ ఆధార్ పొందుతున్నట్లు- గుర్తించినట్లు- చెప్పారు. ఈ వ్యవహారంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. ఉగ్రవాద లింక్స్ ఉన్న సమీర్ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుందని సీపీ స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఎన్ఐఏ నాలుగు చోట్ల సోదాలు చేసిందని.. ఎన్ఐఏ విచారణ, సోదాలకు హైదరాబాద్ పోలీసుల సహకారం అడిగితే చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ లో సమీర్ తో ఇంకా ఎవరెవరికి లింక్స్ ఉన్నాయనే అంశాన్ని ఎన్ఐఏ దర్యాప్తులో బయటికి వస్తాయని తెలిపారు. అలాగే.. ఫోన్ టాపింగ్ కేసులో విచారణ కొనసాగుతుందని సీవీ ఆనంద్ వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని..ప్రస్తుతానికి ఉన్న చర్యలు అన్ని హోల్డింగ్ లోకి వెళ్లిపోతాయన్నారు. కొత్త పాస్‌పోర్టు జారీ ప్రక్రియ మొత్తం కూడా విదేశీ వ్యవహారాల శాఖ చూసుకుంటుందని.. పాస్‌పోర్టు ఎప్పుడు ఎలా జారీ చేస్తారనే విషయాన్ని తాము కూడా తెలుసుకోవాలన్నారు. ఇంటర్‌పోల్, డిస్పోర్ట్ ఇతర ఇతర చర్యలు అన్ని కూడా హోల్డింగ్ లోకి పోతాయని వెల్లడించారు.

# ఢిల్లీకి చేరిన మాదిగ సామాజిక ఎమ్మెల్యేలు

- మంత్రివర్గంలో చోటు కోసం డిమాండ్



**న్యూఢిల్లీ, మే29 (జనంసాక్షి) :** తెలంగాణ కేబినెట్ విస్తరణ వివాదం ఢిల్లీకిచేరింది. కేబినేట్‌లో తమకు అవకాశం ఇవ్వాలని మాదిగ సామాజికవర్గం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీలో నలుగురు తెలంగాణ కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు మకాం వేశారు. అడ్లూరు లక్ష్మణ్, మందుల సామెల్, కవ్వం పల్లి సత్యనారాయణ, లక్ష్మీ కాంతారావు ఢిల్లీకి వెళ్లారు. వీరు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వీరు కలువనున్నారు. మంత్రివర్గ విస్తరణలో తమ సామాజిక వర్గ ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను ఈ నలుగురు ఎమ్మెల్యేలు కోరనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం గురించి సీఎం, పీసీసీ, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌కు తెలిపే ఢిల్లీ వచ్చామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ అన్నారు. మాదిగ కులస్తునికి ఖచ్చితంగా కేబినెట్‌లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మాదిగ సామాజికవర్గం పెద్ద సామాజిక వర్గమన్నారు. తమ సామాజిక వర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గ ప్రతినిధి ఉండాలన్నారు. మాదిగ వర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు అండగా ఉందని తెలిపారు. మాలలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం పట్ల తమకు అభ్యంతరం లేదని చెప్పారు. మంత్రివర్గంలో ఎవరుండాలనేది నిర్ణయించేది అధిష్టానం కాబట్టి ఢిల్లీ వచ్చామన్నారు. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి కచ్చితంగా స్థానం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. మొదటి కేబినెట్ ఏర్పాటు-లోనే తమకు అవకాశం దక్కుతుందని భావించామని.. ఇప్పుడు రెండోసారి కేబినెట్ విస్తరణ జరుగుతుంది కాబట్టి ఇప్పుడు మరోసారి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. మాదిగ సామాజిక వర్గంలో ఏ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చిన తమకు అభ్యంతరం లేదని నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

## ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్‌కు గద్దర్ అవార్డు

- ఇదొక గౌరవంగా భావిస్తున్నా: అల్లు అర్జున్



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడు(పుష్ప-2) అవార్డు దక్కింది. దీనిపై తాజాగా అల్లు అర్జున్ ఎక్స్ వేదికగా స్పందించారు. తనకు ఈ అవార్డును ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపాడు. పుష్ప-2 సినిమాకు గాను తొలిసారి బెస్ట్ యాక్టర్ అవార్డు తీసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ గౌరవాన్ని నాకు కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన ఘనత అంతా మా డైరెక్టర్ సుకుమార్, ప్రొడ్యూసర్లు, మా మూవీ టీమ్ కే దక్కుతుంది. ఈ అవార్డు నా ఫ్యాన్స్ కు అంకితం చేస్తున్నాను. అభిమానులు చూపించే అవాజ్యమైన ప్రేమ, మద్దతు నాలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటాయి' అంటూ అల్లు అర్జున్ రాసుకొచ్చారు. ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో పుష్ప మొదటి పార్టుకు జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే.

## యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ అరెస్ట్

- చెన్నైలో అదుపులోకి తీసుకున్న ఎన్‌ఐఏ అధికారులు



**చెన్నై, మే 29 (జనంసాక్షి) :** యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. చెన్నై విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలే సన్నీ యాదవ్ బైక్‌పై పాకిస్థాన్ వెళ్లి వచ్చాడు. దీంతో పాకిస్థాన్ పర్యటనకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పాకిస్థాన్‌లో ఎవరితోనైనా సంబంధాలు కలిగి ఉన్నాడా? ఎలాంటి గూఢచర్యం చేశాడన్న విషయాలపై ఆరా తీస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన జ్యోతి మల్హోత్రాతో సహా పలువురిని జాతీయ దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జ్యోతి మల్హోత్రా.. పాకిస్థాన్ అధికారులతో చాలా క్లోజ్‌గా తిరిగింది. పాకిస్థాన్ ఐఎస్ఐతో కూడా మంచి సంబంధాలు ఉన్నట్లుగా గుర్తించారు. ఇక జ్యోతి మల్హోత్రాకు సంబంధించిన యూట్యూబ్‌లో పాకిస్థాన్‌కు సంబంధించిన అనేక వీడియోలు ఉన్నాయి. ఆమె పాకిస్థాన్‌కు మూడు సార్లు వెళ్లి వచ్చింది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడికి ముందు కూడా జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌కు వెళ్లినట్లు-గా గుర్తించినట్లు- సమాచారం. పహల్గామ్‌కు సంబంధించిన వీడియోలను జ్యోతి మల్హోత్రా.. పాక్ అధికారులకు చేరవేసినట్లు- అనుమానించారు. ప్రస్తుతం ఆమె హర్యానా జైల్లో ఉంది. 9 రోజుల పాటు- ఆమెను దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మందిని హతమార్చారు. అనంతరం భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు సింధు జలాలు నిలిపేసింది. పాక్ వీసాలను రద్దు చేసింది. అటారీ సరిహద్దును మూసేసింది. అనంతరం మే 7న భారత్.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ ఘటనలో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి.

## మారు వేషంలో కలెక్టర్ పర్యటన

- గుంతకల్లు ఆస్పత్రి పరిశీలించి ఆరా



**అనంతపురం, మే29 (జనంసాక్షి) :** అనంత జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్ కుమార్ మారువేషంలో జిల్లాలో పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన ఈ పని చేశారు. ప్రజాసేవకు నూతన మార్గంగా జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలతో.. అనంతపురం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తాజాగా, కలెక్టర్ వినోద్ కుమార్ మారువేషంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో అర్ధరాత్రి తనిఖీలు చేశారు. అయితే, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సామాన్యుడిలా గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కలియతిరుగుతూ.. రోగుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖానికి మాస్క్, మెడలో టవల్ కప్పుకుని ప్రభుత్వ ఆసుపత్రి మొత్తాన్నీ పరిశీలించారు. ఆసుపత్రి బయట చెప్పులు విడిచి వెళ్లి.. రోగులు, ప్రభుత్వాసుపత్రి సిబ్బందిని కలెక్టర్ వినోద్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## నీటి ప్రవాహంలో యువకుని గల్లంతు



**జైనథ్, మే 29 (జనంసాక్షి) :** జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో తాత్కాలికంగా నిర్మించిన తర్నం బ్రిడ్జి పైనుండి ఉప్పొంగిన నీటి ప్రవాహానికి లాండే దత్తు అనే యువకుడు కళ్ళతో కావడంతో ఆ కుటుంబంలో కన్నీటి చ , ా య ్ ల ం మిగిలిపోయాయి. కాంట్రాక్టర్ ఎటువంటి హెచ్చరికలు పెట్టకపోవడం వల్లనే ఇలాంటి సంఘటన జరిగిందని మాజీ మంత్రివర్యులు జోగు రామన్న ఈ సంఘటనపై విత్ బ్రాంతి చందారు లాండే దత్తు ఆయన కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి, కాంట్రాక్టర్ డిమాండ్ చేశారు మాజీ మంత్రివర్యుల తోపాటు లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ ఆడప తిరుపతి ఉప సర్పంచ్ గాజంగుల స్వామి యువజన నాయకుడు దాసరి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌కు సజ్జనార్ అభినందనలు



**నకిరేకల్, మే 29 (జనంసాక్షి) :** ఈ నెల 25న ఆర్టీసి బస్సు సూర్యాపేట నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సులో సూర్యాపేటకు చెందిన రామిశెట్టి శాంతకుమారి అనే మహిళ ప్రయాణిస్తుంది. హైదరాబాద్ చేరుకోగానే మహిళ బస్సులో బ్యాగ్ మరిచి దిగి వెళ్లిపోయింది. గమనించిన నకిరేకల్ పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన బస్సు డ్రైవర్ పాషా, కండక్టర్ అంజయ్య బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో 6 తులాల బంగారం, మొబైల్, కొంత డబ్బు ఉన్నది. వెంటనే వారు డిపో మేనేజర్‌కు తెలిపి సదరు ప్రయాణికురాలికి బ్యాగ్ అందజేశారు. విషయం తెలిసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఇంతటి నిజాయితీ చూపని డ్రైవర్, కండక్టర్‌ను హైదరాబాద్‌లోని బస్ భవన్‌కు పిలిచి సన్మానించి అభినందించారు.

# అధికారం కోసం రాజకీయ డ్రామాలు

- ఎందరో ఉద్యమకారులను మింగిన బిఆర్ఎస్
- అధికారం కోసం ఏమైనా చేసే కెసిఆర్ కుటుంబం
- ఎందరో రాజకీయ జీవితాలను నాశనం చేసిన ఘనత
- కెసిఆర్ ఫ్యామిలీపై మండిపడ్డ ఎమ్మెల్యే యెన్నం



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** బీఆర్ఎస్‌లో కవిత ఎపిసోడ్ తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. కవిత తన తండ్రి కేసీఆర్‌కు లేఖ రాయడం, లేఖలోని అంశాలు, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. అలాగే కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న పరిస్థితులపై అధికారపక్ష నేతలు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. ఇందంతా డ్రామా అటూ కొట్టిపారేస్తున్నారు. తాజాగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ.. కల్వకుంట్ల ఫ్యామిలీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత కుటుంబ సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చేందుకే ఇలాంటి కుతంత్రాలకు తెరతీశారంటూ మండిపడ్డారు. ఇదంతా కేవలం స్టంట్ రాజకీయమని అన్నారు. భారత దేశం కర్మ భూమి అని.. ఇక్కడి పాపలకు ఇక్కడే శిక్ష అనుభవించాలన్నారు. ఉద్యమకారుల గొంతులను కొడుకు, బిడ్డలు కోశారని.. అందులో కవిత పాత్ర కూడా ఉందని ఆరోపించారు. ఎంతో మంది రాజకీయ జీవితాలతో ఆడుకున్న కుటుంబం వాళ్ళది అంటూ కల్వకుంట కుటుంబంపై విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబాన్ని మేనేజ్ చేసుకోలేని వ్యక్తి తెలంగాణను మళ్ళీ ఎలా పాలిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం ఉంటే తెలంగాణ నాశనం అవుతుందని అప్పుడే చెప్పానన్నారు. పనికి రాని ప్రాజెక్టులు కట్టి.. అప్పులు ప్రజలకు రుద్దారని ఫైర్ అయ్యారు. అధికారం లేకపోతే ఒక్క నిముషం కూడా ఉండలేని కుటుంబం అని.. సొంత కుటుంబం సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారని అన్నారు. దీనితో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అధికారంలోకి రావడానికే కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. కేకే, మహేందర్ రెడ్డిని గెంటేసింది తమరు కాదా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పెట్టడానికి, అధికారంలోకి రావడానికి కృషి చేసిన వేలమంది గొంతులు తడిగుడ్డతో కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు కల్వకుంట్ల కుటుంబం కొత్త సినిమా చూపిస్తోందని అటూ కామెంట్స్ చేశారు. పాలనకు కేటీ-ఆర్ అనర్హుడని కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ అధికారం కోసం మాత్రమే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. అధికార దాహం కోసం చూస్తున్నారన్నారు. కేసీఆర్‌ను మరోసారి అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రజలు సిద్ధంగా లేరని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వీరి డ్రామాలు ఇక చాలించాలని, ప్రజలుకూడా వీరి రాజకీయాలు గమనించాలని అన్నారు.

# ప్యాకేజీ లభిస్తే బిజెపిలో బిఆర్ఎస్ విలీనం

- ఇలాంటి రాజకీయాలతోనే బిజెపి నష్టపోతోంది
- కవిత వ్యాఖ్యల నేపథ్యంలో రాజాసింగ్ సంచలన కామెంట్స్



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకు అడ్డుగా ఉన్న తనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అయితే.. కవిత కామెంట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ ది రికార్డు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు నిజమేనని తాను భావిస్తున్నానంటూ తెలిపారు. బీజేపీకి చెందిన కొంతమంది నేతలు పెద్ద ప్యాకేజీ లభిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉంటారని వ్యాఖ్యానించారు. ప్రతి ఎన్నికల్లో మా వాళ్లు కుమ్మక్కై-పోతారు, అందుకోసమే బీజేపీకి ఎంతో నష్టం జరిగిందని రాజాసింగ్ అన్నారు. ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయినది, ఎందుకు అనే విషయాన్ని సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. చెబితే వారిని సస్పెండ్ చేస్తారు. అందుకే కార్యకర్తలు గానీ, నాయకులు గానీ పాపం నోరు మూసుకొని కూర్చుంటున్నారని ఆయన వాపోయారు. ఇదే సందర్భంగా బీఆర్ఎస్‌పై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు నిజమే అని అనుకుంటున్నాని అన్నారు. ఒకవేళ బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పోటీ చేయాలని అనుకుంటే ఎక్కడి నుంచి నిలబడాలి అనేది కూడా బీఆర్ఎస్ వాళ్లే డిసైడ్ చేస్తారన్నారు. గతంలో కూడా ఇదే జరిగిందని అందుకే బీజేపీ నష్టపోయిందని అన్నారు. ప్రతీ ఎన్నికల్లో తమ పార్టీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. దీని వల్ల బీజేపీ చాలా నష్టపోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఈ విషయం తెలుసని.. అయినా ఎవరూ బయటపడరన్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకు వెళ్తే సస్పెండ్ చేస్తారనే భయంతో కార్యకర్తలు, అధికారులు నోరు మూసుకుని కూర్చున్నారంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు రాజాసింగ్ ఓ లేఖను విడుదల చేశారు. అయితే సొంత పార్టీపై విమర్శలు చేయడం రాజాసింగ్‌కు కొత్తేమీ కాదు. గతంలో కూడా బీజేపీపై పలు విమర్శలు చేశారు. పదేళ్ల పాటు- బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పూర్తి స్థాయిలో అధికారపార్టీకి తొత్తులుగా మారేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అధికారంలో ఎవరు ఉంటే వారితో చేతులు కలుపుతూ వారికి వంత పాడటం అనేది బీజేపీ రాష్ట్ర నాయకుల్లో కొంతమందికి అలావాటు- అయ్యిందని, పాత స్క్రాబ్‌ను తీసివేస్తే తప్ప పరిష్కారం లభించదంటూ గతంలో కూడా రాజాసింగ్ హాట్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే.

## కేసీఆర్ అసలు రంగు బయటపడింది

- తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** కవిత వ్యాఖ్యలతో కేసీఆర్ అసలు రంగు బయటపడిందని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్‌ను కలపాలని ఆయన చూసినట్లు బయటపడిందని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న ముసుగు తొలగిపోయిందని చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి 8 సీట్లు రావడానికి బీఆర్ఎస్ పార్టీనే కారణమని అన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బ తీయడానికి ఆ రెండు పార్టీలు ఏకమయ్యాయని చెప్పారు బీర్ల ఐలయ్య. కేసీఆర్ ఎందుకు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారో కవిత బయట పెట్టాలని బీర్ల ఐలయ్య కోరారు. కేటీఆర్ బండారాన్ని కవిత బయట పెట్టిందని చెప్పుకొచ్చారు. పార్టీ నుంచి కవితను బయటకు పంపించడానికి కేటీఆర్ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సొంత చెల్లిని చూసి ఓర్వలేని కేటీఆర్ తెలంగాణ ఆడబిడ్డలను ఎలా గౌరవిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీఆర్ దమ్ముంటే కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీతో డీల్‌పైన బీఆర్ఎస్ కార్యకర్తలకు సమాధానం చెప్పాలని కోరారు. కుటు-oబాన్ని చక్కపెట్టుకోలేని కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడుతారా అని బీర్ల ఐలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కెసిఆర్ ఫ్యామిలీ డ్రామాలు అదుర్స్

- కవిత లేఖ..వ్యాఖ్యలతో మరింత స్పష్టం: ఆది శ్రీనివాస్

**కరీంనగర్, మే29 (జనంసాక్షి) :** బిఆర్ఎస్‌లో రాజకీయ డ్రామాలు పరాకాష్టకు చేరాయని, డాడీ డాటర్ లేఖపై ప్రజల్లో చర్చ జరుగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కవిత లేఖతో కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని ప్రజలు గ్రహించారన్నారు. అలాగే తాజాగా కవిత వ్యాఖ్యలు చూస్తుంటే ఫ్యామిలీ గొడవలు తారాస్థాయికి చేరాయని అర్థం అవుతోందన్నారు. తెలంగాణ ప్రజలను వంచింది, ఎందరో ఉద్యమకారులను అణచివేసి అధికారం అనుభవించారని అన్నారు. అధికారం కోసం రాష్ట్రం ఏమైనా ఫర్వాలేదని అప్పులు చేసిన ఘనమైన కుటుంబం వారిదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం విచారణ సమయంలో ఇలాంటి డ్రామాలను ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరును ప్రజలు మెచ్చుకుంటున్నారని తెలిపారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిజమే అని కవిత లేఖతో స్పష్టమైందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# బిఆర్ఎస్‌లో దయ్యాలను పెంచి పోషించిన కెసిఆర్

- పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారు
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు



**కామారెడ్డి, మే29 (జనంసాక్షి) :** ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. కేసీఆర్ దేవుడు.. కానీ ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్న కవిత కామెంట్స్పై ఆయన రియాక్ట్ అయ్యారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని.. ఆయన కూతురు కవిత చెప్పిన దాంట్లో అబద్ధం ఏమి లేదు. బీఆర్ఎస్లో ఆ దెయ్యాలను పెంచి పోషించింది స్వయంగా కేసీఆరేనని జూపల్లి హాట్ కామెంట్స్ చేశారు. గురువారం కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. గత పదేళ్లు తెలంగాణను పాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కార్ చేసిన అప్పులకు ప్రతి నెల మా ప్రభుత్వం వడ్డీ కడుతోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బీఆర్ఎస్ ఆగం చేసిన.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మా ప్రభుత్వం పథకాలను ఆపకుండా నిరంతరంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. కానీ అమెరికా మాట విని మధ్యలోనే ఆపరేషన్ సిందూర్ ఆపడం సరికాదని అన్నారు. ఇందిరాగాంధీ ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపారని.. ఆమె హయాంలో పాక్‌తో యుద్ధం ఆపడానికి అమెరికా రాయబారం చేస్తే అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దని అగ్రరాజ్యానికి తేల్చి చెప్పారని గుర్తు చేశారు. ఇక, తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు గెలుపు దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 70, 80 శాతం సీట్లు- కైవసం చేసుకోవాలని సూచించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370